# ఆర్గాన్ న్యూస్

VOICE OF DEMOCRACY

తెలుగు దినపత్రిక

సంపుటి :17 సంచిక :72 ఖమ్మం, తెలంగాణ మంగళవారం 25.03.2025 పేజీలు :12, వెల : 2/-

Circulating to : Hyderabad, Khammam, Warangal, Nalgonda, Karimnagar, Adilabad, Medak and Mahabubnagar



**విలేకరులు కావలెను**

ప్రజా సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి "ఆర్గాన్ న్యూస్" ఛానల్, దినపత్రిక ఆహ్వానం పలుకుతోంది. పని చేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని అన్ని నియోజకవర్గాల నుంచి రిపోర్టర్లు కావలెను.

పూర్తి వివరాలకు సంప్రదించండి

**98481 56178**





## ఎస్ఎల్‌బిసి టన్నెల్ వద్ద సహాయక చర్యలు కొనసాగించాలి

**సీనియర్ ఐఏఎస్‌కు పర్యవేక్షణ బాధ్యతలు**

**సిఎస్‌ను ఆదేశించిన సిఎం రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్, మార్చి 24 :** ఎస్ఎల్‌బిసి టన్నెల్‌లో జరిగిన ప్రమాద ఘటనలో సహాయక చర్యలను కొనసాగించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎస్ఎల్‌బీసీ ప్రమాద ఘటనలో ఇప్పటి వరకు జరిగిన సహాయక చర్యల్లో పురోగతిపై సీఎం రేవంత్ సోమవారం మంత్రులు, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా టన్నెల్ వద్ద ఇప్పటివరకు చేపట్టిన చర్యలను అధికా రులు సీఎంకు వివరించారు. అనం తరం అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. టన్నెల్ వద్ద సహాయక చర్యల నిరంతర పర్యవే క్షణకు ఒక సీనియర్ ఐఏఎస్ అధికా రిని నియమించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని ఆదేశించారు.

మిగతా 2 లో

## కాంగ్రెస్ అగ్రనేతలతో తెలంగాణ నేతల భేటీ

**మంత్రివర్గ విస్తరణ తదితర అంశాలపై చర్చ**

**సిఎం రేవంత్, భట్టి తదితరుల రాక**

02




# ఎల్ఆర్ఎస్ గడువు పొడిగించేది లేదు

## నెలాఖరు వరకు 25శాతం రాయితీతో అమలు

- త్వరలోనే భూముల విలువ పెంపు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి

> ఎల్ఆర్ఎస్ గడువు పొడగించే ఆలోచన లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఎల్ఆర్ఎస్ పర్మిషన్ ఇప్పుడు కాకుండా ఇళ్ళు కట్టేటప్పుడు కావాలంటే అప్పుడు వందశాతం ఎల్ఆర్ఎస్ కట్టాల్సి ఉంటుందని అన్నారు. ఎల్ఆర్ఎస్‌కు ఆశించిన మేర స్పందన ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఎల్ఆర్ఎస్ స్కీమ్‌పై మంత్రి పొంగులేటి కీలక వ్యాఖ్యలు చేశారు. ఎల్ఆర్ఎస్ స్కీమ్ గడువు మార్చ్ 31 వరకు ఉందని.. ఆలోపు చేసుకున్న వారికి 25 శాతం డిస్కౌంట్ ఇస్తున్నామని తెలిపారు.

**హైదరాబాద్, మార్చి 24 :** సోమవారం మీడియా ప్రతినిధులతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చిట్ చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో భూవిలువలను పెంచబోతున్నామని తెలిపారు. త్వరలో భూ సర్వే కోసం ప్రతీ మండలానికి సర్వేయర్, డిప్యూటీ– సర్వేయర్‌ను నియమిస్తామని.. అలాగే లైసెన్డ్ సర్వేయర్‌లకు అవకాశం ఇస్తామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 6 వేల మంది లైసెన్డ్ సర్వేయర్లు ఉన్నారని వీరికి శిక్షణ ఇచ్చి అవకాశం కల్పిస్తామన్నారు. సాదాబైనామాల విషయంలో కొత్త దరఖాస్తు లను స్వీకరించమని తేల్చి చెప్పారు. పాత దరఖాస్తులలో 13 లక్షల అప్లికేషన్లను గత ప్రభుత్వం తరస్కరించిందని దరఖాస్తు తిరస్కరణకు

మిగతా 2 లో

## పార్లమెంట్ క్యాంటీన్‌లో అరకు కాఫీస్టాల్

- ప్రారంభించిన కేంద్రమంత్రి కిరణ్ రిజిజు
- హాజరైన మంత్రి పీయూష్ గోయల్ జూవల్ ఓరం

03




## ఖజానా ఖాళీ చేస్తూ పోతే ఎలా?

- ఆచరణసాధ్యమైన హామీలు ఇవ్వండి
- అసెంబ్లీలో గళమెత్తిన అక్బరుద్దీన్




02



03

## పట్టపగలే లాయర్ హత్య



### బోగీలో ఒంటరి యువతిపై అత్యాచారానికి యత్నం

- తప్పించుకునే క్రమంలో రైలునుంచి దూకిన యువతి

02



### హైడ్రాపేరుతో దందాలు చేస్తే కఠిన చర్యలు

హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరిక

02



03

### ఇచ్చిన వాగ్దానాలు అడిగితే నిర్బంధాలా..?

అరెస్టు చేసిన ఆశావర్కర్లను వెంటనే విడుదల చేయాలి : హరీశ్‌రావు

## నివేదిక అందగానే పంట నష్టపరిహారం

- రాష్ట్రంలో 11,298 ఎకరాలలో పంట
- వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటన



**హైదరాబాద్, మార్చి 24 :** రాష్ట్రంలో ఇటీవల కురిసిన అకాల వర్షాలతో జరిగిన పంట నష్టానికి రైతులకు పరిహారం చెల్లిస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అసెంబ్లీలో సోమవారం ప్రకటించారు. జీరో అవర్‌లో పలువురు ఎమ్మెల్యేలు అకాల వర్షాల అంశాన్ని ప్రస్తావించారు.

మిగతా 2 లో



## నా సస్పెండ్‌పై ఎందుకు బులెటెన్ విడుదల చేయలేదు

- జగదీశ్‌రెడ్డిని అసెంబ్లీ లోపలకు వెళ్లకుండా అడ్డుకున్న మార్షల్
- కాంగ్రెస్ పాలనకు పరాకాష్ట
- ప్రజాధనం వృథా చేస్తున్న మంత్రులు : మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

03

> తన సస్పెండ్‌పై ఎలాంటి బులెటిన్ విడుదల ఎందుకు విడుదల చేయలేదని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రశ్నించారు. కాంగ్రెస్ దుర్మార్గపు పాలనకు ఇది ఒక నిదర్శనమని ఆయన ఆరోపించారు.



## ఎంపిలకు భారీగా పెరిగిన వేతనాలు

- కనీసం నెలకు లక్ష పెంచిన కేంద్రం
- ఎంపిల పెన్షన్ కూడా భారీగా పెంపు

**న్యూఢిల్లీ, మార్చి 24 :** పార్లమెంటు సభ్యుల వేతనాలను భారీగా పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. అలాగే రోజువారీ భత్యాలను, ఎంపిల పెన్షన్లు కూడా భారీగానే పెంచారు. ఈ మేరకు నోటిపికేసన్ విడుదలయ్యింది. ఇప్పటికే ఎంపిల జీతభత్యాలపై విమర్శలు వస్తున్నా మరోమారు జీతాలను పెంచడం విశేషం. ద్రవ్యోల్బణ సూచీ ఆధారంగా ఎంపీల జీతాన్ని దాదాపు 24శాతం మేర పెంచారు.

మిగతా 2 లో

## ఆర్ఎస్ఎస్ నీడలో దేశీయ విద్య

**జంతర్‌మంతర్ వద్ద ధర్నాలో రాహుల్**

**న్యూఢిల్లీ, మార్చి 24 :** భారతీయ విద్యావ్యవస్థను రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆర్ఎస్ఎస్ నాశనం చేస్తోందని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. ఎన్ఇపి 2020, యుజిసి ముసాయిదా నిబంధనలు, పేపర్ లీక్‌లకు వ్యతిరేకం గా ఎన్ఎస్‌యుఐ సోమవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో చేపట్టిన నిరసనలో రాహుల్‌గాంధీ పాల్గన్నారు.

మిగతా 2 లో





## శ్రవణ్ రావుకు సుప్రీంలో ఊరట

- అరెస్ట్ చేయొద్దంటూ ఉత్తర్వులు
- విచారణకు హాజరు కావాలని ఆదేశం

02



## ఎస్‌ఎల్‌బిసి టన్నెల్ వద్ద సహాయకచర్యలు కొనసాగించాలి

(మొదటిపేజీ తరువాయి)

నిపుణుల కమిటీ సూచనలను తీసుకుంటూ కేంద్రం నుంచి అవసరమైన అనుమతులు తీసుకుని రెస్క్యూ ఆపరేషన్‌లో ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న ఆయా విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా దోమలపెంట సమీపంలో శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ టన్నెల్ దగ్గర ఫిబ్రవరి 22వ తేదీ ఉదయం ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. రిటైనింగ్ వాల్ కడుతుండగా 14వ కిలో మీటర్ వద్ద 3 మీటర్ల మేర పైకప్పు కుంగిపోయింది.. రిటైనింగ్ వాల్ కూలి టన్నెల్‌లో రింగులు విరిగిపడడంతో.. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ ఘటనలో 8 మంది కార్మికులు టన్నెల్‌లో చిక్కుకుపోయారు. భారీగా బురద, నీరు ఉబకడంతో పాటు- ధ్వంసమైన టన్నెల్ బోరింగ్ మిషన్ పరికరాలు రెస్క్యూ ఆపరేషన్ ఛాలెంజింగ్‌గా మారాయి. అయినప్పటికీ సహాయక బృందాలు తీవ్రంగా కృషి చేసి ఘటన స్థలం వద్దకు చేరుకున్నాయి. టన్నెల్ వద్ద దాదాపు నెల రోజులుగా సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయి. ఎట్టకేలకు 16వ రోజు ఓ కార్మికుడి డెడ్ బాడీని వెలికితీశాయి. మిగిలిన ఏడుగురి మృతదేహాలను బయటకు తీసేందుకు రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది.

## ఎల్‌ఆర్‌ఎస్ గడువు పొడిగించేది లేదు

(మొదటిపేజీ తరువాయి)

గుర్తైనవారు అప్పిలేట్ ఆథారిటిలో అప్పీల్ చేసుకోవచ్చని తెలిపారు. కేంద్రం ప్రధాని అవాస్ యోజన కింద అర్బన్ ఏరియాలో 1 లక్ష 13 వేల ఇళ్లను మంజూరు చేశామని చెప్పారు. అర్బన్ ఏరియాలో కట్టే ఇళ్లకు కేంద్రం రూ.1.50 లక్షలు మాత్రమే ఇస్తుందని.. మిగతాది రాష్ట్ర ప్రభుత్వం భరిస్తోందని తెలిపారు. రూరల్ ఏరియాకు సంబంధించి కేంద్రం ఇంకా ఎలాంటి క్లారిటీ- ఇవ్వలేదని పేర్కొన్నారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డితో విభేదాలు ఉన్నట్లు జరుగుతోన్న ప్రచారంపై మంత్రి పొంగులేటి స్పష్టత ఇచ్చారు. తనకు, ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డికి మధ్య ఎలాంటి సమస్య లేదని చెప్పారు. అనిరుధ్ రెడ్డితోనే కాకుండా ఇతర ఏ ఎమ్మెల్యేతో కూడా విభేదాలు లేవని వివరణ ఇచ్చారు.

## నివేదిక అందగానే పంట నష్టపరిహారం

(మొదటిపేజీ తరువాయి)

తమ నియోజకవర్గంలో వెయ్యి ఎకరాల్లో పంటలకు నష్టం జరిగిందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి వాపోయారు. మంత్రి తుమ్మల స్పందిస్తూ.... "ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. రైతులకు పరిహారం ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారు. ఈ మేరకు జిల్లాల కలెక్టర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. తుది నివేదిక అందిన వెంటనే పరిహారం ఇస్తాం" అని వివరించారు. సభ అనంతరం మంత్రి తన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని 64 మండలాల్లో 11,298 ఎకరాలలో పంటలకు నష్టం జరిగిందని, వాటిలో వరి(6,670 ఎకరాలు), మొక్కజొన్న(4,100), మామిడి(309 ఎకరాలు) ఉన్నాయని అధికారులు నివేదించారు. ఎకరానికి రూ.10 వేలు పరిహారం ఇస్తామని మంత్రి వెల్లడించారు. జీరో అవర్‌లో పలువురు ఎమ్మెల్యేలు వివిధ సమస్యలను అసెంబ్లీలో లేవనెత్తారు. "బెట్టింగ్ యాప్‌ల వ్యవహారం వెనుక ఓ మాజీ మంత్రి ప్రమేయం ఉన్నట్లు తెలుస్తోంది. విచారణ జరిపి అసలైన దోషుల్ని శిక్షించాలి" అని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్ అగ్రనేతలతో తెలంగాణ నేతల భేటీ

- మంత్రివర్గ విస్తరణ తదితర అంశాలపై చర్చ
- సిఎం రేవంత్, భట్టి తదితరుల రాక

**న్యూఢిల్లీ, మార్చి 24 :** కాంగ్రెస్ అగ్రనేతలతో సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క తదితరులు భేటీ అయ్యారు. కాంగ్రెస్ ముఖ్య నేతలు ఢిల్లీలోని ఇందిరాభవన్‌లో ఆ పార్టీ అగ్రనేతలతో భేటీ అయ్యారు. ఢిల్లీకి వెళ్లిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.. ఏఐసీసీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్‌తో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ కూడా ఉన్నారు. తెలంగాణలో ప్రస్తుతం నెలకొన్న తాజా రాజకీయ పరిణామాలు, కేబినెట్ విస్తరణపై ఈ భేటీలో ప్రధానంగా చర్చించించినట్లు సమాచారం. మరోవైపు, తెలంగాణలో అమలవుతున్న కార్యక్రమాల పైనా ఏఐసీసీ అధిష్ఠానంలోని పెద్దలతో చర్చించనున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు, అమలు చేసినవి, పెండింగ్‌లో ఉన్నవాటిపై ఈ భేటీలో చర్చకు వచ్చినట్లు తెలుసతోంది. కాగం÷-రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేస్తోందని వివరించినట్లు తెలుస్తోంది. ప్రధానంగా మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పదవుల పందేరంపై ఢిల్లీ పెద్దలకు వివరించినట్లు తెలుస్తోంది. ఏడాదికి పైగా ఈ అంశం పెండింగ్‌లో ఉంది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగిశాక ఉగాది నాటికి మంత్రివర్గ విస్తరణ పూర్తయ్యే అవకాశాలున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇప్పటికే మీనాక్షి నటరాజన్ రాష్ట్ర వ్యవహారాలను ఆకళింపు చేసుకుని పెద్దలకు నివేదిక అందించారని అంటున్నారుజ

## విరిగిపడ్డ స్టీరింగ్ రాడ్

### పొలాల్లోకి దూసుకెళ్లిన బస్సు

**సిద్ధిపేట, మార్చి 24 :** జిల్లాలో పెద్ద ప్రమాదం తప్పింది. బస్సు స్టీరింగ్ రాడ్డు విరగడంతో పంటపొలాల్లోకి దూసుకెళ్లింది ఆర్టీసీ బస్సు. దీంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి ప్రయాణికుల ప్రాణాలు కాపాడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. సిద్ధిపేట జిల్లా బెజ్జంకి మండల పరిధిలోని ముత్తన్నపేట స్టేజి సమీపంలో బస్సు స్టీరింగి విరిగింది. సరిగ్గా కల్వర్టు వద్దకు వచ్చే సరికి స్టీరింగ్ రాడ్డు విరిగి పల్లెవెలుగు బస్ పంట పొలంలోకి దూసుకెళ్లింది. దీంతో ప్రయాణికులు భయాందోళనతో కేకలు వేశారు. ప్రమాద సమయంలో బస్సులో 41 మంది ప్రయాణికులు ఉన్నారు. స్టీరింగ్ రాడ్డు విరగడంతో వెంటనే రోడ్డు దింపడం జరిగిందని డ్రైవర్ తెలిపాడు. ప్రమాదాన్ని ఊహించి రోడ్డు దింప డంతో బస్సు పొలాల్లోకి దూసుకువెళ్లిందని, ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదని చెప్పడు. ఏ ప్రమాదం జరగక పోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

## ఎంపిలకు భారీగా పెరిగిన వేతనాలు

(మొదటిపేజీ తరువాయి)

ఈ మేరకు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. అలాగే ప్రతి నెలా అందే వేతనాలు, పెన్షన్లను కూడా కేంద్రం పెంచింది. దీంతో ఒక్కో ఎంపీ వేతనం నెలకు రూ.లక్ష నుంచి రూ.1.24 లక్షలకు పెరగనుంది. సిట్టింగ్ సభ్యుల రోజువారీ భత్యాన్ని రూ.2వేల నుంచి 2,500కు పెంచుతున్నట్లు అందులో పేర్కొంది. మాజీ పార్లమెంటు సభ్యులకు ప్రస్తుతం ఇస్తున్న పెన్షన్‌ను రూ.25వేల నుంచి రూ.31వేలకు పెంచుతున్నట్లు నోటిఫికేషన్‌లో వెల్లడించింది. పెంచిన ఈ వేతనాలను 2023 ఏప్రిల్ 1 నుంచి వర్తింపజేస్తున్నట్లు తెలిపింది. పెరుగుతున్న ఖర్చులను దృష్టిలో పెట్టుకని ఈ పెంపును వర్తింప చేశారు. దీంతో ఖజానాపై భారీగానే భారం పడనుంది.

## ఆర్‌ఎస్‌ఎస్ నీడలో దేశీయ విద్య

(మొదటిపేజీ తరువాయి)



విద్యార్థులను ద్దేశించి రాహుల్‌గాంధీ మాట్లాడారు. మన విద్యావ్యవస్థ ఆర్‌ఎస్‌ఎస్ చేతుల్లోకి వెళితే దేశం నాశనమౌతుందని, ఉపాధి అంతరించిపోతుందని అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ నామినేట్ చేసిన అభ్యర్థులే ఇప్పుడు దేశమంతటా యూనివర్శిటీ-ల్లో వైస్ ఛాన్సలర్లుగా ఉన్నారని, ప్రస్తుతం రాష్ట్ర యూనివర్శిటీ-ల్లోనూ విసిలను ఆర్‌ఎస్‌ఎస్ నామినేట్ చేస్తోందని అన్నారు. దేశంలో ప్రస్తుతం నిరుద్యోగం అతిపెద్ద సమస్యగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని రోజుల క్రితం ప్రధాని కుంభమేళా గురించి ప్రస్తావించారు, కానీ ఉపాధి గురించి మాత్రం మా ట్లాడలేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశ యువతను నిరు ద్యోగులుగా మార్చిందని మండిపడ్డారు. ఉపాధి గురించి మోడీ ప్రభుత్వాన్ని నిలదీయాలని విద్యార్థులకు సూచించారు. దేశంలోని సంపదనంతా అంబానీ, అదానీలకు పంచిపెడు తోందని, అన్ని ప్రభుత్వ సంస్థలను ఆర్‌ఎస్‌ఎస్‌కు అప్పగిం డచం బిజెపి-ఆర్‌ఎస్‌ఎస్ మోడలన లక్ష్యమని అన్నారు. మనమందరం ఐక్యంగా వారిని తిప్పికొట్టాలని అన్నారు.

## ఖజానా ఖాళీ చేస్తూ పోతే ఎలా?

- ఆచరణసాధ్యమైన హామీలు ఇవ్వండి
- అసెంబ్లీలో గళమెత్తిన అక్బరుద్దీన్



**హైదరాబాద్, మార్చి 24 :** ఆచరణసాధ్యమైన హామీలు ఇవ్వండి.. ఖజానా ఖాళీ చేస్తూ పోతే ఎలా అంటూ అసెంబ్లీలో అక్బద్దీన్ గళమెత్తారు. తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు కొనసాగుతున్న వేళ, ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ సభలో తన ప్రత్యేక శైలిలో వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వాలు ఇచ్చే హామీలు, అవి అమలయ్యే విధానం, ప్రజలకు అందే ప్రయోజనాలను ఉద్దేశించి ఆయన నేరుగా ప్రభుత్వ తీరును ఉద్దేశించి విమర్శలు గుప్పించారు. అసెంబ్లీలో ప్రసంగిస్తున్న అక్బరుద్దీన్ ఓవైసీ, హైదరాబాద్‌లో ఉన్న ఇద్దరు ఫేకులు గురించి ఒక కథను వినిపించారు. ఈ కథ ప్రభుత్వాలు చేసే వాగ్దానాలను నమ్మే పరిస్థితి ఎంత అసాధారణంగా మారిందో చెప్పారు. ప్రభుత్వాలు ప్రజలకు ఎన్నో హామీలు ఇస్తుంటాయి. అయితే, ఆ హామీలను నెరవేర్చడానికి అవసరమైన నిధులు లేవు. 'ఇది చేస్తాం, అది ఇస్తాం' అంటూ ప్రజలను విశ్వసింపజేసేలా హామీలు ఇస్తూ, ఆర్థిక భారం పెంచుకుంటే రాష్ట్ర ఖజానా ఖాళీ అయిపోతోందని ఆయన అన్నారు. కేవలం ప్రచార హామీలతో కాకుండా, నిజంగా అమలు చేయగలిగే విధంగా హామీలు ఇచ్చి, ప్రజలకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నేను ఎవరినీ లక్ష్యంగా వ్యాఖ్యలు చేయడం లేదు, కానీ మధ్య తరగతి ప్రజలు నలిగిపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు చాలా హామీలు ఇచ్చినా, ప్రయోజనం పొందే స్థాయిలో ప్రజలకు అందడం లేదు. ఈ వ్యాఖ్యల ద్వారా, ప్రభుత్వ విధానాలను పునఃసమీక్షించి, అసలు లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వాలు పరిశీలనాత్మకంగా, ప్రజలకు నిజమైన ప్రయోజనం కలిగేలా నిర్ణయాలు తీసుకోవాలని ఆయన సూచించారు.

## బోగీలో ఒంటరి యువతిపై అత్యాచారానికి యత్నం

- తప్పించుకునే క్రమంలో రైలునుంచి దూకిన యువతి



**హైదరాబాద్, మార్చి 24 :** ఎంఎంటిఎస్ రైలులో ఓ యువతిపై కామాంధుడు అత్యాచారం చేయడానికి ప్రయత్నించడంతో ఆమె రైలులో నుంచి బయటకు దూకడంతో తీవ్రంగా గాయపడింది. ఈ సంఘటన మేడ్చల్ జిల్లా అల్వాల్ రైల్వే స్టేషన్ సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అనంతపురం జిల్లాకు చెందిన ఓ యువతి(23) మేడ్చల్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. గత కొన్ని రోజుల నుంచి సెల్‌ఫోన్ పని చేయకపోవడంతో మరమ్మతు కోసం సికింద్రాబాద్‌కు వచ్చింది. సెల్‌ఫోన్ మరమ్మతు చేసుకొని సికింద్రాబాద్‌లో ఎంఎంటిఎస్‌లో మేడ్చల్‌కు బయలుదేరింది. మహిళల కోచ్‌లో ఆమె ఎక్కింది. బోగీలో ఉన్న ఇద్దరు మహిళలు అల్వాల్ దిగిపోవడంతో యువతి ఒంటరిగా ఉంది. ఇదు అదునుగా భావించిన ఓ యువకుడు ఆమెపై అత్యాచారం చేయడానికి ప్రయత్నించాడు. అతడి నుంచి తప్పించుకొనేందుకు ఆమె రైలు నుంచి కిందకు దూకింది. కొంపల్లి శివారులో రైల్వే బ్రిడ్జి సమీపంలో ఆమె తీవ్రంగా గాయపడడం గమనించిన స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆమెను గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## శ్రవణ్ రావుకు సుప్రీంలో ఊరట

### అరెస్ట్ చేయొద్దంటూ ఉత్తర్వులు విచారణకు హాజరు కావాలని ఆదేశం



**న్యూఢిల్లీ, మార్చి 24 :** ఫోన్ ట్యాపింగ్ కేసులో శ్రవణ్ రావుకు ఊరట లభించింది. విదేశాల నుంచి భారత్ వచ్చేందుకు ఆయనను అరెస్ట్ చేయకుండా సుప్రీం కోర్టు మధ్యంతర రక్షణ కల్పిస్తూ ఆదేశాలు జారీ చేసింది. సుప్రీం నుంచి ఊరట లభించడంతో ఈవారం చివర్లో శ్రవణ్ రావు హైదరాబాద్ రానున్నారు. అయితే పోలీసుల విచారణకు హాజరుకావాలని, విచారణకు సహకరించాలని కోర్టు ఆదేశించింది. శ్రవణ్ రావు 48 గంటల్లో శ్రవణ్ రావు ఇండియాకు వస్తారని సీనియర్ న్యాయవాది దామ శేషాద్రి నాయుడు కోర్టుకు తెలిపారు. తెలంగాణ ఫోన్ ట్యాపింగ్‌పై సోమవారం సుప్రీంలో విచారణకు రాగా, శ్రవణ్ రావు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిగింది. ఈ క్రమంలో శ్రవణ్‌కు సుప్రీం స్వల్ప ఊరట కల్పిస్తూ.. శ్రవణ్‌పై కఠిన చర్యలు తీసుకోవద్దంటూ ఆదేశాలు ఇచ్చింది. అలాగే పోలీసుల విచారణకు సహకరించాలని శ్రవణ్‌కు సుప్రీం ఆదేశించారు. కచ్చితంగా విచారణకు హాజరుకావాల్సిందే అని స్పష్టం చేసింది. విచారణ నిమిత్తం అమెరికా నుంచి భారత్‌కు వచ్చేందుకు శ్రవణ్‌ను అరెస్ట్ చేయకుండా సుప్రీం మధ్యంతర రక్షణ కల్పించింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో బ్యూరోకాట్‌లో హైకోర్టు న్యాయమూర్తుల అక్రమ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో శ్రవణ్ రావు నిందితుడిగా ఉన్నారు. తెలంగాణ హైకోర్టులో ముందుస్తు బెయిల్ కోసం పిటిషన్ వేయగా.. అందుకు ధర్మాసనం నిరాకరించింది. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీం కోర్టును శ్రవణ్ రావు ఆశ్రయించారు. దీంతో జస్టిస్ బి.వి నాగరత్నతో కూడిన ధర్మాసనం ముందు పిటిషన్ విచారణకు వచ్చింది. శ్రవణ్‌ను అరెస్ట్ నుంచి మధ్యంతర రక్షణ కల్పించాలని న్యాయస్థానాన్ని కోరారు. ఇక 48 గంటల్లోనూ శ్రవణ్ అమెరికా నుంచి భారత్‌కు చేరుకుంటారనే విషయాన్ని కూడా కోర్టుకు తెలియజేశారు. పోలీసులు ఏమైనా చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నారాని కోర్టు ప్రశ్నించగా.. అలాంటిదేమీ లేదని తెలంగాణ ప్రభుత్వం తరపు న్యాయవాది తెలిపారు.



## తానా సదస్సుకు సిఎం రేవంత్‌కు ఆహ్వానం

**హైదరాబాద్, మార్చి 24 :** ఉత్తర అమెరికా తెలుగు సంఘం తానా కాన్ఫరెన్స్ అమెరికాలో జూలై 3 నుంచి 5 వరకు జరగనున్నది. ఇందుకోసం ప్రముఖులను ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు సిఎం రేవంత్‌ను కూడా తానా ప్రతినిధులు ఆహ్వానించారు. జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసి 24 వ తానా సదస్సుకు ఆహ్వానించారు.

## హైడ్రాపేరుతో దందాలు చేస్తే కఠిన చర్యలు

### హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరిక



**హైదరాబాద్, మార్చి 24 :** హైడ్రా పేరుతో లావాదేవీలు, సెటిల్‌మెంట్లు చేస్తే కఠినంగా వ్యవహరిస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరించారు. ఇలాంటి దందాలను చూస్తూ ఊరుకునేది లేదని సోమవారం ఆయన స్పష్టం చేశారు. వంశీరామ్ బిల్డర్స్‌పై ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి చేసిన ఫిర్యాదు అందిందని తెలిపారు. ఈ విషయంపై చర్యలు ప్రారంభించినట్లు చెప్పారు. ఒక్క వంశీరామ్ బిల్డర్స్ మాత్రమే గాకుండా, రాజ్‌పుష్ప వంటి బిల్డర్స్‌కు కూడా బఫర్ జోన్లలో డంపింగ్ చేశారని రంగనాథ్ తెలిపారు. వారందరికి ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. హై డ్రా పేరుతో సెటిల్ మెంట్లు- చేసిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే చాలా కేసులు నమోదయ్యాయని అలాంటి అధికారులు ఉంటే ఉద్యోగం నుంచి తొలగిస్తామని రంగనాథ్ వార్నింగ్ ఇచ్చారు.

## స్థానిక సంస్థ ఎమ్మెల్సీ ఉన్నిక షెడ్యూల్ విడుదల

**హైదరాబాద్, మార్చి 24 :** హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు షెడ్యూల్ విడుదలైంది. ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్ పదవీ కాలం మే 1తో ముగియనున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. మార్చి 28న నోటిఫికేషన్ విడుదలకానుంది. ఏప్రిల్ 4 వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చు. అదే నెల 7న నామినేషన్లను పరిశీలించనున్నారు. నామినేషన్ల ఉపసంహరణకు ఏప్రిల్ 9 వరకు గడువు ఉంటుంది. అదే నెల 23న పోలింగ్ నిర్వహించనున్నారు. 25న ఫలితాలు ప్రకటిస్తారు.

## అక్రిడేషన్లు మరో 3నెలలు పొడిగింపు

**హైదరాబాద్, మార్చి 24 :** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువును మరో మూడు నెలల పాటు పొడిగించారు. ఈ మేరకు సమాచార కమిషనర్ హరీశ్ ఉత్తర్వులు జారీ చేశారు. మార్చి 30వ తేదీతో ముగియనున్న అక్రిడేషన్ కార్డుల కాల పరిమితిని జూన్ 30వ తేదీ వరకు పొడిగించారు. అక్రిడేషన్ కార్డుల గడువును పొడిగించడం ఇది నాలుగోసారి. ఇప్పటికే అక్రిడేషన్ల పరిమితి, విధివిధానాలపై ప్రెస్ అకాడమీ ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి ఓ నివేదిక సమర్పించారు.

## అమెరికాలో తెలుగు యువకుడి దారుణం

### ఉద్యోగం పోవడంతో యువకుడి ఆత్మహత్య

**విజయవాడ, మార్చి 24 :** అమెరికాలో ఉంటూ ఉద్యోగం పోయిందనే బాధతో, ఆర్థిక ఇబ్బందులతో ఓ తెలుగు యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని మృతదేహాన్ని స్వదేశంకు తీసుకువచ్చేందుకు విరాళాలు కావాలని అతని సోదరుడు పెట్టిన పోస్టుతో ఈ విషయం బయటకు వచ్చింది. కృష్ణ జిల్లా గుడివాడ రూరల్ దొండపాడుకు చెందిన అభిషేక్ కొల్లి, అతని సొందరుడు అరవింద్‌తో కలిసి పదేళ్ల క్రితం అమెరికా వెళ్లి అక్కడ ఉద్యోగం చేస్తున్నారు. ఏడాది కిందట అతనికి వివాహం జరిగింది. భార్యతో కలిసి అరిజోనా రాష్ట్రం ఫీనిక్స్‌లో ఉంటున్నాడు. అయితే ఇటీవల కాలంలో అభిషేక్ ఉద్యోగం పోయింది. దీంతో ఆర్థిక ఇబ్బందులు వచ్చాయి. ఆ ఇబ్బందులు తట్టుకోలేక.. డిప్రెషన్‌లోకి వెళ్లిన అతను శనివారం ఇంటి నుంచి వెళ్లి మళ్లీ తిరిగి రాలేదు. దీంతో అభిషేక్ భార్య ఆందోళన చెంది.. చుట్టుపక్కల వాళ్లకు సమాచారం ఇచ్చింది. దీంతో అంతా కలిసి గాలించారు. ఈ క్రమంలో పోలీసులు ఫిర్యాదు చేయడంతో వాళు, వాలంటీర్లతో చుట్టుపక్కల అంతా గాలించారు. చివరకు అభిషేక్ మరణాన్ని అతని సోదరుడు అరవింద్ ధృవీకరించాడు. తన సోదరుడు అభిషేక్ మృతదేహాన్ని ఇండియా తీసుకుపోయేందుకు అరవింద్ గో ఫండ్ మీలో విరాళాలు సేకరిస్తున్నాడు.

## బెట్టింగ్ యాప్ ఓనర్లపై కేసునమోదు




**హైదరాబాద్, మార్చి 24 :** సంచలనం సృష్టిస్తోన్న బెట్టింగ్ యాప్స్ కేసులో కీలక మలుపు చోటు చేసుకుంది. యాప్ యజమానులే టార్గెట్‌గా పోలీసుల చర్యలు చేపట్టారు. ఇప్పటికే 19మంది యాప్ ఓనర్లపై కేసులు నమోదు చేశారు. జంగిల్ రమ్మి డాట్ కామ్, ఏ 23, యోలో 247 ఫెయిర్ ప్లే, జీత్‌విన్, విబుక్, తాజ్ 77, వివి బుక్, ధనిబుక్ 365, మామ247, తెలుగు365, ఎస్365 జై365, జెట్‌ఎక్స్, పరిమ్యాచ్, తాజ్777బుక్, ఆంధ్రా365 యజమానులపై కేసులు ఫైల్ అయ్యాయి. ఇల్లీగల్ బెట్టింగ్‌కు నిర్వాహకులే బాధ్యులని ప్రాథమిక ఆధారాలు సేకరించారు. వారందరిని నిందితులుగా చేర్చి మియాపూర్ కోర్టులో మెమో దాఖలు చేశారు. యాప్‌ల యజమానులకు నోటీసులు ఇచ్చి విచారించనున్నారు.

# కోర్టుకెక్కిన గ్రూప్-1 అభ్యర్థులు

- మూల్యాంకనంలో నాణ్యత లేదని పిటిషన్
- పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు హైకోర్టు నోటీసులు

**హైదరాబాద్, మార్చి 24 :** గ్రూప్-1 అభ్యర్థులు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష పేపర్లను రీవాల్యుయేషన్ జరిపించాలంటూ హైకోర్టులో అభ్యర్థులు పిటిషన్ వేశారు. మూల్యాంకనం లోపభూయిష్టంగా జరిగిందని పిటిషనర్లు తెలిపారు. 18 రకాల సబ్జక్టులుంటే 12 సబ్జక్టుల నిపుణులతోనే దిద్దించారన్నారు. 3 భాషల్లో పరీక్ష జరిగినా తగిన నిపుణులతో దిద్దించలేదని వెల్లడించారు. ఒకే మాధ్యమంలో నిపుణులైన వారితో రెండు భాషల పేపర్లు దిద్దించారని.. దీంతో మూల్యాంకణంలో నాణ్యత కొరవడిందన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో 563 పోస్టుల భర్తీకి గాను.. గత ఏడాది అక్టోబరు 21 నుంచి 27 వరకు గ్రూప్-1 పరీక్షలు జరిగాయి. ఈ మెయిన్స్‌కు 21,093 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ క్రమంలో తెలుగు మీడియం అభ్యర్థులకు అన్యాయం జరిగిందని పిటిషనర్లు తెలిపారు. పిటిషనర్ల వాదనలు విన్న హైకోర్టు.. టీ-జీపీఎస్సీకి నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లో కౌంటర్ వేయాలని టీజీపీఎస్సీని హైకోర్టు ఆదేశించింది. గ్రూప్-1 మెయిన్స్‌పై తదుపరి విచారణను హైకోర్టు ధర్మాసనం నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈనెలలోనే గ్రూప్-1 మెయిన్స్ ఫలితాలతో పాటు- గ్రూప్-2, గ్రూప్-3 ఫలితాలను కూడా టీజీపీఎస్సీ విడుదల చేసిన విషయం తెలిసిందే. మార్చి 10, 11 తేదీల్లో గ్రూప్ 1 మెయిన్స్, గ్రూప్-2 రాత పరీక్షల మార్కులు విడుదలయ్యాయి. అలాగే మార్చి 14న గ్రూప్-3 ఫలితాలను కూడా విడుదల చేసింది. అలాగే గతేడాది డిసెంబర్ 15, 16 తేదీల్లో 783 గ్రూప్-2 పోస్టుల భర్తీకి పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షకు మొత్తం 2.36 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఇక 1,365 గ్రూప్-3 సర్వీస్‌ల పోస్టుల భర్తీ కోసం రాత పరీక్షలు నిర్వహించింది. గత ఏడాది నవంబర్ 17, 18 తేదీల్లో గ్రూప్-3 రాత పరీక్షలు జరిగాయి. ఈనెల 14న గ్రూప్-3 ఫలితాలను టీ-జీపీఎస్సీ విడుదల చేసింది.



# పోలీసుల విచారణకు హాజరైన యాంకర్ శ్యామల

**హైదరాబాద్, మార్చి 24 :** బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్‌చేసినందుకు పలువురి యూట్యూబర్లపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో యాంకర్ శ్యామల న్యాయవాదితో కలిసి విచారణకు వచ్చారు శ్యామల. అయితే విచారణకు వచ్చిన యాంకర్ నుంచి పోలీసులు స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. ఒక సామాజిక కార్యకర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు యాంకర్ శ్యామలపై పంజాగుట్ట పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అయితే ఎఫ్ఐఆర్ నమోదు చేసిన తర్వాత విచారణకు రావాల్సిందిగా గతంలో పోలీసులు ఒకసారి నోటీసులు ఇచ్చారు. ఆ నోటీసులకు ఆమె స్పందించలేదు. ఈ కేసులో అరెస్ట్ చేయకుండా ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ హైకోర్టులో పిటిషన్ వేశారు. అలాగే క్వాష్ పిటిషన్‌ను కూడా దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారించిన హైకోర్టు.. ఆమెకు ముందస్తు బెయిల్ ఇచ్చారు. శ్యామలను అరెస్టు చేయవద్దని, నోటీసులు ఇచ్చి విచారించాలని పోలీసులకు హైకోర్టు ఆదేశించింది. అలాగే సోమవారం పోలీసుల ఎదుట విచారణకు హాజరుకావాలని హైకోర్టు చెప్పిన నేపథ్యంలో ఉదయమే శ్యామల విచారణకు వచ్చారు.

# పట్టపగలే లాయర్ హత్య



**హైదరాబాద్, మార్చి 24 :** నగరంలో వరుస హత్యలు కలకలం రేపుతున్నాయి. ఆదివారం ఓ వ్యక్తిని పాత కక్షల నేపథ్యంతో దారుణంగా నరికి చంపిన సంగతి తెలిసిందే. ఈ ఘటన మరువక ముందే సోమవారం ఉదయం పట్టపగలు మరో దారుణం చోటు చేసుకుంది. అందరూ చూస్తుండగా ఓ లాయర్ దారుణ హత్యకు గురయ్యాడు. వివరాల్లోకెళ్తే.. చంపాపేట డివిజన్ ఐఎస్ సదన్‌లో సోమవారం ఉదయం ఓ లాయర్ దారణహత్యకు గురయ్యాడు. అంబేద్కర్‌వాడలో న్యాయవాది ఇజ్రాయెల్‌ను దస్తగిరి అనే వ్యక్తి కత్తితో పొడిచాడు. తీవ్రగాయాల పాలైన అతడిని వెంటనే అపోలో ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ లాయర్ ఇజ్రాయెల్ మృతి చెందాడు. అడ్వకేట్ ఇజ్రాయెల్ ఇంట్లో ఓ మహిళ కిరాయికి ఉంటున్నది. ఆమెను దస్తగిరి అనే ప్రైవేటు ఎలక్ట్రీషియన్ గతకొంతకాలంగా వేధిస్తున్నాడని ఇజ్రాయెల్‌ను ఆశ్రయించింది. దీంతో బాధితురాలి తరఫున ఇజ్రాయెల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయం తెలుసుకున్న దస్తగిరి లాయర్ ఇజ్రాయెల్‌పై కక్షపెంచుకున్నాడు. నాపైనే పోలీసులకు ఫిర్యాదు చేస్తావా? అంటూ దస్తగిరి సోమవారం ఉదయం అడ్వకేట్‌పై దాడిచేసి హత్య చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. కేసు నమోదుచేసి నిందితుడిన అదుపులోకి తీసుకున్నారు. పట్టపగలు అందరూ చూస్తుండగా ఈ దారుణం చోటు చేసుకోవడంతో స్థానికులు భయంతో హడలెత్తిపోయారు.

# పల్లెల్లో పడకేసిన పాలన

- సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్న గ్రామాలు
- పల్లెల దుస్థితిపై కేటీఆర్ మండిపాటు



**హైదరాబాద్, మార్చి 24 :** కాంగ్రెస్ పాలనలో పల్లెన్నీ పట్టించుకునే నాథుడే లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా పల్లెల్లో నెలకొన్న సమస్యల పై కేటీఆర్ స్పందించారు. అమ్మ పెట్టదు.. అడుక్క తిననివ్వదు.. అన్న చందంగా కాంగ్రెస్ పాలన ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. పల్లెలు నాడు కేసీఆర్ పాలనలో ప్రగతి బాట పడితే.. నేడు 15 నెలల కాంగ్రెస్ పాలనలో అధోగతి బాట పట్టాయని ధ్వజమెత్తారు. 14 నెలలుగా సర్పంచులు లేక కేంద్రం నుంచి నిధులు ఆగిపోయాయని, రాష్ట్ర ప్రభుత్వం కూడా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. 12,754 గ్రామ పంచాయతీల్లో పాలన పడకేసిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్వాకంతో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారిందని.. దీంతో గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఒకవైపు తాగునీరు, మరోవైపు విద్యుత్ కోతలు ప్రజలను వెంటాడుతున్నాయని అన్నారు. హరిత హారం మొక్కల హాహాకారాలు.. పంచాయతీల నిర్వహణకు కార్యదర్శుల ఆపసోపాలు పాడుతున్నారని పేర్కొన్నారు. హరితహారంలో మొక్కలు నాటించి గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం నిర్వహణ, మొక్కల సంరక్షణకు ట్రాక్టర్ల ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. వైకుంఠధామాలు, పల్లెప్రకృతి వనాల ఏర్పాటుతో దేశానికే అదర్శంగా నిలిచి అవార్డులు అందుకున్న తెలంగాణ పల్లెలు.. నేడు కాంగ్రెస్ పాలనలో నిర్లక్ష్యంతో నిధులు లేక వెల వెలబోతున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు.

# అధికార విధులకు దూరంగా జస్టిస్ వర్మ

## సుప్రీం కొలీజియం కీలక నిర్ణయం

**న్యూఢిల్లీ, మార్చి 24 :** అధికార విధులకు దూరంగా జస్టిస్ వర్మను ఉంచుతూ..సుప్రీం కొలీజియం కీలక నిర్ణయం తీసుకుంది. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో భారీ ఎత్తున నోట్లకట్టలు బయటపడిన వ్యవహారంలో సుప్రీంకోర్టు కొలీజియం సోమవారంనాడు కీలక నిర్ణయం తీసుకుంది. జస్టిస్ యశ్వంత్ వర్మను తిరిగి అలహాబాద్ హైకోర్టుకు పంపాలని అధికారికంగా సిఫారసు చేసింది. ఈ మేరకు సీజేఐ సంజయ్ ఖన్నా, న్యాయమూ ర్తులు బీఆర్ గవాయ్, సూర్య కాంత్, ఓసీ ఓకాతో కూడిన కొలీజి యం అధికారిక ప్రకటన జారీ చేసింది. దీనికి ముందు, జస్టిస్ యశ్వంత్ వర్మను న్యాయపరమైన విధులకు దూరంగా ఉంచుతూ ఢిల్లీ హైకోర్టు రిజిస్ట్రీ సోమవారం ఉదయం నిర్ణయం తీసుకుంది. తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకూ ఈ నిర్ణయం అమల్లో ఉంటుందని తెలిపింది. ఈనెల 14న తుగ్లక్ రోడ్డులోని జస్టిస్ వర్మ అధికారిక నివాసంలో అగ్నిప్రమాదం చెలరేగడంతో పెద్దఎత్తున నోట్ల కట్టలు బయటపడటం సంచలన మైంది. అగ్నిప్రమాదం జరిగి సమయంలో వర్మ, ఆయన భార్య భోపాల్‌లో ఉన్నారు. అగ్నిప్రమాదం సందర్భంగా స్టోర్‌రూమ్‌లో కాలిన నోట్ల కట్టలు కనిపించిన వీడియోను ఢిల్లీ పోలీసు కమిషనర్ ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయకు సమర్పించారు. ఆయన ఈ వీడియోతో సహా తన నివేదికను సీజేఐ సంజీవ్ ఖన్నాను అందజేశారు. సుప్రీంకోర్టు తన వెబ్‌సైట్‌లో ఈ సమాచారం ఉంచింది. ఈ మొత్తం వ్యవహారంపై విచారణకు మూడు రాష్ట్రాల న్యాయమూర్తులతో కమిటీ-ని సీజేఐ నియమించారు. కాగా, తనకు కానీ, తన కుటు-ంబ సభ్యులకు కానీ ఈ నోట్ల కట్టలతో ఎలాంటి సంబంధం లేదని, తన ప్రతిష్టను దెబ్బతీసేందుకు జరిగిన కుట్ర ఇదని జస్టిస్ వర్మ హైకోర్టు చీఫ్ జస్టిస్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు. తన ఆర్థిక లావాదేవీలన్నీ బ్యాంకులు, యూపీఐ, కార్డులతోనే జరిపానని, తన స్టోర్‌రూమ్‌ను కేవలం చెత్తను ఉంచేందుకే వాడతామని తెలిపారు.

# ఇచ్చిన వాగ్దానాలు అడిగితే నిర్బంధాలా..?

## అరెస్టు చేసిన ఆశావర్కర్లను వెంటనే విడుదల చేయాలి : హరీశ్‌రావు



**హైదరాబాద్, మార్చి 24 :** అక్రమంగా అరెస్టు చేసిన ఆశా కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్‌చేశారు ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం వేతనాలు పెంచాలని డిమాండ్ చేయడమే వారు చేసిన నేరమా? వందల సంఖ్యలో పోలీసులను మోహరించి, బలవంతంగా వాహనాల్లో ఎక్కించి పోలీసు స్టేషన్లకు తరలించడం దుర్మార్గం అని మండిపడ్డారు. ఆశా సోదరీమణుల పట్ల ఈ ప్రభుత్వానికి ఎందుకింత నిర్బంధం, ఎందుకింత నిరంకుశత్వం? ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు దక్కుతున్న గౌరవం ఇదేనా? హామీల పేరు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ మోసాన్ని 15 నెలల్లోనే అన్ని వర్గాల ప్రజలు గుర్తించారన్నారు. కాంగ్రెస్ చేసిన నయ వంచనపై ఎక్కడిక్కడ నిలదీస్తున్నారని పేర్కొన్నారు. నిలదీత నుంచి తప్పించుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్బంధాన్ని ప్రయోగిస్తూ తప్పించుకుంటుందని ఎద్దేవా చేశారు. గొంతెత్తిన వారిని అక్రమంగా అరెస్టులు చేస్తూ, అప్రజాస్వామిక పాలన కొనసాగిస్తున్నది అని హరీశ్‌రావు తెలిపారు. అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచింది, రెండు పూర్తి స్థాయి బడ్జెట్లను ప్రవేశపెట్టింది. ఇంకా ఎన్నాళ్లు హామీలు అమలు చేయకుండా సాకులు చెబుతారు రేవంత్ రెడ్డి గారూ.. ఎన్నికల హామీ ప్రకారం, ఆశా వర్కర్ల వేతనాలను వెంటనే పెంచాలని డిమాండ్ చేశారు.

# పదో తరగతి ప్రశ్నాపత్రం లీకేజీపై అధికారుల విచారణ

## పరీక్షా కేంద్రం చీఫ్ గోపాల్, డిపార్ట్‌మెంట్ అధికారి సస్పెండ్

**హైదరాబాద్, మార్చి 24 :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 21 నుంచి ప్రారంభమైన సంగతి తెలిసిందే. అయితే తొలి పరీక్ష రోజే.. ఎగ్జాం ప్రారంభమైన 10 నిమిషాలకే తెలుగు ప్రశ్నపత్రం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడం రాష్ట్రంలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ లీకేజ్ వ్యవహారంపై పోలీసులు ముమ్మర దర్యాప్తు చేపట్టారు. నకిరేకల్ గురుకుల పాఠశాలలో తెలుగు ప్రశ్నపత్రం లీకైనట్లు అధికారులు ఇప్పటికే గుర్తించారు కూడా. అధికారుల నిర్లక్ష్యమే ఇందుకు కారణమని తొలుత తేల్చినా.. పోలీసులు విద్యాశాఖ అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకున్నప్పటికీ పరీక్ష సెంటర్లోకి ఫోన్ ఎలా వచ్చిందనే దానిపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనలో ఇద్దరు అధికారులను విధుల నుంచి తొలగించారు. పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ గోపాల్‌ను, డిపార్ట్‌మెంటల్ అధికారి రామ్మోహన్‌రెడ్డిని సస్పెండ్ చేశారు. పరీక్ష కేంద్రం ఇన్విజిలేటర్‌గా ఉన్న టీజీటీ సుధారాణిని కూడా సస్పెండ్ చేశారు. అంతేకాకుండా ప్రశ్నాపత్రం ఇచ్చిన విద్యార్థిని కూడా డీబార్ చేశారు. ఇప్పటికే ప్రశ్నపత్రం లీక్ కేసులో ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు. నిందితుల్లో ఓ బాలుడు, జిరాక్స్ కేంద్రం నిర్వాహకుడు ఉన్నారు. పరీక్ష జరుగుతున్న గది వద్దకు బాలుడు గోడ దూకి వచ్చినట్లు తెలుస్తుంది. అనంతరం విద్యార్థి పరీక్ష రాస్తుండగా కిటికీలో నుంచి ప్రశ్నపత్రం ఫొటో తీసి, అనంతరం ఈ ప్రశ్నపత్రం కాపీని ఆ బాలుడు జిరాక్స్ కేంద్రంలో ఇచ్చినట్లు సమాచారం. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుల నుంచి 5 సెల్‌ఫోన్లు, జిరాక్స్ యంత్రం, కంప్యూటర్ స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు తన ప్రమేయం లేకపోయినా డిబార్ చేశారని బాధిత విద్యార్థి ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు పరీక్షలు రాసే అవకాశం ఇవ్వాలని, తానేం తప్పుచేశానని లబోదిబోమని విలపిస్తున్నాడు.

# రోజురోజుకూ మహిళలకు రక్షణ కరువు

- ఎంఎంటీఎస్ ఘటనపై బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్సీ కవిత
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యంతోనే ఘటనలని మండిపాటు



**హైదరాబాద్, మార్చి 24 :** మహిళలకు రక్షణ కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా వైఫల్యం చెందాయని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. మహిళలకు రోజురోజుకూ రక్షణ లేకుండాపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఎంటీఎస్ రైలులో యువతిపై అత్యాచారయత్నం ఘటన పట్ల ఆమె తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రైల్వే ఎస్పీ చందన దీప్తితో ఎమ్మెల్సీ కవిత మాట్లాడారు. తనను రక్షించుకునేందుకు రైలు నుంచి దూకిన యువతి ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందని రైల్వే ఎస్పీ వద్ద ఎమ్మెల్సీ కవిత ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళలపై అత్యాచార ఘటనలు రోజురోజుకూ ఎక్కువ అవుతున్నాయని, ఎక్కడా భద్రత లేకుండాపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఎంఎంటీఎస్, మెట్రో రైలులో కూడా వేధింపులు జరగటం బాధాకరమని, ఇప్పటికైనా లోకల్ రైల్‌ల్లోనూ భద్రతను పెంచాలని ఆమె డిమాండ్‌చేశారు. మహిళలకు భద్రత కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలం చెందాయని ఆమె ఆరోపించారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత లేదని తాము పదేపదే చెబుతున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళల భద్రతపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాలని కవిత డిమాండ్ చేశారు.




# పార్లమెంట్ క్యాంటీన్‌లో అరకు కాఫీస్టాల్

- ప్రారంభించిన కేంద్రమంత్రి కిరణ్ రిజిజు
- హాజరైన మంత్రి పీయూష్ గోయల్ జూవల్ ఓరం

**న్యూఢిల్లీ, మార్చి 24 :** ఇకపై పార్లమెంట్‌లో ఎంపీలంతా అరకు కాఫీని రుచిచూసేలా స్టాల్‌ను ప్రారంబించారు. ఇందుకోసం సోమవారం క్యాంటీన్ సంగం-1లో అరకు కాఫీ స్టాల్‌ను పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ప్రారంభించారు.. కేంద్ర గిరిజన శాఖ మంత్రి జువల్ ఓరం, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడితోపాటు కూటమి ఎంపీలంతా అరకు కాఫీ స్టాల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. అరకు కాఫీకి విస్తృత ప్రచారం కల్పించేందుకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అవకాశం ఇవ్వడంతో... పార్లమెంట్ ఆవరణలో అరకు కాఫీ స్టాల్ అందుబాటులోకి వచ్చింది. 2 కాఫీ స్టాల్స్ ఏర్పాటు చేసుకోవడానికి అనుమతి ఇవ్వడంతో సంగం 1, 2 కోర్ట్ యార్డ్ వద్ద ఈ స్టాల్స్ ఏర్పాటు చేశారు.. దీనికి సంబంధించి సోమరవారం నుంచి కాఫీ స్టాల్స్ అందుబాటులోకి వచ్చాయి.. కాఫీ స్టాల్స్ ప్రారంభం కోసం రెండ్రోజుల ముందే గిరిజన కోఆపరేటివ్ సొసైటీ అధికారులు ఢిల్లీకి వెళ్లారు. ఏపీ మంత్రి గుమ్మడి సంధ్యారాణి కూడా అక్కడే ఉన్నారు. అరకు కాఫీకి ఈ స్థాయి గుర్తింపు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఏపీ గిరిజనుల కష్టాన్ని ప్రపంచం గుర్తించబోతున్నందుకు గర్వంగా కూడా ఉందని తెలిపారు. గిరిజనలుకు ఉపాధి కల్పించి, వారి కాఫీని ప్రమోట్ చేయడానికి చంద్రబాబు నిర్ణయం మేరకు ఇక్కడ కాఫీ స్టాల్ ఏర్పాటు చేశామని మంత్రి రమ్మోమన్ నాయుడు తెలిపారు. ఈ కాఫీ రుచి చాలా బాగుందని కేంద్రమంత్రి కిరణ్ రిజు తెలిపారు. మంత్రి పీయూష్ గోయల్ కూడా అరకు కాఫీని అభినందించారు. మనమంతా ఈ కాఫీని ప్రమోట్ చేయాలన్నారు. అరకు కాఫీ కోసం చంద్రబాబు ఇప్పటికే ఎక్కడికి వెళ్లినా ప్రమోట్ చేస్తున్నారు.

# నా సస్పెండ్‌పై ఎందుకు బులెటెన్ విడుదల చేయలేదు

- జగదీశ్‌రెడ్డిని అసెంబ్లీ లోపలకు వెళ్లకుండా అడ్డుకున్న మార్షల్
- కాంగ్రెస్ పాలనకు పరాకాష్ట
- ప్రజాధనం వృథా చేస్తున్న మంత్రులు : మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి




**హైదరాబాద్, మార్చి 24 :** తన సస్పెండ్‌పై ఎలాంటి బులెటిన్ విడుదల ఎందుకు విడుదల చేయలేదని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రశ్నించారు. కాంగ్రెస్ దుర్మార్గపు పాలనకు ఇది ఒక నిదర్శనమని ఆయన ఆరోపించారు. సోమవారం ఆయన శాసనసభ సమావేశాలను ఇష్టారీతిన నిర్వహిస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. ఈనెల 27 వరకు బడ్జెట్ అసెంబ్లీకి వచ్చారు.. అయితే సభ లోపలికి వెళ్లకుండా చీఫ్ మార్షల్ అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'నన్ను ఏ కారణంతో సస్పెండ్ చేశారు. దీనిపై ఇప్పటివరకు ఎలాంటి బులెటిన్ విడుదల చేయలేదు. సస్పెండ్ చేశారో లేదో కనీసం ఆధారాలు లేవు. బులెటిన్ ఇస్తే నేను రానని తెలిపారు. లేదంటే సభాపతిని కలుస్తానని పేర్కొన్నారు. నేను కోర్టుకు వెళ్తానన్న భయంతో బులెటిన్ ఇవ్వట్లేదని ఆరోపించారు. ఎలాంటి రాజ్యాంగ విలువలు, నిబంధనలు పాటించకుండా సమావేశాలను నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ అరాచకత్వానికి ఇది పరాకాష్ట అన్నారు. మంత్రులు జవాబివ్వలేక ప్రశ్నోత్తరాలు రద్దు చేస్తున్నారు.' అని జగదీశ్ రెడ్డి దుయ్యబట్టారు. నల్లగొండ జిల్లా మంత్రులు దావత్‌లకు కూడా ప్రభుత్వ హెలికాప్టర్లలో వెళ్తున్నారని జగదీశ్‌రెడ్డి విమర్శిం చారు. ఒక గంట ప్రయాణానికి కూడా హెలికాప్టర్‌లో వెళ్లడం అవసరమా అని ప్రశ్నించారు. నిన్న జాన్‌పాడ్‌లో దావత్‌కు కూడా జానారెడ్డి హెలికాప్టర్‌లో వచ్చారని చెప్పారు. అసెంబ్లీలో ప్రశ్నలకు సమాధానం చెప్పలేక క్వశ్చన్ అవర్ రద్దు చేస్తున్నారని అన్నారు. ప్రజల సమస్యలపై శాసనసభలో లేవనెత్తిన ప్రశ్నలకు జవాబు లేదని ఆరోపించారు. ఈ ప్రభుత్వ దుర్మార్గపు చర్యల వలన చనిపోయిన వారి కుటుంబాలు ఎంతో ఇబ్బందులు పడుతున్నాయని చెప్పారు.



# ఎస్ఆర్‌నగర్‌లో భారీపేలుడు

- క్రిసెంట్‌కేఫ్ అండ్ బేకర్స్‌లో పేలిన సిలిండర్
- ఐదుగురికి గాయాలు

**హైదరాబాద్, మార్చి 24 :** ఎస్ఆర్‌నగర్ వద్ద భారీ పేలుడు సంభవించింది. ఈ పేలుడు ధాటికి చుట్టూపక్కల ఉన్న వారు తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. సోమవారం ఉదయం క్రిసెంట్ కేఫ్ అండ్ బేకర్స్‌లో సిలిండర్ భారీ శబ్ధంతో పేలింది. పేలుడు ధాటికి షాప్‌లోని సామాగ్రి పూర్తిగా ఛిద్రమవ్వగా, ఐదుగురికి గాయాలయ్యాయి. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అయితే ప్రమాద సమయంలో కేఫ్‌లో కస్టమర్లు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

# ధరలపై నియంత్రణ ఏదీ !






ఓ వైపు రోజురోజుకూ నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. బియ్యం ధరలను నియంత్రించే వారు లేకుండా పోయారు. చౌకబియ్యం మాత్రం 45 ఏళ్ల తరవాత కూడా రూపాయికే లభిస్తున్నాయి. అందుకే తెల్ల రేషన్ కార్డుల కోసం జనం ఎగబడుతున్నారు. తమకు కార్డు రాలేదంటే తమకు రాలేదని దరఖాస్తులు చేస్తున్నారు. దీనికితోడు సన్నబియ్యం ఉగాది నుంచి సరఫరా చేస్తామని ప్రకటించారు. ఇంకేముందు అమ్ముకునే వారికి మరింత ఆదాయం దక్కగలదు. ఇప్పటికే రేషన్ బియ్యం మాఫియా పెద్ద ఎత్తున వ్యాపారం చేస్తున్నా ...ఎక్కడా దాడులు జరడం లేదు. ఇకపోతే నిత్యావసర ధరల్లో క్రమంగా మళ్లీ వంటనూనెల ధరలు పెగుతున్నాయి. ఉల్లిపాయల ధరలు రిటైల్‌లో 30 నుంచి 50 వరకు పలుకుతున్నాయి. శక్కర, పప్పుల ధరలు కూడా సామాన్యలకు అందకుండా పోతున్నాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్వాకం వల్ల ధరలు అదుపు కావడం లేదు. ధరలను అదుపుచేసే వ్యవస్థ తమ చేతుల్లో లేదన్న రీతిలో ప్రభుత్వాలు పాలన కొనసాగిస్తున్నాయి. గృహనిర్మాణ రంగం సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయింది. దీనిని అదుపు చేసేలా స్టీల్, సిమెంట్ ఇతర గృహనిర్మాణ రంగ వస్తువుల ధరలను అదుపు చేయలేకపోతున్నారు. ప్రజలు ఎన్నికల సమయంలో ఈ అంశాలను ఎజెండా చేసుకుని నేతలను నిలదీయాల్సిన అవసరంఉంది. నేతల మాటల ప్రలోభాలకు, డబ్బులకు లొంగితే వారు మనపై స్వారీ చేస్తారని తేలిపోయింది. అందువల్ల ఉచిత పథకాలకు లొంగరాదన్న జ్ఞానాన్ని పొందడం లేదు. వారిచ్చే డబ్బులకు లొంగడంతో పాలన కూడా తమ ఇష్టానుసారంగా చేసుకుంటున్నారు. ప్రజలు ఏం కోరుకుంటున్నారో వాటిపై చర్చించడం లేదు.

చట్టసభల్లో అవి చర్చకు రావడం లేదు. అన్ని పార్టీలు వ్యూహాత్మకంగా తమ ఎజెండా అంశాలపైనే చర్చిస్తున్నాయి. పార్లమెంట్ కావచ్చు, రాష్ట్రాల అసెంబ్లీలు కావచ్చు జరుగుతున్న తంతు ఇదే. ధరల నియంత్రణ ఎవరి చేతుల్లో ఉందో ప్రజలు తమ దగ్గరికి వ్చేనేతలను అడగాలి. ఎందుకు ధరలను నియంత్రించలేక పోతున్నారో ప్రశ్నించాలి. అచ్ఛేదిన్ మాటలకే పరిమతం అయ్యింది. ధరలు తరచూ పెరగడంతో సామాన్య, మధ్య తరగతి కుటుంబాలను ఆందోళన పరుస్తున్నాయి. నిజానికి ధరలు తగ్గించడమెలా..ఖర్చులు తగ్గించుకోవడమెలా అన్నది పాలకులు ఆలోచన చేయడం లేదు. తమ ఖర్చులను పైసా కూడా తగ్గించుకోకుండా విలాసాలకు అలవాటు పడ్డ పాలకులు ఉన్నంతకాలం గ్యాస్, పెట్రో ధరలు పెరుగుతూనే ఉంటాయి. ఏ మాత్రం భవిష్యత్ ఆలోచన లేని పాలకలు ప్రజలకు గుదిబండగా మారారు. ప్రజల నుంచి వసూలుల చేసిన పన్నులతో విలాసాలు చేస్తున్నారు. దర్పంగా కాలం వెళ్లదీస్తున్నారు. ముందుగా పాలకులు పెడుతున్న ఖర్చులపై చర్చ చేయాలి. మనం కడుతున్న పన్నులతో వారు విమానాలు, ఎసి కార్లలో తిరుతూ పాలన చేస్తున్నారు. విదేశాలతో పోలిస్తే మన దేశంలో పాలకుల విలాసాలు చాలా ఎక్కువ. దీనికి ప్రత్యామ్నాయ మార్గాలపై చర్చించాలి. అందుకే వ్యాపారులు ధరలు పెంచడం, పాలకలు చూసీ చూడనట్లుగా ఉండడం ..సామాన్యులపై ఇది మోయ లేని భారంగా మారింది. రోజురోజుకూ నిత్యావసర సరుకులు, వంటనూనెల ధరలు ఆకాశాన్ని అంటుతుండగా.. మరోవైపు పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరల పెరుగుదల పేదప్రజలను బతకలేని స్థితికి చేర్చింది. సామాన్యుల జీవితాలను గమనంలోకి తీసుకోకుండా కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోంది.


రాష్ట్ర ప్రభుత్వాలు కూడా కరెంట్ తదితర ఛార్జీలను పెంచి నడ్డి విరు–స్తున్నారు. బెంగుళూరు లాంటి నగరాల్లో మంచినీటి కటకటలను ముందే గుర్తించడం లేదు. నీటి సమస్యలు రాకుండా ఓ పదేళ్ల ప్రణాళికలు రచించడం లేదు. పెరుగుతున్న ధరలతో ప్రజల జీవితాలు దుర్భరంగా మారుతున్నాయి. దీనికితోడు జిఎస్టీ పేరుతో చేస్తున్న పన్ను వసూళ్లు కూడా నడ్డి విరుస్తున్నాయి. ఇప్పటికే నిత్యావసర వస్తువులు, నూనె ధరలు భగ్గుమంటుండగా ప్రభుత్వాలు ప్రజా సంక్షేమంను పట్టించుకోకుండా ధరలు పెంచి పెనుభారం మోపడం తగదు. ధరల అదుపునకు చర్యలు తీసుకోవల్సిందే. ప్రభుత్వాలు తమ ఖర్చులను తగ్గించుకోవాలి. పాలకులు తమ ఖర్చులను తగ్గించుకోవాలి. దుబారాను అదుపు చేయాలి. అప్పుడే దేశంలో ధరలను అదుపు చేయగలం అని గుర్తించాలి. దీనిపై ముందుగా ఎన్నికల్లో చర్చించాలి. పాలకుల జల్సా ఖర్చులపై, వారికి ఇస్తున్న టిఎ,డిఎలపై చర్చించాలి. ఆ దమ్ము పాలకులకు,ప్రతిపక్షాలకు ఉందా లేదా అన్నది చర్చించాలి.

దేశంలో గత పదేళ్ల కాలం నాటి ధరలను బేరీజు వేసుకుని చర్చ చేయాలి. స్టీల్, సిమెంట్ ధరలు కూడా అదుపు లేకుండా పోయాయి. సామాన్యులకు గృహం అన్నది ప్రభుత్వ దయాదాక్షిణ్యాలపై ఆధారపడ్డ విషయంగా మారింది. మధ్య తరగతి ప్రజలు ఇల్లు కొనుక్కునే పరిస్థితి లేకుండా చేశారు. పెరుగుతున్న నిర్మాణ రంగం వ్యవయంతో పాటు రిజిస్ట్రేషన్, జిఎస్టీ ఛార్జీలు మోత మోగిస్తున్నాయి.

23-03-2025 ఎడిటర్

# ఎలక్ట్రిక్ వాహనాలకు భారీగా ప్రోత్సాహకాలు

## విద్యుత్ ఛార్జింగ్ సెంటర్ల ఏర్పాటుపై దృష్టి



**న్యూఢిల్లీ, మార్చి 24 :** ప్రస్తుతం అడ్డూ అదుపు లేకుండా పెరిగిపోతున్నపెట్రోల్, డీజిల్ ధరలతో వాహనదారులకు మరింత భారంగా మారుతోంది. ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై దృష్టి సారించాల్సిన ఆగత్యం ఏర్పడింది. ఎలక్ట్రిక్ వాహనాల ఆవశ్యకత పెరిగింది. ముఖ్యంగా వాహనాల ఇంధన ధరలు పెరుగుతున్న నేపథ్యంలో పలు వాహనాల తయారీ కంపెనీలు ఎలక్ట్రిక్ వాహనాలను అందుబాటులోకి తీసుకువస్తున్నాయి. దీంతో వాహనదారులు కూడా ఎలక్ట్రిక్ వాహనాల వైపు మొగ్గు చూపుతున్నారు. తయారీదారులను ప్రోత్సాహించాని కేంద్రం కూడా ఆలోచిస్తోంది. రిజిస్ట్రేషన్ ఛార్జీలను గణనీయంగా తగ్గిస్తున్నాయి. ఇది అమల్లోకి వస్తే రానున్న రెండు మూడేళ్లలో ఈ తరహా వాహనాలకు గిరాకీ పెరగ గనుంది. కేంద్ర ప్రభుత్వం కాలుష్యానికి కారణమవుతున్న పెట్రోల్, డీజిల్ వాహనాలను తగ్గించి కేవలం ఎలక్ట్రిక్ వాహనాలనే నడపాలని భావిస్తోంది. ఇందుకోసం ఓ భారీ ప్రణాళిక సైతం రచించింది. ఇప్పటికే చాలా మంది పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతుండటంతో ఎలక్ట్రిక్ వాహనాలను కొనుగోలు చేస్తున్నారు. ముందుగా ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు అందుబాటులోకి రాగా, కార్లు కూడా వచ్చేస్తున్నాయి. ఇక రానున్న రోజుల్లో ఎలక్ట్రిక్ వాహనాలు ధరలు తగ్గనున్నాయని కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. అలాగే ఛార్జింగ్ స్టేషన్లు కూడా అధిక మొత్తంలో ఏర్పాటు అయ్యేందుకు అనుమతులు కూడా మంజూరు చేసినట్లు తెలిపారు. వచ్చే రెండేళ్లలో పెట్రోల్, డీజిల్ వాహనాలకు సమానంగా ఎలక్ట్రిక్ వాహనాల ధరలు ఉంటాయని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోళ్లు పెద్దగా లేవు. ధరల విషయంలో పలు డిస్కౌంట్లు, ఆఫర్లు చేస్తోంది ప్రభుత్వం. భారత్‌లో భారీ మొత్తంలో ఎలక్ట్రిక్ వాహనాలను తీసుకువచ్చేందుకు అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నాలు చేస్తున్నాయి. దీంతో వాహనాల ధరలు దిగి వస్తాయని మంత్రి తెలిపారు. ఇక ఎలక్ట్రిక్ వాహనాలు అందుబాటులోకి వస్తుండటంతో ఛార్జింగ్ స్టేషన్లు కూడా భారీగా ఏర్పాటు కానున్నాయి. ఫేమ్ ఇండియా స్కీమ్ ఫేస్ 2 కింద 16 జాతీయ రహదారులు, 9 ఎక్స్‌ప్రెస్‌వేలపై 1576 ఎలక్ట్రిక్ ఛార్జింగ్ స్టేషన్‌లను మంజూరు చేసింది కేంద్ర మంత్రిత్వశాఖ. జాతీయ రహదారుల వెంట ఇరు వైపులా ప్రతి 25 కిలోమీటర్ల దూరంలో ఛార్జింగ్ స్టేషన్ ఏర్పాటు కానుంది. అలాగే హేవీ డ్యూటీ వెహికిల్స్ కోసం జాతీయ రహదారులపై ప్రతి 100 కి.మీలకు ఇరు ఒక ఛార్జింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తోంది. వీటిలో 266 ఎలక్ట్రిక్ ఛార్జింగ్ స్టేషన్లను ఏపీలోని రహదారులపై, తెలంగాణలో 138 స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నట్టు భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ గతంలోనే ప్రకటించింది. ఇందులో భాగంగా 25 రాష్ట్రాల్లో, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 68 నగరాలలో 2,877 ఛార్జింగ్ స్టేషన్‌లు మంజూరు చేసింది. ఇవి పక్కాగా అమలు చేస్తే ఇంధనల ధరలపై పెట్టుబడులు పెట్టాల్సిన ఆగత్యం ఉండదు. అలాగే ధరల భయం కూడా ఉండదు.

# ఆధార్ అడ్రస్ మారితే అన్నింట్లోనూ మార్పు

## డిజిలాకర్‌లో మార్పులపై కేంద్రం ఆలోచన




**న్యూఢిల్లీ, మార్చి 24 :** ఆధార్‌లో చిరునామాను మారిస్తే అన్ని పత్రాల్లోనూ ఆటోమేటిక్‌గా మారిపోయే వెసులుబాటును కేంద్రం అందుబాటులోకి తీసుకువచ్చే ఆలోచనలో ఉంది. ఇందుకు అనుగుణంగా డిజిలాకర్‌లో మార్పులకు శ్రీకారం చుట్టబోతోంది. ఇది అందుబాటులోకి వస్తే ఒక్క ఆధార్‌లో మార్చుకుంటే సరిపోతుందని చెబుతున్నారు. మారిన చిరునామాను ఆధార్‌లో అప్‌డేట్ చేస్తే సరిపోతుంది. దీంతో పాన్‌కార్డు, ఆర్‌సీ, డ్రైవింగ్ లైసెన్స్, బీమా పత్రాలు, ధ్రువీకరణ పత్రాలు వంటి అన్ని పత్రాల్లోనూ చిరునామా దానంతట అదే మారేలా డిజిలాకర్‌ను సులభతరం చేసేందుకు యుఐడిఎఐ యత్నిస్తోంది. ఆయా ప్రభుత్వ విభాగాల సహకారంతో దీన్ని సాకారం చేయనుంది. ఆధార్ కార్డులో చిరునామా మారితే డిజిలాకర్‌లో స్టోర్ అయిన డ్రైవింగ్ లైసెన్స్‌లోనూ చిరునామా మారేలా ఇప్పటికే కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖతో చర్చలు ఆరంభించింది. ఆదాయ పన్ను శాఖ సహకారంతో పాన్ కార్డులోనూ ఇలాంటి మార్పులకు వీలు కల్పించటంపై దృష్టి సారించింది. ప్రస్తుతం ఆధార్‌కార్డులో చిరునామా మారితే మిగతా పత్రాల్లో వివరాలను విడివిడిగా అప్‌డేట్ చేసుకోవాల్సి వస్తోంది. ఉదాహరణకు డ్రైవింగ్ లైసెన్స్‌లో చిరునామాను మార్చుకోవాలంటే కేంద్రీకృత పోర్టల్‌లో విడిగా ఆన్‌లైన్‌లో దరఖాస్తును నింపి, రవాణా శాఖ కార్యాలయ అధికారులకు సమర్పించాల్సి వుంటుంది. అయితే ఈ కొత్త విధానం అందుబాటులోకి వస్తే ఇటువంటి ఇబ్బందులు వుండవని యుఐడిఎఐ వెల్లడిస్తోంది. దీంతో అన్ని పత్రాల్లోనూ మార్చేందుకు వేర్వేరు కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం తప్పుతుంది.

# కత్తులు నూరుతున్న పార్టీలు

## పరస్పర విమర్శలతో వేడెక్కిన తెలంగాణ



**హైదరాబాద్, మార్చి 24 :** తెలంగాణలో టీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు దూకుడుగా తమ రాజకీయాలకు పదును పెడుతున్నాయి. ఎవరికి వారు పరస్పర విమర్శలతో వ్యూహ రచనలకు పూను కుంటున్నారు. ప్రత్యర్థులకు ఆలోచనలకు అందకుండా వ్యూహాలు రచించేస్తున్నారు. బిఆర్ఎస్ లక్ష్యంగా బిజెపి, కాంగ్రెస్ విమర్శలకు దిగుతున్నారు. గతంలో పదేళ్ల బిఆర్ఎస్ పాలనా పాపాలను లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ముఖ్యంగా సిఎం రేవంత్ రెడ్డి పాలనాతీరుపై ప్రజల్లో చర్చ చేస్తున్నారు. ఆయన పట్ల ప్రజల్లో ఆరాధనా భావం పోయిందని, అసలు రంగు బయటపడుతోందని బిఆర్ఎస్, బిజెపలు విమర్శకు పదను పెడుతున్నాయి. ఆరు గ్యారెంటీలు మాయమయ్యాయని, ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని ఎదురుదాడి చేస్తున్నాయి. ఏదైనా చేయగలడన్న నమ్మకం ఇప్పుడు కెసిఆర్‌పై బలపడిందని బిఆర్ఎస్ చెబుతోంది. మరోవైపు పాలనా వైఫల్యాలను కూడా ఎండగడుతున్నది. మరోవైపు రానున్న రోజుల్లో కెసిఆర్ వ్యూహం ఎలా ఉంటుందో చెప్పడం కష్టం. ప్రజల్లో ఆదరణ కోల్పోవడంతో ఆ పార్టీకి గడ్డుపరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే బిజెపి, కాంగ్రెస్ లక్ష్యంగా కెటిఆర్ విమర్శలకు దిగుతున్నారు. డీలిమిటేషన్ పై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. స్థానిక ఎన్నికల్లో గెలవడం ఈ మూడు పార్టీలకు అవసరం. అందుకే ఆచితూచి అడుగులు వేస్తున్నారు. బీజేపీ నేతలు సైతం తమ సర్వే ఫలితాల్లో పార్టీ ఏ చోట బలహీనంగా ఉంది.. ప్రజలు దృష్టిని ఆకర్షించేందుకు వేయాల్సిన ఎత్తుగడలేంటని కసరత్తు మొదలెట్టారు. మొన్నటి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో బిఆర్ఎస్‌కు ప్రత్యమ్నాయంగా నిలిచింది. సిఎంగా బాధ్యతలు చేపట్టాక అందరినీ కలుపుకోని వెళ్తున్న రేవంత్ రెడ్డికి అంతర్గత సమస్యలు చికాకు పెడుతున్నాయి. కాంగ్రెస్‌పై ప్రజల్లో నమ్మకం సడలుతోంది. అందుకు స్థానిక ఎన్నికల కోసం బిసి రిజర్వేషన్లు, కులగణన, వంటి అంశాలను అన్ని పార్టీలు బలంగా చటుతున్నాయి. ఎన్నికల నాటికి సిద్ధమయ్యేందుకు అన్ని పార్టీలు వ్యూహాలు పన్నుతున్నాయి.



# ఉత్తర తెలంగాణలో ఎండల తీవ్రత

## అడుగంటుతున్న భూగర్భ జలాలు వడగళ్ల వానలతో స్వల్ప ఊరట

**ఆదిలాబాద్, మార్చి 23 :** ఎండల తీవ్రత పెరుగుతుండటంతో... ఉత్తర తెలంగాణ ప్రాంత వాసులు ఎండలకు భయపడుతున్నారు. పలు ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో ప్రజలు వడదెబ్బ తగలకుండా అప్రమత్తంగా ఉండాలని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరిస్తున్నారు. ఇటీవల పలు ప్రాంతాల్లో వడగళ్ల వానలతో కొంత ఉపశమనం దక్కింది. వడగమరోవైపు ఎండలు మండుతుండడంతో భూగర్భ జలాలు ఆవిరవుతున్నాయి. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో గతేడాది సమృద్ధిగా వర్షాలు కురవడం, కాళేశ్వరం జలాలతో మిడ్ మానేరు ప్రాజెక్ట్, అనంతగిరి ప్రాజెక్ట్‌లోకి నీటిని ఎత్తిపోయడం వంటివాటితో జలకళను సంతరించుకున్నాయి. వీటితోపాటు చెరువుల్లోకి నీరు చేరింది. ఎటుచూసినా నీటి సవ్వడితో రైతులు సంబరపడ్డారు. ఈసారి ఏప్రిల్, మేలో తీవ్రం కావాల్సిన ఎండల ప్రతాపం మార్చి ప్రారంభంలోనే మొదలు కావడంతో భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయి. మరోవైపు కరీంనగర్ జిల్లాలోని శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్ట్, అన్నపూర్ణ ప్రాజెక్ట్‌లో కూడా నీటి మట్టం తగ్గింది. చెరువులు, కుంటల్లోనూ నీటి మట్టాలు తగ్గడంతో పాటు జిల్లాలో కొన్ని చోట్ల బోరు బావుల్లో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. దీంతో కొన్ని చోట్ల రైతులు పంటలు రక్షించుకోవడానికి ట్యాంకర్ల ద్వారా నీటిని పోస్తున్నారు.. ఎండల తీవ్రత పెరగకముందే భూగర్భ జలాలు తగ్గుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పలుచోట్ల రైతులు ట్యాంకర్ల ద్వారా నీటిని పోస్తూ పొలాలను కాపాడుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. మొక్కజొన్న, వరి ఇతర పంటలకు నీరు అందక, ఎండ తీవ్రతకు పంటలు వాడిపోతున్నాయి. ఎండలు ముదిరితే పంటల పరిస్థితి ఎలా ఉంటుందోననే రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటలకు నీటి అవసరం పెరుగుతున్న క్రమంలో భూగర్భ జలాలు తగ్గడం అందోళన కలిగిస్తోంది.

# వడగళ్ల రైతులను ఆదుకోవాలి

- నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి
- మక్క కంకులు, మామిడి పిందెలతో బిజెపి ఆందోళన



**హైదరాబాద్, మార్చి 24 :** అసెంబ్లీకి బిజెపి సభ్యులు మక్క, జొన్న కంకులతో ర్యాలీగా వచ్చారు. రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అకాలవర్షాలతో నష్టపోయని రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలోని పలు జిల్లాలో కురిసిన అకాల వర్షాలకు భారీగా పంట నష్టం వాటిల్లిందని, రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా వడగండ్ల ,ఈదురు గాలుల కారణంగా వరి, మామిడి, మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోయారు. అకాల వర్షాల, వడగండ్ల కారణంగా కరీంనగర్, నిజామాబాద్ నష్టం వాట్టిందని ఆరోపించారు. అయితే వరి, మక్క కంకులతో రావడాన్ని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో బిజెపి సభ్యులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ముఖ్యంగా వరి, మక్కజొన్న పంటలు నేలకొరిగాయి. పంట చేతికొచ్చే సమయంలో కురిసిన అకాల వర్షాలు అన్నదాతకు తీరని నష్టాన్ని మిగిల్చాయి. ఇటీవల కురిసిన వడగండ్ల వానతో పంటలు దెబ్బ తిన్నాయి. వారం, పది రోజుల్లో కోతకొచ్చే పైర్లు నేలవాలాయి. మక్కజొన్నతో పాటు మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారు. సాగునీటి కష్టాలను అధిగమించి పంటలను కాపాడుకున్న రైతులను అకాల వర్షాలు తీవ్రంగా దెబ్బ కొట్టాయి. చేతికొచ్చిన పంట ఎటూ కాకుండా పోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అకాల వర్షాలు...వడగండ్లు, ఈదురుగాలుల వంటి ప్రకృతి వైపరిత్యం రైతన్నలకు గుండెకోతను మిగిల్చింది. గత రెండు రోజులుగా ఈదురుగాలులు, అకాల వర్షాలు, వడగళ్ల వానలకు అనేక జిల్లాల్లో విపరీతంగా పంట నష్టం వాటిల్లింది. గ్రామీణ ప్రాంతాల్లో ఈదురుగాలులకు విద్యుత్ లైన్లు నేతలకొరిగాయి. మరికొద్ది రోజుల్లో కోతలకు వచ్చే వరిపంట దెబ్బతింది. మామిడి పిందెలు,కాయలు నేలరాలాయి. మొక్కజొన్న, కర్బూజ పంటలకు నష్టం వాటిల్లినట్లు– తెలిపారు. జిల్లాల్లో పంటలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తున్న రైతులకు అకాల వర్షాలకు కనీటిపర్యంతం అవుతున్నారు. జరిగిన పంటనష్టాన్ని అంచనా వేసేందుకు వ్యవసాయ, రెవెన్యూ, విద్యుత్ యంత్రాంగం రంగంలోకి దిగింది. ప్రధానంగా మామిడి, వరి, మొక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం వాటిల్లినట్లుగా గుర్తించారు.

ఖమ్మం

# లాభసాటి పంటలు సాగు చేయండి

- రైతులకు సాగు లాభాలు పెంచడమే లక్ష్యంగా పని చేయాలి
- పంటల మార్పిడి విధానం అమలుపై రైతులు దృష్టి సారించాలి
- రైతులలో నమ్మకం కలిగించేలా వ్యవసాయ శాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో పని చేయాలి
- మధ్య తెలంగాణ మండల వ్యవసాయ పరిశోధన విస్తరణ సలహా సంఘం సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్





**వైరా ప్రతినిధి, ఆర్గాన్ న్యూస్, మార్చి 24 :** రైతులకు సాగు లాభాలు పెంచడమే లక్ష్యంగా పని చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్, వైరా కృషి విజ్ఞాన్ కేంద్రంలో నిర్వహించిన మధ్య తెలంగాణ మండల వ్యవసాయ పరిశోధన విస్తరణ సలహా సంఘం సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ 1950 తరువాత దేశంలో జనాభా పెరుగుతున్న నేపథ్యంలో ఆహార సంక్షోభ ప్రమాదం వచ్చినప్పుడు ఆధునిక పద్ధతులలో వ్యవసాయంపై దృష్టి సారించి, హరిత విప్లవం లక్ష్యంగా కృషిచేసి ప్రస్తుతం దేశ అవసరాలకు మించి పండించే స్థాయికి చేరుకున్నామని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా గత 15 నుంచి 20 సంవత్సరాలుగా రైతుల ఆదాయం తగ్గుతుందని అన్నారు. వాతావరణంలో మార్పుల కారణంగా కూడా రైతులు నష్టపోతున్నారని కలెక్టర్ తెలిపారు. రైతులు ఏ పంట పండించాలనే అంశంపై విస్తృతంగా చర్చ పెట్టుకోవాలని కలెక్టర్ సూచించారు. వరిపై రైతులు అధికంగా ఆధారపడటం మంచిది కాదని అన్నారు. ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని, వారికి ప్రత్యామ్నాయ పంటలపై అవసరమైన సహాయ, సహకారాలు, మార్కెటింగ్ అవకాశాలు చూపకపోవడం వల్ల వరి పంట విస్తీర్ణం విపరీతంగా పెరుగుతుందని అన్నారు. గతంలో సంవత్సరానికి 40 వేలు ఎకరానికి వరిపై వచ్చేదని, ప్రస్తుతం 20 వేల రూపాయల లాభం రాకపోయినా అదే పంటను కొనసాగిస్తున్నామని అన్నారు. ఆయిల్ పామ్, కూరగాయలు, డ్రాగన్ ఫ్రూట్ వంటి ఇతర లాభసాటి పంటల సాగు వైపు రైతులు దృష్టి పెట్టాలని అన్నారు. రైతులతో వ్యవసాయ విస్తరణ అధికారులు, ఇతర క్షేత్రస్థాయి సిబ్బంది రెగ్యులర్ గా ఇంటరాక్ట్ అవుతూ ప్రత్యామ్నాయ పంటలపై సమాచారం అందిస్తూ వారిలో నమ్మకం పెంచాలని కలెక్టర్ సూచించారు. ఆధునికతను రైతుల వరకు చేర్చేందుకు కృషి చేయాలని అన్నారు. రైతుల దృష్టి కోణంలో పరిశోధనలు జరగాలని కలెక్టర్ తెలిపారు. నూతన సాగు పద్ధతులు మొదటి పెద్ద రైతుల ద్వారా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. ఆధునిక సాగు పద్ధతులపై రైతులకు క్షేత్ర స్థాయిలో చూపించి నమ్మకం కలిగించాలని అన్నారు. ల్యాబ్ టు ల్యాండ్ విధానం అమలుపై దృష్టి సారించాలని అన్నారు. మన రాష్ట్రంలో ప్రభుత్వాలు రైతులకు ఆధునిక సాగు పద్ధతులు అందించాలనే లక్ష్యంతో వ్యవసాయ విస్తరణ అధికారులను నియమించిందని, రైతు వేదికల నిర్మాణం, రైతు నేస్తం వంటి కార్యక్రమాలను అమలు చేస్తుందని కలెక్టర్ తెలిపారు. రైతు నాయకులు, వ్యవసాయ విస్తరణ అధికారులు ముందుండి సాగు పద్ధతులపై మార్పు తీసుకొని రావాలని అన్నారు. ఖమ్మం జిల్లాలో ప్రతి గ్రామం, మండలం, డివిజన్, జిల్లా స్థాయిలో సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శి, వ్యవసాయ విస్తరణ అధికారి, మండల స్థాయిలో తహసిల్దార్ ఆధ్వర్యంలో, డివిజన్ స్థాయిలో ఆర్డీఓ ఆధ్వర్యంలో 7 శాఖలకు సంబంధించిన అధికారులు సమన్వయంతో పని చేస్తున్నారని తెలిపారు. నీటి పారుదల, విద్యుత్తు, రెవిన్యూ, వ్యవసాయ, హార్టికల్చర్ అధికారులు సమన్వయంతో పని చేస్తేనే మంచి ఫలితాలు సాధ్యం అవుతాయని అన్నారు. సమన్వయంతో పనిచేయడం వల్ల ఖమ్మం జిల్లాలో ఎకరం పంట కూడా ఎండిపోకుండా ఉందని అన్నారు. రైతులకు క్షేత్ర స్థాయిలో సాగు లాభాలు పెంచడమే లక్ష్యంగా మనమందరం పని చేయాలని అన్నారు. ప్రస్తుతం మనకు అందుబాటులో ఉన్న చట్టాలు, వ్యవస్థ నుంచే మంచి మార్పు తీసుకుని రావచ్చని అన్నారు. యువత వ్యవసాయ రంగంలోకి రావడం లేదని భవిష్యత్తులో దేశ ఆహార భద్రత మరోసారి ముప్పుకు గురయ్యే అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ బలరాం డైరెక్టర్ ఆఫ్ ఎక్స్టెన్షన్ డాక్టర్ ఎం యాదాద్రి వరంగల్ ఆర్.ఏ.ఆర్.ఎస్ అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ ఆర్.ఉమా రెడ్డి డిడిఏ సింగా రెడ్డి ఆర్.ఈ. ఏ.సి. మెంబర్ టి. రాణాప్రతాప్ సిద్దిపేట సంగారెడ్డి మహబూబాబాద్ కొత్తగూడెం ఖమ్మం వ్యవసాయ అధికారులు రైతులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## హెల్త్ క్లినిక్ హెల్దీగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- కలెక్టరేట్‌లోని హెల్త్ క్లినిక్ కోసం ప్రత్యేకంగా కేటాయించిన క్లినిక్ రూమ్ ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం అర్బన్,ఆర్గాన్ న్యూస్, మార్చి 24 :** ఉద్యోగులు, కలెక్టరేట్ కు వచ్చే పౌరుల కోసం జిల్లా కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన హెల్త్ క్లినిక్ లో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ లో ఉద్యోగులు, కలెక్టరేట్ కు వచ్చే పౌరుల కోసం ఏర్పాటు చేసిన హెల్త్ క్లినిక్ రూమ్ ను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ హెల్త్ క్లినిక్ రూమ్ ను కాంతివంతంగా అనువుగా ఉండే విధంగా చూడాలని అన్నారు. క్లినిక్ రూమ్ నందు ఒక మహిళా డాక్టర్ విధులు నిర్వహించేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. క్లినిక్ రూమ్ లో అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని క్లినిక్ రూమ్ లో అవసరమైన సెల్ఫ్ లు కుర్చీలు ఇతర సామాగ్రి కోసం ప్రతిపాదనలు అందించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ కళావతి బాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మార్చి 26న మహిళా జాబ్ మేళా

- జిల్లా ఉపాధి అధికారిణి ఎన్.మాధవి
- డిగ్రీ అర్హత గల మహిళలు మాత్రమే జాబ్ మేళాకు హాజరు కావాలి

**ఖమ్మం, ఆర్గాన్ న్యూస్, మార్చి 24 :** జిల్లాలోని నిరుద్యోగ మహిళలకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించుటకు ఈనెల 26న బుధవారం ఉదయం 10.00 గంటలకు తనికెళ్ల తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల డిగ్రీ కళాశాల కేరాఫ్ లక్ష్య ఇంజనీరింగ్ కళాశాల, ఖమ్మం నందు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి ఎన్. మాధవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ విజయవాడ లో పని చేసే విధంగా ఫాక్స్ కాన్ సెన్సా కోర్ ఆల్ఫా భారత్ బయోటెక్ శిందర్ లైఫ్ సర్కిల్ హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ ఎలాన్సర్ ఐటీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ జస్ట్ ఇన్ ఫౌండేషన్ సీతారం స్పిన్నర్స్ ప్రైవేటు లిమిటెడ్ జి ఎం.ఆర్. ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ ఎంపవర్మెంట్ సర్వీసెస్, క్రీం స్టోన్ కంపెనీలలో పని చేయుటకు 18-30 సంవత్సరాల వయస్సు గల డిగ్రీ పాసైన మహిళలు అర్హులని ఎంపికైన వారికి వేతనం 12 వేల నుండి 18 వేల వరకు ఉంటుందని అన్నారు. మొత్తం దాదాపు 1370 ఉద్యోగ ఖాళీల భర్తీకి గాను జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తమ విద్యార్హతల సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో మహిళలు జాబ్ మేళాకు హాజరు కావాలని జిల్లా ఉపాధి అధికారిణి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



## నేలకొండపల్లి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కయాకల్ప్ బృందం

- ప్రజారోగ్య సదుపాయాల పరిశుభ్రత, పారిశుద్ధ్యం, ఇన్ఫెక్షన్ నియంత్రణ ప్రమాణాల మూల్యంకన బృందం....
- ఆసుపత్రిలో అందుతున్న సేవలపై సంతృప్తి వ్యక్తం

**నేలకొండపల్లి, ఆర్గాన్ న్యూస్ మార్చి 24 :** నేలకొండపల్లి మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో అందుతున్న సేవలు,సౌకర్యాలపై ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ కయాకల్ప్ పీర్ అసెస్మెంట్ ప్రజారోగ్య సదుపాయాల పరిశుభ్రత, పారిశుద్ధ్యం, ఇన్ఫెక్షన్ నియంత్రణ ప్రమాణాల మూల్యంకన చర్ల బృందం సందర్శించింది.సోమవారం మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహణ వ్యవస్థ యొక్క ఉన్నత ప్రమాణాలను బృందం ప్రశంసించింది.వారి సందర్శన సమయంలో, చర్ల కయాకల్ప్ బృందానికి డాక్టర్ రాజేశ్, సిబ్బంది ఇక్కడ అందుతున్న సేవలు వివరించారు. కయాకల్ప్ బృందంలో సాయి వర్ధన్,సీనియర్ నర్సింగ్ అధికారి శైలజ కలిసి అన్ని విభాగాలను మరియు వంటగదితో సహా వివిధ విభాగాలను సందర్శించింది. వారు అన్ని సంబంధిత డాక్యుమెంటేషన్ ప్రక్రియలను నిశితంగా సమీక్షించారు మరియు ఆసుపత్రిని భౌతికంగా తనిఖీ చేశారు.సిబ్బంది మరియు రోగులతో సంభాషించారు.

## ప్రజా సమస్యలను.. సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్



**ఖమ్మం అర్బన్, ఆర్గాన్ న్యూస్, మార్చి 24 :** ప్రజా సమస్యలను అధికారులు సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ లు డా. పి.శ్రీజ, పి.శ్రీనివాస రెడ్డి లతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు. ముదిగొండ మండలం సువర్ణపురం గ్రామానికి చెందిన వేల్పుల వెంకట రామారావు తాను ఓం శ్రీ సాయి బాలాజీ సెక్యూరిటీ సంస్థ నందు ఫీల్డ్ ఆఫీసర్ గా పని చేస్తున్నానని, డిసెంబర్, జనవరి సంబంధించిన జీతం రాలేదని, తన జీతం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, కలెక్టరేట్ డీ విభాగానికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం నగరం టేకులపల్లి కేసిఆర్ టవర్స్ కు చెందిన కే. లక్ష్మణ్ తన బాబు సెంచరీస్కూల్ లో 4వ తరగతి చదువుతున్నారని, స్కూల్ యాజమాన్యం తన బాబుని చిన్నచూపు చూస్తుందని, ఫీజు కట్టలేదని వేధిస్తుందని, సెంచరీ స్కూల్ పై చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా విద్యాశాఖ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. నేలకొండపల్లి మండలానికి చెందిన రిపోర్టర్లు బైరం ప్రసాదరావు, హనుమంతరావు, శివ రాజు సతీష్ సింగారెడ్డి పాలెం రెవిన్యూ పరిధి సర్వే నెంబర్ 159 లో పది మంది విలేకరులకు ప్లాట్లు పంపిణీ చేశారని, జాతీయ రహదారిలో 7 ప్లాట్లు పోగా, 3 మిగిలాయని, వాటిలో తహసిల్దార్ ప్రభుత్వ భూమి అని బోర్డులు పెట్టారని, వీటిని పరిశీలించి భూమి తమకు తిరిగి కేటాయించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహసిల్దార్ నేలకొండపల్లికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్వో ఏ. పద్మశ్రీ, డిఆర్డీవో సన్యాసయ్య కలెక్టరేట్ ఏవో అరుణ జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ క్షయ దినోత్సవం




**ఖమ్మం, ఆర్గాన్ న్యూస్, మార్చి 24 :** ఈ రోజు జిల్లా ప్రధాన ఆసుపత్రి నందు క్షయ నిర్మూలన గురించి జిల్లా క్షయ నిర్మూలన అధికారి డాక్టర్ వరికుటి సుబ్బారావు జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం కార్యక్రమాన్ని ఏర్పాటు చెయ్యడం జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ కళావతి బాయి, ముఖ్య అతిథిగా హాజరయ్యారు జిల్లా పంచాయతి అధికారి ఆశలత, ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరావు, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ బాబు రత్నాకర్ చిన్నపిల్లల విభాగం, డాక్టర్ కిరణ్ డిప్యూటీ సూపరింటెండెంట్, డాక్టర్ రామారావు ప్రోగ్రామింగ్ ఆఫీసర్ ఎన్సీడీ, డాక్టర్ వెంకటరమణ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ మలేరియా, ఆర్ట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మోహన్ రావు హాజరు అయ్యారు. కార్యక్రమం లో నర్సింగ్ కళాశాల విద్యార్థులు టీబీ వ్యాధి గురించి మాట్లాడారు జిల్లా క్షయ నివారణ అధికారి గారు టీబీ వ్యాధి గురించి మరియు జబ్బు బారిన పడ్డాక తీసుకోవాల్సిన జాగ్రతల గురించి చక్కగా మాట్లాడిన సంజనా సతుపల్లీ ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ విధ్యర్థినికి మొదటి బహుమతిగా 1,000 పారితోషికం అందించారు. ఏంజెల్, మమత నర్సింగ్ కాలేజీ ఖమ్మం విద్యార్థినికి రెండవ బహుమతిగా 500 అందిచారు, మరియు టీబీ వ్యాధి గురించి చక్కని పోస్టర్ తాయారు చేసిన మమత మెడికల్ కాలేజీ విద్యార్థినికి ప్రశంసా పత్రాన్ని అందించారు, టీబీ చాంపియన్ అనగా టిబి వ్యాధి నుండి పూర్తిగా చికిత్స అయిపోయిన వ్యక్తి తనకు టీబీ వచ్చాక ఎలాంటి సమస్యలు వచ్చాయో, ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారో మందులు వేసుకున్నప్పుడు ఎలా ఉండాలో వివరించారు. అనంతరం టీబీ వ్యాధి నిర్మూలనకు కృషి చేసిన సిబ్బందికి ఆశ లకు, ఏఎన్ఎమ్ లకు, హెల్త్ సూపర్వైజర్ లకు, అవార్డ్ లను అందించారు. ఈ కార్యక్రమంలో మమత కళాశాల నర్సింగ్ విద్యార్థులు, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థులు, అభ్యుదయ నర్సింగ్ కాలేజీ విద్యార్థులు, పులిపాటి నర్సింగ్ విద్యార్థులు, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, సతుపల్లీ విద్యార్థులు వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## క్షయ వ్యాధి పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలి

### డాక్టర్ బి వసుంధర

**తిరుమలాయపాలెం, ఆర్గాన్ న్యూస్, మార్చి 24 :** క్షయ వ్యాధి పట్ల ప్రజలు తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సుబ్లేడ్ వైద్యాధికారి డాక్టర్ బి. వసుంధర. డాక్టర్ బి శ్రీధర్ తెలిపారు సోమవారం మండలం సుబ్లేడ్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం లో ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమాన్ని డాక్టర్ వసుంధర ఆధ్వర్యంలో సుబ్లేడు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం లో నిర్వహించడం జరుగుతుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు క్షయ వ్యాధి పట్ల జాగ్రత్తలు వహించాలని క్షయ వ్యాధి అనేది అంత భయంకరమైన వ్యాధి ఏమి కాదని క్షయ వ్యాధి నివారణకు తగు జాగ్రత్త చర్యలు తీసుకొని జాగ్రత్తలు పాటిస్తే క్షయవ్యాధిని నిర్మూలించవచ్చని ఈ సందర్భంగా తెలియజేశారు. మీకు సుబ్లేడు పరిధిలోని పలు గ్రామాలలో ఏ రకమైన వ్యాధులైన ప్రభుత్వ హాస్పిటల్స్ ద్వారా అన్ని విధాల కార్పొరేట్ వైద్యశాలలకు దీటుగా ఇప్పుడు ప్రభుత్వ హాస్పిటల్స్ లో కూడా అన్ని రకాల మెరుగైన వైద్యం అందుబాటులో ఉందని ప్రతి ఒక్కరు కూడా ప్రభుత్వ వైద్యశాలలను ఉపయోగించుకోవాలని ఏ రకమైన జబ్బులకైనా అన్ని రకాల పరికరాలు ఇప్పుడున్న ప్రభుత్వ హాస్పిటల్స్ లో ఉన్నాయని ఈ సందర్భంగా ఆమె అన్నారు.పల్లె దావకానాలు ఇప్పుడు మెరుగైన వైద్యం అందించడంలో ప్రజలకు అన్ని రకాల సౌకర్యాలతో ముందు ఉన్నాయని ఆమె తెలిపారు. డెలివరీ కేసులైన ప్రమాదకరమైన కేసులైన ఎలాంటి వైద్యానికైనా పల్లె దవఖానాలు ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా ఇప్పుడు పనిచేస్తున్నాయని డాక్టర్ వసుంధర అన్నారు. క్షయ వ్యాధి నిర్మూలనకై ప్రతి ఒక్కరూ నడుం బిగి%శీ%చాలని గ్రామ గ్రామాన క్షయ వ్యాధి పట్ల అవగాహన జరిపించి ప్రభుత్వం ద్వారా వైద్యం చేయించుకొని స్వచ్ఛమైన ప్రజా జీవితాన్ని గడపాలని ఈ సందర్భంగా తెలియచేశారు. ఈ కార్యక్రమంలో పార్మాసిస్ట్ గంధసిరి లింగమూర్తి బాల త్రిపుర సుందరి డి పద్మ ఉండేటి ఉమారాణి ఉపేందర్ ఎన్ వసంత రాణి మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.



## రాజీవ్ యువ వికాసం వినియోగించుకోండి

- బిసి, ఈబిసి, ఈ.డబ్ల్యూ.ఎస్ నిరుద్యోగ యువత దరఖాస్తులు చేసుకోవాలి
- జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి జ్యోతి

**ఖమ్మం అర్బన్, ఆర్గాన్ న్యూస్, మార్చి 24 :** ఏప్రిల్ 5 లోపు రాజీవ్ యువ వికాసం పథకం క్రింద బిసి, ఈబిసి, ఈ.డబ్ల్యూ.ఎస్ నిరుద్యోగ యువత దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి జి. జ్యోతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వెనుకబడిన తరగతుల కులాలకు చెందిన నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు ద్వారా ఆర్థిక పురోగతి పెంపొందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రకటించిందని తెలిపారు. రాజీవ్ యువ వికాసం పథకం క్రింద బిసి, ఈబిసి, ఈ.డబ్ల్యూ.ఎస్ నిరుద్యోగులను స్వయం ఉపాధి పథకాలు అందించడానికి ప్రణాళిక ఆమోదించిందని అన్నారు. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఆసక్తి అర్హత గల సంబంధిత నిరుద్యోగ యువత https://tgobmmsnew.cgg.gov.in వెబ్సైట్ నందు ఏప్రిల్ 5లోగా దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంస్థ/ జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కార్యాలయం రెండవ అంతస్తు రూమ్ నెంబర్ ఎస్-30, ఐడిఓసి కాంప్లెక్స్, వి వెంకటాయపాలెం కార్యాలయం నందు సంప్రదించాలని జి. జ్యోతి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



## తుంబూరు దయాకర్ రెడ్డికి ఘన సన్మానం

**కూసుమంచి, ఆర్గాన్ న్యూస్, మార్చి 24 :** పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి మండల చెగోమ్మ గ్రామానికి చెందిన తుంబూరు దయాకర్ రెడ్డిని జిల్లా కాంగ్రెస్ నాయకులు జొన్నలగడ్డ రవి, కొండపర్తి సురేష్ ఆధ్వర్యంలో ఖమ్మం క్యాంపు కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి మర్యాద పూర్వకంగా సత్కరించారు. 7 కిలోమీటర్ల రహదారుల కోసం 9 కోట్ల నిధులు మంజూరు చేయడంలో తుంబూరు దయాకర్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహించారని చెగోమ్మ గ్రామస్తులు తెలిపారు. గ్రామ సమస్యలను పరిష్కరించడంలో ఆయన చేసిన సహాయానికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, బీసీ సంఘం నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## హమాలీ వర్కర్లుగా స్థానికులకు అవకాశం కల్పించాలి

### రైల్వే డిఆర్ఎమ్‌కు హమాలి వర్కర్ల వినతి



**చింతకాని, ఆర్గాన్ న్యూస్, మార్చి 24 :** పందిళ్ళపల్లి రైల్వే స్టేషన్ బ్రేక్ పాయింట్లో హమాలీ వర్కర్లుగా పని చేసేందుకు స్థానికులకు అవకాశం కల్పించాలని హమాలీ వర్కర్స్ యూనియన్ సభ్యులు కోరారు. మండల పరిధిలోని పందిళ్ళపల్లి రైల్వే స్టేషన్ తనిఖీ నిమిత్తం వచ్చిన దక్షిణ మధ్య రైల్వే డివిజనల్ మేనేజర్ భర్తేష్ కుమార్ జైనుకు హమాలీ వర్కర్స్ యూనియన్ సభ్యులు సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఖమ్మంలో రేక్ పాయింట్ల హమాలీ కూలీలుగా పని చేశామని ఖమ్మం నుంచి పందిళ్ళపల్లి రైల్వే స్టేషన్ హమాలీలుగా పని చేసేందుకు పని కల్పించాలని కోరారు. రామకృష్ణాపురం పందిళ్ళపల్లి గాంధీనగర్ కాలనీ అనంతసాగర్ కొదుమూరు లచ్చ గూడెం గ్రామాలకు చెందిన సుమారు 200 మంది కూలీలు సిద్ధంగా ఉన్నట్లు తెలి పారు. అదే విధంగా రైల్వే నుంచి ఎరువులు మొక్కజొన్నలు బియ్యం వంటి సరుకు లకు ఎగుమతి దిగుమతి చేయుటకు గుడ్ షెడ్ కాంట్రాక్టర్ తో ఒప్పందం కుదు ర్చుకున్నట్లు తెలిపారు రైల్వే స్టేషన్ తనిఖీ.రైల్వే మూడవ లైన్ నిర్మాణ పనులు ముగింపు దశకు చేరుకున్నందున పందిళ్ళపల్లి రైల్వే స్టేషన్ ను దక్షిణ మధ్య రైల్వే సేఫ్టీ కమీషనర్ మాధవి డీఆర్ఎం భర్తేష్ కుమార్ జైన్ సోమవారం తనిఖీ చేశారు. అనంతరం రైల్వే స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో రైల్వే అధికారు లు సునీల్ కుమార్ వర్మ సత్య ప్రకాష్ సురంజన్ రెడ్డి శ్రీ నివాస్ రావు గుడేషుర్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో హమీలీ వర్కర్స్ ఐఎఫ్టీయూ సి యూనియన్ తిరుపతి గోవిందరావు.మిరియాల నరసింహారావు అంజయ్య పాల్గొన్నారు.

ఆర్గాన్ న్యూస్
6
తెలంగాణ
మంగళవారం
25 మార్చి 2025
www.organnews.in
organ.today@gmail.com
@organnews





## వేటగాళ్ల ఉచ్చుకి యువకుడు బలి

**కారేపల్లి, ఆర్గాన్ న్యూస్, మార్చి 24 :** వన్యప్రాణులను వేటాడేందుకు కొందరు వేటగాళ్ళు అమర్చిన విద్యుత్తు తీగలు ఓ నిండు ప్రాణాలు తీశాయి.. తన మేకలను వెతుక్కుంటూ వెళ్లగా వేటగాళ్లు అమర్చిన కరెంట్ తీగలు తగిలి యువకుడు మృత్యువాతపడ్డాడు. ఈ ఘటన మండలంలోని చీమలపాడులో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం చీమలపాడు గ్రామానికి చెందిన తండ్రి కొడుకులు మేకల కోటయ్య కరుణాకర్ లు ఇద్దరు కలిసి తమ మేకలు తప్పిపోవడంతో రాత్రి వాటిని వెతుకుంటు పాటిమిది గుంపు పంచాయితీ శివారున బొద్దు బండ వాగు వైపు వెళ్లగా కొందరు దుండగులు అడవి జంతువుల కోసం ఉచ్చులు బిగించారు వాటికి కరెంట్ సరఫరా అయ్యేలా ఏర్పాట్లు చేశారు కంటికి కనిపించకుండా ఏర్పాటు చేయడంతో మేకల కరుణాకర్ (18) వాటిని గమనించకుండా అలాగే ముందుకు వెళ్లాడు దీంతో ఆయనకు కరెంట్ ఉచ్చులకు ఏర్పాటుచేసిన తీగ తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడకక్కడే మృతి చెందాడు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు కరుణాకర్ మృతితో చీమలపాడు గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి.



## ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

- రైతులకు రెండు లక్షలు రుణమాఫీ చేయాలి
- మధిర బిఆర్ఎస్ నేతలు కొండబాల, లింగాల

**చింతకాని, ఆర్గాన్ న్యూస్, మార్చ్ 24 :** రైతులకి ఇచ్చిన మాట ప్రకారం రెండు లక్షల రుణమాఫీ చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని తక్షణమే రైతులకు రెండు లక్షల రుణమాఫీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం లచ్చగూడెం గ్రామంలో మాజీ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండ బాల కోటేశ్వరరావు జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమల్ రాజు విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో చింతకాని మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పెంట్యాల పుల్లయ్య మాజీ వైస్ ఎంపీపీ గురజాల హనుమంతరావు మండల కార్యదర్శి బొడ్డు వెంకట రామారావు మంకెన రమేష్ వేముల నర్సయ్య జావిద్ పాల్గొన్నారు.



## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**చింతకాని, ఆర్గాన్ న్యూస్, మార్చి 24 :** తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సిఫారసు మేరకు సోమవారం పాతర్లపాడు గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు లబ్దిదారులకు పంపిణీ చేసిన కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులు కాటబత్తి వెంకటేశ్వర్లు 35000,పరికపల్లి భారతమ్మ 27,500, బత్తులవరలక్ష్మి 22,500,ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు బి శేషగిరిరావు మాజీ ఎంపిటిసి ప్రసాదరావు మాజీ సర్పంచ్ పిచ్చయ్య చింతకాని మండల యువజనకాంగ్రెస్ అధ్యక్షులు రామకృష్ణ ఆర్కే గరికపాటి కుటుంబరావు మద్దినేని నాగేశ్వరరావు కొత్తపల్లి వెంకటేశ్వర్లు ఆనందరావు తుమ్మలపల్లి రాజేష్ కొత్తపల్లి బోస్ గుత్తా రామారావు కె రమేష్ బండి మల్లయ్య వల్లం కొండ వెంకటరావు పరికపల్లి వెంకట్ చింతల సుధా బొర్రా లక్ష్మీనారాయణ మార్కపుడి నాగేశ్వరరావు గ్రామ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## కొత్తగూడెం స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్‌గా మెండు రాజమల్లు

**కొత్తగూడెం ప్రతినిధి, ఆర్గాన్ న్యూస్ మార్చి 24 :** తెలంగాణ హైకోర్టు ఉత్తర్వుల మేరకు మెండు రాజమల్లు ను స్పెషల్ జ్యూడిషల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ గా నియమించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ ద్వారా నియామక ఉత్తర్వులు అందుకున్నారు. అనంతరం కొత్తగూడెం చీఫ్ జ్యూడిషల్ మేజిస్ట్రేట్( ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ) బత్తుల రామారావు కు నియామక ఉత్తర్వులు అందజేసి పదవి బాధ్యతలు స్వీకరించారు. అనంతరము జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ స్పెషల్ జ్యూడిషల్ సెకండ్ క్లాస్ మేజిస్టేట్ కోర్టును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ గొల్లపూడి భానుమతి చీఫ్ జ్యూడిషల్ మేజిస్ట్రేట్ బత్తుల రామారావు, రెండవ అదనపు జ్యూడిషల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కే సాయి శ్రీ, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెలగల నాగిరెడ్డి, సీనియర్ న్యాయవాదులు పలివెల సాంబశివరావు, రమేష్ కుమార్, సూరెడ్డి రమణారెడ్డి, గాదె సునంద,అడపాల పార్వతి, జీ.కే. అన్నపూర్ణ,పురోహితులు కొండవీటి దత్తాత్రేయ శర్మ బృందము కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# పరీక్షలు ముగిసే వరకు అప్రమత్తంగా ఉండండి

### పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్

**కొత్తగూడెం ప్రతినిధి, ఆర్గాన్ న్యూస్, మార్చి24 :** అశ్వాపురం మండలం మల్లెలమడుగు గ్రామంలో ఉన్న జెడ్ పి ఎస్ ఎస్ పాఠశాలలో నిర్వహిస్తున్న పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ పరిశీలనలో భాగంగా కలెక్టర్ అన్ని గదులను కలెక్టర్ కలియ తిరిగి ఎలక్ట్రిసిటీ, తాగునీరు తదితర మౌలిక వసతులను క్షుణ్ణంగా పరిశీలించారు. పరీక్షల నిర్వహణ పైన చీఫ్ సూపరింటెంట్‌కి పలు సూచనలు అందించారు. వార్షిక పరీక్షలకు ఎంతమంది విద్యార్థులు హాజరయ్యారు అనే వివరాలను, పరీక్షా కేంద్రంలోని ఏర్పాట్లను గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పరీక్షల నిర్వహణ పకడ్బందీగా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించిన రికార్డులను, ప్రశ్న పత్రాలు, పరీక్షల అనంతరం జవాబు పత్రాల తరలింపునకు సంబంధించిన వివరాలను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్ష కేంద్రాల్లోకి తీసుకురాకుండా నిశితంగా పరిశీలించాలని అన్నారు.ఎక్కడ కూడా కాపీయింగ్‌కు ఆస్కారం ఉండకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, కాపీయింగ్‌కు పాల్పడితే మాల్ ప్రాక్టీస్ కేసులు బుక్ చేయాలని నిర్వాహకులను కలెక్టర్ ఆదేశించారు. పరీక్షలు ముగిసేంత వరకు కూడా ఎంతో అప్రమత్తతతో పకడ్బందీగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రశ్న పత్రాలను తప్పనిసరిగా తగిన పోలీసు బందోబస్తు మధ్య కేంద్రాలకు తరలించాలని, ఎలాంటి తప్పిదాలకు అవకాశం ఇవ్వకుండా పూర్తి పారదర్శకంగా, పక్కాగా పరీక్షలు జరిపించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట పరీక్ష కేంద్రం చీఫ్ సూపర్డెంట్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## కొత్తగూడెం కార్పొరేషన్ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం

- అసెంబ్లీలో ప్రకటించిన మంత్రి శ్రీధర్ బాబు
- పట్టుబట్టి కార్పొరేషన్ సాధించిన కూనంనేని
- సహకరించిన మంత్రులకు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే



**కొత్తగూడెం ప్రతినిధి, ఆర్గాన్ న్యూస్, మార్చి 24 :** కొత్తగూడెం మున్సిపాలిటీ, పాల్వంచ మున్సిపాలిటీతోపాటు సుజాతనగర్ మండల పరిధిలోని ఏడు గ్రామపంచాయతీలు కలుపుతూ కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తూ రాష్ట్ర అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బిల్లుకు ఆమోదం లభించింది. రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు ఈమేరకు రాష్ట్ర అసెంబ్లీలో ప్రకటించారు. కార్పొరేషన్ ఏర్పాటు బిల్లుకు ఆమోదం తెలపడంతో కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు ఆనందం వ్యక్తం చేశారు. కార్పొరేషన్ ఏర్పాటుకు సహకరించిన రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్కకు, జిల్లా ఇంచార్జి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి, జిల్లా మంత్రులు తుమ్మల నాగేశ్వర్రావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డికి, జిల్లా కలెక్టర్ జితేష్ వి పటిల్కు కృతజ్ఞతలు తెలిపారు. అసెంబ్లీ ఆమోదం లభించడంతో గవర్నర్ ఆమోదంతో త్వరలో గెజిట్ విడుదల కానుంది. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయాలనే సంకల్పంతోనే కార్పోరేషన్ ఏర్పాటు చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేసి సాధించానని, కొద్ది రోజుల్లోనే కొత్తగూడెం ప్రాంతం నగరాలకు తీసిపోని విధంగా అన్ని రంగాల్లో అవృద్ధి సాధిస్తుందని తెలిపారు. కార్పోరేషన్ ఏర్పాటు వల్ల ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని, ప్రజల ఆస్తులకు సరైన విలువ పెరుగుతుందన్నారు. ఇప్పటికే పారిశ్రామికంగా అభివృద్ధి సాధిస్తున్న కొత్తగూడెం ప్రాంతం మరిన్ని పరిశ్రమల ఏర్పాటు దారులు ఏర్పడతాయని తద్వారా ఉద్యోగ, ఉపాది అవకాశాలు మెరుగుపడతాయని, జిల్లాలో విస్తారంగా ఉన్న బొగ్గు, విద్యుత్, అటవీ, ఖనిజ సంపద ఆదారిత పరిశ్రమల ఏర్పాటు వేగవంతం కానుందన్నారు. ఎప్పటినుంచో నిలిచిపోయిన పాల్వంచ ఎన్నికలకు అడ్డంకులు తొలగిపోయాయని తెలిపారు. గెలిసిన 15 నెలల కాలంలోనే కార్పొరేషన్ సాధించి నియోజకవర్గ ప్రజలకు గెలుపు ఫలాలు అందించడం పట్ల అన్నివర్గాల్లో హర్షం వ్యక్తం అవుతోంది. కార్పొరేషన్ ఏర్పాటుకు నిరంతరం కృషి చేసిన శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావుకు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ సాబీర్ పాషా కృతజ్ఞతలు తెలిపారు.

## పాఠశాలల్లో మౌలిక వసతులకు స్వచ్ఛందంగా ముందుకు రావాలి

- రాష్ట్ర మార్కెఫెడ్ మాజీ డైరెక్టర్, మాజీ చైర్మన్ కొత్వాల
- జగన్నాధపురం హైస్కూల్ కు లైబ్రరీ పుస్తకాల అందజేత

**కొత్తగూడెం ప్రతినిధి, ఆర్గాన్ న్యూస్, మార్చి 24 :** పాఠశాలల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని రాష్ట్ర మార్కెఫెడ్ మాజీ డైరెక్టర్, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పాల్వంచ మండలం పరిధి జగన్నాధపురంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఎన్ఆర్ఐ వాసవి సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా కు చెందిన (పుస్తక మిత్ర) వారి ఆధ్వర్యంలో పాఠశాల ఉపాధ్యూరాలు దుర్గా శైలజ విజ్ఞప్తి మేరకు 40 వేల రూపాయల విలువ గల పుస్తకాలను రాష్ట్ర మార్కెఫెడ్ మాజీ డైరెక్టర్, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు చేతుల మీదగా పాఠశాల యాజమాన్యానికి అందజేశారు. ఈసందర్భంగా కొత్వాల మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధిలో అన్ని వర్గాల ప్రజలు ముందుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయభాస్కర్ రెడ్డి హెచ్ఎం పాఠశాల ఇంచార్జి బాల్య ఉపాధ్యాయులు భవాని దేవి పాపారావు మాధవి మని కావూరి శ్రీనివాసరావు దుర్గా శైలజ వెంకటరెడ్డి వెబ్కాతమ్మ అరుణ రాణి వేదకుమారి సత్యవతి గంగ మాజీ జడ్పిటిసి సభ్యులు యర్రంశెట్టి ముత్తయ్య, నందా నాయక్ గ్రామ పెద్దలు కోండం పుల్లయ్య బండపల్లి వెంకటరమణ బాదార్ల జోషి బానోత్ బాలాజీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




## ప్రజా సమస్యలు పరిష్కరించాలని ధర్నా

### సిపిఎం ఆధ్వర్యంలో భారీగా తరలివచ్చిన ప్రజలు

**తిరుమలాయపాలెం, ఆర్గాన్ న్యూస్, మార్చి 24 :** ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం తిరుమలాయపాలెం మండల కేంద్రంలో ఎండిఓ ఆఫీస్ కార్యాలయం ముందు సిపిఎం ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. తిరుమలాయపాలెం మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై గత వారం రోజులుగా గ్రామాల్లో సర్వే నిర్వహించి ఆ యొక్క సర్వేలో తేలిన సమస్యలపై మండల కేంద్రంలో పెద్ద ఎత్తున ధర్నా మహా ప్రదర్శన నిర్మించారు ప్రధానంగా తిరుమలాయపాలెం మండల కేంద్రంలో 130 మందికి ప్లాట్లు ఇచ్చారు కానీ స్థలాలు చూపెట్టక పోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నారని డబుల్ బెడ్ రూమ్ వాసులకు పొజిషన్ సర్టిఫికెట్ లేకపోవడం వల్ల హక్కుదారులు గా ఉండలేకపోతున్నారు. మండలంలో గోపాయగూడెంలో రేషన్ షాప్ ఏర్పాటు చేయాలని మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ పబ్లిక్ టాయిలెట్ ఎస్ బి ఐ బ్యాంకు మండల కేంద్రానికి అభివృద్ధికి నిధులు కేటాయించాలని మండలంలో కొత్త ఇండ్లు మంజూరు చేయాలని రేషన్ కార్డులు పెన్షన్లు 200 యూనిట్లు కరెంటు 500 గ్యాస్ పథకం ఇంటి స్థలం యొక్క సమస్యల పరిష్కారం కోసం పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ యొక్క ధర్నాకు ముఖ్యఅతిథిగా సిపిఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ పాల్గొని ప్రసంగించారు. బండి రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని ప్రజలందరూ ఇండ్లు కట్టుకోవడం కోసం ఎదురుచూస్తున్నా కాలనీలు మంజూరు కావడం లేదని చాలా కాలనీలలో ఇంటికొక ప్లాస్టిక్ పట్టా కప్పు కొని నివసించాల్సిన పరిస్థితి వచ్చిందని భూమి సమస్యలు పట్టాలు రాక సమస్యలు పేరుకుపోయాయని మండల కేంద్రంలో జిల్లా లో అత్యంత వెనుకబడిన మండల కేంద్రం ఉన్నదని దాని అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముందుగా డబల్ బెడ్ రూమ్ దగ్గర నుంచి భారీ ప్రదర్శన ఎండిఓ ఆఫీస్ వరకు నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసిల్దార్ పీవీ రామకృష్ణకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎర్ర శ్రీనివాసరావు జిల్లా కమిటీ సభ్యులు బసీరుద్దీన్ మండల కార్యదర్శి కొమ్ము శ్రీను దాసరి మహేందర్ తుళ్లూరు నాగేశ్వరరావు అంగిరేకుల నరసయ్య కొత్తపల్లి వెంకన్న వశపొంగు వీరన్న వేగినాటి మంగతాయి దొండేటి సుగుణమ్మ నెరుసుల వెంకటేష్ సోము పొంగు రాము కొమ్ము వెంకన్న తంగేళ్ల రమేష్ పుట్టల గురువయ్య సిద్దుల వెంకన్న గుండమల్ల ఉపేందర్ షేక్ ఖాసీం సరోజన ఉపేంద్ర మద్దినేని శ్రీనివాస్ కోడి లింగయ్య చాగంటి శ్రీను రాంబాబు ప్రభాకర్ పుసులూరి వీరభద్రం గోపోజు రవి, పప్పుల ప్రసాద్ ఉపేందర్ కాంపాటి బాబురావు దొండేటి నిర్మల్ రావు తదితరులు పాల్గొన్నారు.



## రంజాన్‌కు విస్తృత ఏర్పాట్లు చేపట్టండి

### అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే కూనంనేని



**కొత్తగూడెం ప్రతినిధి, ఆర్గాన్ న్యూస్, మార్చి 24 :** రంజాన్ పండుగ సందర్భంగా బస్తీలు, గ్రామాల్లో ఎలాంటి అసౌకర్యం కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని కొత్తగూడెం నియోజకవర్గ శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు సంబంధిత అధికారుల ను ఆదేశించారు. అసెంబ్లీ సమావేశాల్లో అయన సోమవారం మున్సిపల్, పొలిసు, పంచాయతి రాజ్ శాఖల సబ్ డివిజన్, మండల స్థాయి అధికారులకు సోమవారం ఫోన్ చేసి పలు సూచనలు చేశారు. ఉపవాస దీక్షలు, రంజాన్ పండుగ సందర్భంగా మజీదులు, బస్తీలు, గ్రామాల్లో ఇఫ్తార్ విందులు, ప్రేత్యేక ప్రార్ధనలు జరుగుతున్నాయని ఈ ప్రాంతాల్లో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టాలని, వీధుల్లోకి విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈద్గాలు, మజీదులు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సౌకర్యం, పారిశుధ్యం చేపట్టాలని సూచించారు. అదేవిధంగా పండుగ రోజు ప్రార్ధనలు నిర్వహించే ఈద్గాలు వద్ద జరిగే ప్రార్ధనల సందర్భంగా త్రాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలనీ, పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసి పండుగ ఉత్సవాలు ప్రశాంతగా జరిగేలా చర్యలు తీసుకోవాల ఆదేశించారు.




## జర్నలిస్టులకు వెంటనే ఇండ్ల స్థలం పంపిణీ చేయాలి

### బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి

**కొత్తగూడెం, ఆర్గాన్ న్యూస్ :** జర్నలిస్టులకు ఉచితంగా ఇండ్ల స్థలం పంపిణీ చేయాలని బిజెపి జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. , కొత్తగూడెం గంగా హుస్సేన్ బస్తీలో ఇంట్లో స్థలాల సాధనకై జర్నలిస్టులు చేపట్టిన ఐదవ రోజు నిరసన దీక్షకు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిజం వృత్తిలో నిత్యం ఆనేక ఒడిదుడుకులు ఎదుర్కొంటూ ప్రజా సంక్షేమం కోసం సమాజాన్ని మేల్కొలిపేలా వార్తలు రాస్తూ, చాలి చాలని వేతనాలతో కుటుంబాన్ని పోషించుకుంటున్న జర్నలిస్టు లకు ఇండ్ల స్థలం కోసం కోట్ల రూపాయలు చెల్లించాలని చెప్పడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుందా అని ప్రశ్నించారు. సమాజ హితం కోసం పాటు పడుతున్న విలేకరులకు నగదు చెల్లించి స్థలం కొనుక్కోమని చెప్పడం దారుణమని ఇకనైనా ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉచితంగా ఇండ్ల స్థలం తో పాటు ఇందిరమ్మ ఇంటిని సైతం మంజూరు చేయాలని, ఈ అంశంపై అసెంబ్లీలో ప్రస్థావించేలా తమ పార్టీ శాసన సభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకు వెళతానని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల శిబిరానికి హాజరై మద్దతు తెలిపిన వారిలో పట్టణ అధ్యక్షుడు గొడుగు శ్రీధర్, నాయకులు జెల్లరపు శ్రీనివాస్, చింతల చెర్వు శ్రీనివాస్, పాల్వంచ మనదల అధ్యక్షుడు రాపాక రమేష్, గుంపుల మహేష్, లక్ష్మీ దేవి పల్లి మండల అధ్యక్షుడు మాలోతు గాంధీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

### కార్పోరేటర్ కన్నం వైష్ణవి

**ఖమ్మం త్రీ టౌన్, ఆర్గాన్ న్యూస్, మార్చ్ 24 :** స్థానిక 46వ డివిజన్ పరిధిలోని సారధి నగర్ లో సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులైన మన్నే సంగమ్మ దాసరి పద్మలకు చెక్కులను వారి ఇంటికి వెళ్లి కార్పొరేటర్ కన్నం వైష్ణవి అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తుమ్మల నాగేశ్వరావు సిఫారసు మేరకు అనారోగ్యంతో వైద్యం చేయించుకున్న వారికి ఆర్థిక సహాయంగా ముఖ్యమంత్రి సహాయనిధి నుండి చెక్కులను మంజూరు చేయించడం జరిగిందని పేద ప్రజలకు సాయం అందించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని వారు తెలిపారు. ఖమ్మం నియోజకవర్గంలో ప్రజా సంక్షేమానికి తుమ్మల నాగేశ్వర రావు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు షేక్ రజ్జి నగర ఓబిసి ఛైర్మన్ బాణాల లక్ష్మణ్ జిల్లా కాంగ్రెస్ నాయకులు కన్నం ప్రసన్న కృష్ణ దేవర వెంకన్న శనిగరం ఉప్పలయ్య కాటం యాదయ్య మన్నె నరేష్ గోనెల రవిశంకర్ మన్నే హరికృష్ణ దయ్యాల నాగేశ్వరరావు జెట్ట కృష్ణయ్య తుపాకుల మధు సెల్వం జ్ఞానేశ్వర్ ఎమ్మె రామకృష్ణ రేగు రవీందర్ పర్సగాని మహేష్ పాల్గొన్నారు.



## రెడ్డి సంక్షేమ సంఘం సేవలు అభినందనీయం

**మదిర టౌన్, ఆర్గాన్ న్యూస్, మార్చి 24 :** ఆర్ వి కాంప్లెక్స్ ఎదురుగా రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ప్రారంభించిన కమిషనర్ సంపత్ కుమార్ అదనపు ఎస్ఐ చంద్రశేఖర్ మధిరలో వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్న రెడ్డి సంక్షేమ సంఘం సేవలుఅభినందనీయమని కమిషనర్ సంపత్ కుమార్ టౌన్ అదనపు ఎస్సై చంద్రశేఖర్ అన్నారు. మధిర ఆర్ వి కాంప్లెక్స్ ఎదురుగా మధిర రెడ్డి సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు జంగా నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకొని బాటసారులకు తాగునీరు అందించేందుకు రెడ్డి సంక్షేమ సంఘం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి తమ సేవా దృక్పథాన్ని చాటుకున్నారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు జంగా నరసింహారెడ్డి టీవీ రెడ్డి జంగా ప్రవీణ్ రెడ్డి లక్కిరెడ్డి సుధాకర్ రెడ్డి జంగా శ్రీనివాస్ రెడ్డి, జేవి రెడ్డి తూమాటి నవీన్ రెడ్డి ఎల్వి రెడ్డి ఉప్పెల సాంబిరెడ్డి కటికల శివారెడ్డి జొన్నల శివారెడ్డి బొగ్గుల వెంకటనారాయణ రెడ్డి తల్లపురెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి గంగవరపు వీరారెడ్డి గుండా వీరారెడ్డి బొగ్గుల భరత రెడ్డి వేమిరెడ్డి రవీందర్ రెడ్డి ముక్కెర రాజశేఖర్ రెడ్డి బొగ్గుల శ్రీనివాస్ రెడ్డి, శీలం జ్యోతిరెడ్డి కృష్ణవేణి తలపురెడ్డి సరస్వతి భార్గవి బొగ్గుల పద్మ శీలం పద్మ తదితరులు పాల్గొన్నారు.

# మళ్లీ మొదలైన.. కట్టు కాసారం మట్టి మాఫియా



- అంతా తెలిసే జరుగుతోందా..?
- కొంతకాలం విరామం ఈసారి ఆంధ్రకు తరలిస్తున్న మట్టి
- మైనింగ్ శాఖ పరిధి పెద్దదట.. సిబ్బంది లేరట..!
- గుట్టలు గుల్ల చేసి కోట్లు దండుకున్నా పట్టించుకోని మైనింగ్ అధికారులు
- కనీసం ఫోన్ లైన్లో కూడా అందుబాటులోకి రాని వైనం

**నేలకొండపల్లి, ఆర్గాన్ న్యూస్, మార్చి 24 :** పాలేరు నియోజకవర్గం నేలకొండపల్లి మండల పరిధిలోని కట్టు కాసారం గుట్టల్లో అక్రమ మట్టి మాఫియా కేటుగాళ్లు ఆదివారం అదునుగా భావించి ఓ చిరు ఉద్యోగికి ఇంటి అవసరానికి మట్టి అవసరమైందని అదునుగా తీసుకొని రెచ్చిపోయిన సంబంధిత మైనింగ్ అధికారుల్లో చలనం లేకపోవడం విశేషం. ప్రతిసారి పంచాయతీరాజ్ రెవెన్యూ ఇతర విభాగాలపై నేపాన్ని నెట్టి వేస్తూ మైనింగ్ శాఖ జిల్లా వ్యాప్తంగా ఉదాసీనంగా వ్యవహరిస్తూ అంతా తెలిసే జరిగేటట్లుగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి మీడియా ప్రతినిధులు మైనింగ్ శాఖ ఏడిని సంప్రదించే ప్రయత్నం చేయగా సిబ్బంది కొరత జిల్లా మొత్తం చూసుకోవాలి అనుమతులు ఉన్నాయో లేవో విచారణ చేసి పరిశీలిస్తాం చర్యలు తీసుకుంటాం అంటూ పుణ్యకాలం గడుపుతున్న నేపథ్యం పలు విమర్శలకు ఆరోపణలకు ఊతం తమిచ్చినట్లు పలువురు బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. స్తంభాలకు స్తంభాల లోతులో ఎటువంటి అనుమతులు లేకుండా ఆంధ్ర ప్రాంతానికి తరలిస్తూ లక్షల కాజేస్తున్న ప్రభుత్వ గుట్టలు గుల్ల చేస్తున్న సంబంధిత అధికారుల్లో చలనం లేకపోవడం సంచలనం కలిగిస్తోంది. గత ప్రభుత్వ హయం నుండి ప్రజా ప్రభుత్వంలో కూడా విచ్చలవిడిగా అక్రమ మట్టి రవాణా జరుగుతూ లక్షల రూపాయలు అక్రమార్కులు సంపాదిస్తున్న గాని పట్టించుకున్న నాధులు కరువయ్యారు. ఓ చిరు ఉద్యోగికి మట్టి అవసరమని అదును చూసి ఆదివారం పూట సాయంత్రం 6 గంటలకు ఆంధ్ర ప్రాంతానికి చెందిన ఓ వెంచర్కు దర్జాగా మట్టిని రవాణా చేస్తూ తమ ఉనికిని చాటుకుంటున్నట్లు స్థానికులు గుసగుసలాడుతున్నారు ఇటీవల జిల్లా స్థాయి మండల స్థాయి అధికారులు కట్టుకాసారం డంపింగ్ యార్డ్ వద్ద ఎటువంటి అనుమతులు లేకుండా మట్టి అక్రమ రవాణాపై దినపత్రికలలో కథనాలు వెలువడిన నేపథ్యంలో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి మండల తహసీల్దార్ స్పష్టమైన ఆదేశాలు హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో కొంతకాలం విరామం పాటించిన మట్టి మాఫియా కేటుగాళ్లు శనివారం నుండి మట్టి రవాణా చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు తెలుస్తోంది. మట్టి గుట్టల దగ్గర ట్రాక్టర్లు గాని జెసిబి గానీ కనపడితే కేసులు నమోదు చేస్తామని స్థానిక తాసిల్దార్ జె మాణిక్యాలరావు హెచ్చరించిన తోక ముడిచిన మట్టి వ్యాపారులు శని ఆదివారాలలో తమ ఉనికిని చాటుకుంటూ మట్టి రవాణా దర్జాగా కొనసాగించడం వెనుక మైనింగ్ శాఖ అధికారుల అండదండలు పుష్కలంగా ఉన్నట్లు ఆరోపణలు విమర్శలు వినిపిస్తున్నాయి ఇప్పటికైనా సంబంధిత జిల్లా స్థాయి అధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని పరిసర గ్రామాల ప్రజలు మండల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.



## స్వయం ఉపాధికి అవకాశం ఇవ్వండి

- సావిత్రిబాయి పూలే మహిళా సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ కు వినతి

**ఖమ్మం అర్బన్, ఆర్గాన్ న్యూస్, మార్చ్ 24 :** వీరనారి సావిత్రిబాయి పూలే మహిళా సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కి మహిళా సమస్యలతో కూడిన వినతి పత్రం ఇవ్వడం జరిగింది . మహిళలు ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నారని గ్రానైట్ వర్కర్స్ ఫ్యాన్సీ స్టోర్స్ టైలరింగ్ పూల కొట్టు బ్యాంగిల్ స్టోర్స్ ప్రైవేట్ టీచర్ బట్టల షాప్ ఇలా అన్నిచోట్ల మహిళలు పనిచేసుకుంటూ కుటుంబ జీవనం కొనసాగిస్తున్నారు. మహిళలకి ప్రధాన సమస్య ఆర్థిక ఇబ్బంది పడుతున్నారని స్వయం ఉపాధి అవకాశాల్ని అర్హులైన మహిళకు ఇవ్వాలని కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించారు అర్హులైన మహిళలకి ఉపాధి అవకాశాన్ని కల్పిస్తామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో వీరనారీ సావిత్రిబాయి పూలే మహిళా సంఘం జిల్లా అధ్యక్షులు పి.ఆర్ దేవి జిల్లా నాయకులు కటకం వెంకటలక్ష్మి భూక్య మణి తిప్పర్తి రమ్య ఇనపనూరి నాగలక్ష్మి కామన అనంతలక్ష్మి వరద లలిత మండల్ భవాని కోటేశ్వరి అనిత పాల్గొన్నారు .



## నేత్రదాత రాయమల్లుకు ఘన నివాళులు

- సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో
- జిదుల రాయమల్లు బాటలో పలువురు నేత్రదాతలు

**మందమర్రి, ఆర్గాన్ న్యూస్, మార్చి 24 :** మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణం మాజీ గంగపుత్ర సంఘం సభ్యులు, ఆదర్శ జీవి, నేత్రదాత స్వర్గీయ జీదుల రాయమల్లు వర్ధంతి సందర్భంగా సదాశయ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో జీదుల రాయమల్లు కి అత్యంత ఘన నివాళులు అర్పించడం జరిగింది. సదాశయ ఫౌండేషన్ సభ్యులు, లైన్స్ క్లబ్ సభ్యులు, కుటుంబ బంధుమిత్రులు పాల్గొని జిదుల రాయమల్లు కి ఘన నివాళులు అర్పిస్తూ వారి కుమారుడు జీదుల దామోదర్ కి వారి కుటుంబ సభ్యులకి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సదాశయ ఫౌండేషన్ సభ్యులు లైన్స్ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ నేత్రాలను ఇతరులకు దానం చేయడం వలన ఇతరులకు చూపునిచ్చినవారిమవుతామని, మనము లేకున్నా మన కళ్ళు ఇతరులకు దారి చూపుతాయని వారు తెలిపారు. జిదుల రాయమల్లు ఆదర్శ జీవి అని, వారి కళ్ళను దానం చేసి ఇరువురికి వారు చూపునిచ్చారని, వారి బాటలో వారి అడుగుజాడలో అనేకమంది ముందుకు వస్తున్నారని, ఈ సంఘీభావ కార్యక్రమంలో కూడా పలువురు వారి నేత్రాలను దానం చేస్తామని ముందుకు వచ్చారని తెలిపారు. సంతాప సభలో జిదుల రాయమల్లు ఆత్మ శాంతి కోసం మౌనం పాటించారు. అనంతరం వారి కుమారుడు జిదుల దామోదర్ కి సదాశయ ఫౌండేషన్ వారు నేత్రదాత జిదుల రాయమల్లు పేరుమీద నేత్రదానం చేసిన సర్టిఫికెట్ ను అందజేశారు. వారి కుమారుడు జీదుల దామోదర్ మాట్లాడుతూ మా తండ్రి ఒక మార్గదర్శిలా ఉండాలని కోరుకున్నారని,వారికి నేత్రాలు దానం చేయాలని ఆలోచన వచ్చిన వెంటనే వారు సదాశియ ఫౌండేషన్ వారికి స్వయంగా ఫోన్ చేసి వారే పిలిపించి మరి నేత్రాలు దానం చేస్తానని రాపిచ్చారని, తన తదనంతరం నేత్రాలను వారికి సమర్పించాలని తెలియజేశారని తెలిపారు. వారి తండ్రి బాటలో అనేకమంది పయనిస్తున్నందుకు వారికి గర్వంగా ఉందని తెలియజేశారు.



## యుడిఐడి కొరకు పేర్లు నమోదు చేసుకోవాలి

### అదనపు కలెక్టర్ రాధికా గుప్త

**మేడ్చల్ ప్రతినిధి, ఆర్గాన్ న్యూస్, మార్చ్ 24 :** యూనిక్ డిజబిలిటీ ఐడెంటిటీ కార్డు (సదరం)కోసం దివ్యాంగులు తమ పేర్లను యూడిఐడి పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాధికా గుప్తా సూచించారు. సోమవారం జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ముఖ్య అతిధిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో సదరం సర్టిఫికెట్ పొందడానికి మీ సేవ కు వెళ్లి స్లాట్ బుకింగ్ చేసుకొనేవారని ప్రస్తుతం ప్రభుత్వం ఈ ప్రక్రియను సులభ తరం చేసిందన్నారు. మొబైల్ ఫోన్లోనే ఇంటి వద్ద కూర్చొని యూడిఐడి పోర్టల్ లో తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని రాధికా గుప్తా తెలిపారు. గతంలో 7రకాల వైకల్యం ఉన్నవారికి అవకాశం ఉండగా దీనిని 21రకాల వైకల్యా లకు చెందిన వారికీ ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ఆన్లైన్లో సమర్పించిన దరఖాస్తులను పరిశీలించిన పిమ్మట వైద్యఅధికారులు పరీక్షలు నిర్వహించి కార్డు మంజూరు చేస్తారని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు.కార్డులను పోస్ట్ ద్వారా నేరుగా లబ్దిదారుల ఇంటికి పంపించడం జరుగుతుందని ఇందుకు ఎవరికి డబ్బులు ఇవ్వవలసిన అవసరం లేదని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాధికా గుప్తా వివరించారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సాంబశివరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగులకు కల్పించే ప్రయోజనాలకు యూడిఐడి కార్డు ఉపకరిస్తుందని, గతంలో సదరం సర్టిఫికెట్ ఉన్నవారు తిరిగి నమోదు చేసుకోవాల్సిన అవసరం లేదని తెలియ చేశారు. ఈ సమావేశంలో జిల్లాకు చెందిన ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు దివ్యాంగులు సిబ్బంది పాల్గొన్నారు.

## మహనీయుల విగ్రహాలు అంటే మంత్రి, ఎమ్మెల్యేకు పట్టింపు లేదా?

### జేఏసీ నాయకులు



**మానకొండూర్, ఆర్గాన్ న్యూస్, మార్చి 24:** తిమ్మాపూర్ మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో రెండేళ్ల క్రితం ఏర్పాటు చేసిన అంబేద్కర్ బాబు జగ్జీవన్ రావు విగ్రహాలను ఆవిష్కరించాలని గత 15 రోజులుగా జేఏసీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం రవాణా శాఖ కార్యాలయంలో అభివృద్ధి పనుల కోసం వచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణలకు జేఏసీ నాయకులు బస్టాండ్ లోని విగ్రహాలను ఆవిష్కరణ జరిగేలా ప్రభుత్వం కృషి చేయాలని కోరేందుకు వినతిపత్రం అందజేసే ప్రయత్నం చేయగా వారు స్పందించిన విధానం సరిగా లేదని సోమవారం రిలే దీక్ష శిబిరం వద్ద జేఏసీ కన్వీనర్లు సుగుర్తి జగదీశ్వర చారి వంతడుపుల సంపత్ మాతంగి శంకర్ దుండ్ర రాజయ్య విలేకరుల సమావేశం నిర్వహించారు మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఆవిష్కరణ కోసం కృషి చేయాలని వినతి పత్రం ఇచ్చేందుకు వెళితే కనీసం స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ఆధారంగానే మీరు పదవుల్లో ఉన్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు పట్టింపు లేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు బీసీ రిజర్వేషన్లు పెంచామని చెప్పుకుంటున్న ప్రభుత్వం ఏ విధంగా ఎవరు రాసిన రాజ్యాంగం ప్రకారం పెంచి ప్రయోజనం పొందాలని చూస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు మహనీయుల విగ్రహాలు పెడితే తప్పేంటి అని ప్రశ్నించారు విగ్రహాల చుట్టూ చెత్తా చెదారం నిండిపోయిందని మహనీయులకు ఇచ్చే గౌరవం ఇదేనా అని ధ్వజమెత్తారు అలాగే రిలే దీక్షకు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి వర్ణ వెంకటరెడ్డి వివిధ సంఘాల అధ్యక్షులు మాచర్ల అనిల్ లక్ష్మణ్ కన్నం లక్ష్మణ్ మాజీ సర్పంచ్ వడ్లూరు శంకర్ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ మాజీ సభ్యులు ఎలుక ఆంజనేయులు ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ పాశం అశోక్ రెడ్డి నాయకులు సంగుపట్ల మల్లేశం కొయ్యడ మురళి సముద్రాల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



## ఉచిత కంటి ఆపరేషన్.. వినియోగించుకోండి

### ప్రగతి సేవా సమితి జిల్లా కో ఆర్డినేటర్ ఐనాల పరశురాములు

**ఆర్గాన్ న్యూస్, మరిపెడ, మార్చి 24 :** ఈనెల మార్చి 26న, తానంచర్ల గ్రామంలో ప్రగతి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత కంటి ఆపరేషన్ శిబిరాన్ని ఉపయోగించుకోవాలని ప్రగతి సేవా సమితి మహబూబాబాద్ జిల్లా కో ఆర్డినేటర్ ఐనాల పరశురాములు కోరారు. ప్రగతి సేవా సమితి వ్యవస్థాపకులు గద్దల జాన్ ఆదేశానుసారం మండల నలుమూలల ఉచిత కంటి ఆపరేషన్ ప్రోగ్రాంకు గత వారం రోజులుగా మండల కో ఆర్డినేటర్ జినక సువార్త తన సిబ్బందితొ క్యాంపియన్ చేస్తున్న సందర్భంగా సోమవారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని తానంచర్ల గ్రామపంచయతీ ఆవరణలొ రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఐనాల పరశురాములు మాట్లాడుతూ ఈనెల 26న, బుధవారం రోజున స్ధానిక గ్రామపంచాయితీ కార్యాలయంలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ప్రగతి సేవా సమితి ఆధ్వర్యంలో పూర్తి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి శంకర కంటి ఆసుపత్రి నందు ఉచితంగా కంటి ఆపరేషన్ లు చేయిస్తామని తెలిపారు. ఉచిత కంటి ఆపరేషన్ శిబిరానికి వచ్చే రోగులు ఆధార్ కార్డు జీరాక్స్ మరియు ఫోన్ నెంబర్, వారు వివిధ జబ్బులకు రెగ్యులర్ గా వాడే మందులు తప్పని సరిగా వెంట తెచ్చుకోవాలని తెలిపారు. వినికిడి లోపం ఉన్నవారు మాత్రమే వెంట సహాయకులను తీసుకొని రావాలని వెంట ఒక జత బట్టలు అవసరమైన సామాగ్రి తెచ్చుకోవలని కోరారు. కార్యక్రమంలో ప్రగతి సేవా సమితి మరిపెడ మండల కో ఆర్డినేటర్ జినక సువార్త, తానంచర్ల ఏరియా కో ఆర్డినేటర్ తప్పేట్ల సతీష్ అబ్బాయిపాలెం కో ఆర్డినేటర్ జినక కృష్ణమూర్తి పాల్గొన్నారు.


# దమ్ముంటే ప్రధానితో ప్రకటన చేయించు

- డీలిమిటేషన్ తో దక్షిణాదికి అన్యాయం జరగదని ప్రధానితో ప్రకటన చేయించు
- బండి సంజయ్ డీలిమిటేషన్ పై కనీస అవగాహన లేదు నీకు
- జిడిపి, డీలిమిటేషన్ మధ్య తేడా తెలియని అజ్ఞాని బండి సంజయ్
- మొన్న ఎమ్మెల్సీ ఎన్నికల్లోనే తెలిసింది దోపిడి దొంగల ముఠా ఎవరో
- కేసుల భయంతోనే బీఆర్ఎస్ సరెండర్ అయింది నిజం కాదా?
- కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జ్ వెలిచాల రాజేందర్ రావు



**కరీంనగర్, ఆర్గాన్ న్యూస్, మార్చి 24 :** కేంద్రమంత్రి బండి సంజయ్ దమ్ముంటే దేశంలో డీలిమిటేషన్ ప్రక్రియతో దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగదని ప్రధాని నరేంద్ర మోడీతో ప్రకటన చేయించాలని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ ఇంచార్జ్ వెలిచాల రాజేందర్ రావు డిమాండ్ చేశారు అసలు బండి సంజయ్ కి డీలిమిటేషన్ ప్రక్రియపై కనీస అవగాహన లేదని అవగాహన లేకుండా మాట్లాడుతూ ప్రజల్లో చులకన అవుతున్నారని పేర్కొన్నారు సోమవారం వెలిచాల రాజేందర్ రావు మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రధాని మోదీ దేశంలో పార్లమెంటు నియోజకవర్గాల డీలిమిటేషన్ చేసేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు ఈ నేపథ్యంలో ఈ అంశంపై చర్చించేందుకు చెన్నైలో ముఖ్యమంత్రి స్టాలిన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశాన్ని దోపిడి దొంగలు ముఠా సమావేశంగా బండి సంజయ్ అభివర్ణించడాన్ని రాజేందర్ రావు తప్పుపట్టారు బాధ్యతయుతమైన కేంద్ర మంత్రి పదవిలో ఉన్న బండి సంజయ్ కి కనీసం డీలిమిటేషన్ ప్రక్రియ పై అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు మొన్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏ దొంగల ముఠాతో బీజేపీ లోపాయికార ఒప్పందం చేసుకుందో ప్రజలందరికీ అర్థమైందని ఆరోపించారు అందు కోసమే బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థిని నిలబెట్టలేదని కేసుల భయంతోనే బీజేపికి లొంగిపోయిందని ధ్వజమెత్తారు కెసిఆర్ ప్రధాని మోదీకి భయపడే ఎమ్మెల్సీ ఎన్నికల్లో సరెండర్ అయ్యారని ఘాటుగా విమర్శించారు డీలిమిటేషన్ విధానంతో దక్షిణాది రాష్ట్రాల భవిష్యత్ దెబ్బతింటుందని ఆ సోయి తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి బండి సంజయ్ కి లేకపోవడం దారుణమని పేర్కొన్నారు దేశ జిడిపికి డీలిమిటేషన్ కు మధ్య అవినాభావ సంబంధం ఉంటుందని ఆ జ్ఞానం కేంద్రమంత్రి బండి సంజయ్ కి లేకపోవడం విస్మయం కలుగుతుందన్నారు డీలిమిటేషన్ తో దక్షిణాది రాష్ట్రాల భవిష్యత్ దెబ్బతింటుందని పార్లమెంట్లో ప్రాతినిధ్యంతో పాటు అన్ని రంగాల్లోనూ అన్యాయం జరుగుతుందని తెలిపారు నిధుల కేటాయింపుల్లోనూ నష్టం జరుగుతుందన్నారు జనాభా ప్రాతిపదికన చేపట్టే డీలిమిటేషన్ విధానంతో అధికారం కేంద్రీకృతమై నియంత్రణత్వం పెరిగిపోతుందని కేవలం నాలుగైదు రాష్ట్రాలే దేశ భవిష్యత్ ను శాసించే దుస్థితి ఏర్పడుతుందన్నారు రాష్ట్రాలు సాధించిన అభివృద్ధికి తగ్గట్టు అన్ని రాష్ట్రాలకూ సమాన ప్రాతినిధ్యం ఉండేలా పార్లమెంట్ స్థానాల విభజన చేయాలని ఆయన పేర్కొన్నారు 50 ఏండ్లపాటు జనాభా ఆధారంగా సీట్ల పెంపును నిలిపేశారనీ ఈ 50 ఏండ్లలో దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణలో అద్భుతమైన విజయాన్ని సాధించాయని పేర్కొన్నారు ఇప్పుడు ఇదే అదునుగా భావించి జనాభా ఆధారంగా డీలిమిటేషన్ చేయడం ఘోరమైన అన్యాయమన్నారు దక్షిణాది రాష్ట్రాలు దేశ జీడీపీలో 36శాతం వాటా ఇస్తున్నాయనీ అయితే జనాభా మాత్రం 19శాతమేనని ఈ నేపథ్యంలోనే జనాభా ఆధారంగా కాకుండా జిడిపి ఆధారంగా దక్షిణాది రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్లో ప్రాతినిధ్యం ఇవ్వాలనీ డిమాండ్ చేశారు కొత్త లోక్సభ సీట్లలో దక్షిణాదికి 33శాతం వాటా సీట్లు ఇవ్వాలని ఇదే దక్షిణాది రాష్ట్రాల డిమాండ్ అని ఇటీవల చెన్నైలో జరిగిన సమావేశంలో తెలంగాణ ముఖ్యమంత్రి సీఎం రేవంత్ స్పష్టం చేశారని రాజేందర్ రావు పేర్కొన్నారు కేంద్రంలోని బీజేపీ సర్కార్ 50శాతం ఎంపీ సీట్లను పెంచాలనుకుంటే అలా పెరిగే 272 సీట్లతో మొత్తం లోక్ సభ సీట్ల సంఖ్య 815 అవుతుందనీ ఇందులో దక్షిణాది రాష్ట్రాలకు 33శాతం అంటే 272 సీట్లు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని సీఎం కోరారని తెలిపారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించిన అంశాలు ప్రయోజనకరంగా ఉన్నాయని వెలిచాల రాజేంద్రరావు చెప్పారు ఈ అంశాలను పరిగణలోకి తీసుకొని కేంద్ర ప్రభుత్వం ఆ విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ చేపడితే సహించేది లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారని పేర్కొన్నారు.

ప్రాంతీయం



## అల్లాదుర్గ్-మెటల్ కుంట రోడ్డును జాతీయ రహదారిగా మార్చండి

**కేంద్ర మంత్రి గడ్కరీని కోరిన గంగా జోగినాథ్ గుప్త**

**జోగిపేట, ఆర్గాన్ న్యూస్, మార్చి 24 :** ఆందోల్ నియోజకవర్గంలోని అల్లాదుర్గం-మెటల్ కుంట రోడ్డును జాతీయ రహదారిగా ప్రకటించి పునర్నిర్మించాలని జోగిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గంగా జోగినాథ్ గుప్త కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రినితిన్ గడ్కరీని కోరారు. సోమవారం మాజీ ఎంపీ బీబీ పాటిల్ సూచన మేరకు ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో జోగినాథ్ నితిన్ గడ్కరీని కలిసి వినతి పత్రం సమర్పించారు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలను కలిపే ఈ రోడ్డు గూండా ప్రతినిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయని ఆయన నితిన్ గడ్కరీకి వివరించారు. మహారాష్ట్ర రాజధాని ముంబై ని కూడా ఈ దారి కలుపుతుందన్నారు. ఇంతటి ప్రాధాన్యమున్న ఈ రోడ్డు ఇటీవల పూర్తిగా ధ్వంసమైందని కేంద్ర మంత్రితో పేర్కొన్నారు.. గంగా జోగినాథ్ చెప్పిన విషయాలను శ్రద్ధగా విన్న నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించారు.

## రైతాంగం సంక్షోభంలో ఉంది

- పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి
- మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



**మానకొండూర్, ఆర్గాన్ న్యూస్, మార్చి 24 :** బెజ్జంకి మండల కేంద్రం రాంసాగర్ గ్రామాలకు చెందిన రైతులు కల్లూరి రమేష్ అడుకని రమేష్ అడుకని రవి వడిజె కనకయ్య లకు చెందిన అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలను మానకొండూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే డా రసమయి బాలకిషన్ సోమవారం పరిశీలించారు. అకాల వర్షాలు వడగండ్లు అన్నదాతలను తీవ్రంగా దెబ్బతీశాయని నోటికాడికి వచ్చిన పంట చేతికి రాకపోవడంతో లబోదిబోమంటున్నారని అన్నారు ప్రధానంగా వరి మొక్కజొన్న మామిడి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని పిడుగుపాటుకు పశువులు సైతం మృతి చెందాయని గాగిల్లపూర్ గ్రామానికి చెందిన రైతు శ్రీనివాస్ కు చెందిన గేదె చనిపోయిందని అతనిని ఆదుకోవాలని స్థానిక ఎమ్మెల్యే కనీసం దెబ్బతిన్న పంటలని పరిశీలించిన పాపాన పోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు చేతికి వచ్చిన పంట నష్టపో యి రైతు బాధల్లో ఉంటే ప్రభుత్వం కనీసం స్పందించట్లేదని తక్షణమే రైతులను ఆర్థికంగా ఆదుకొని ఇన్ పుట్ సబ్సిడీ అందజేసి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని అన్నారు కాంగ్రె స్ ప్రభుత్వం అడుగడుగునా రైతులను దగా చేసిందని వరంగల్ డిక్లరేషన్ లో ఇచ్చిన ఒక్క హామీ అమలుకు నోచుకోలేదని అన్నదాతలకు రూ 2లక్షల రుణ మాఫీ చేస్తామని హామీ ఇచ్చి ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ పూర్తి స్థాయిలో అమలు చేయాలని మా ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ప్రస్తావిస్తే కాంగ్రెస్ నాయకులు స్పందించిన పాపాన పోలేదని దేశంలో మొదటి సారిగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎకరానికి రూ 10వేల చొప్పున 11 విడతల్లో రూ 73వేల కోట్లు రైతు బంధు కింద రైతులకు సాయం చేసినట్లు గుర్తు చేశారు కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ఎకరానికి రూ 7500వేలు రైతు భరోసా ఇస్తామని హామీ ఇచ్చి వానకాలం పంటకు రైతుల ఖాతాల్లో జమ చేయలేదని యాసంగి పంటకు ఎకరాకు రూ 6వేలు ఇస్తామని చెప్పి మూడు ఎకరాలు దాటలేదని రైతులకు ఇచ్చిన హామీ మేరకు ఎకరాకు రూ 15వేల చొప్పున యాసంగి వానకాలం రైతు భరోసా డబ్బులు అన్నదాతల ఖాతాల్లో జమ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు అన్ని పంటలకు బోనస్ అనేది బోగస్ అయిపోయిందని అన్నారు ఈ కార్యక్ర మంలో భారత రాష్ట్ర సమితి మండల అధ్యక్షులు పాకాల మహిపాల్ రెడ్డి సీనియర్ నాయకులు లింగాల లక్ష్మణ్ కనగండ్ల తిరుపతి ప్యాక్స్ వైస్ చైర్మన్ బండి రమేష్ యాదవ్ నియోజక వర్గ సోషల్ మీడియా అధ్యక్షులు ఎల శేఖర్ బాబు బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు వంగల నరేష్ నాయకులు గుబిరే మల్లేశం మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు రాగుల మహేష్ దేవస్థానం మాజీ చైర్మన్ బండారి రాములు డైరెక్టర్ లు దొంతరవేణి ఓదెలు తిప్పారపు మహేష్ యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఘనపురం తిరుపతి జంగిటి శంకర్ కల్లూరి అజయ్ వాసీమల్ల రమేష్ ఎల రాజేందర్ సంగ నరేష్ తదితరులు ఉన్నారు.



## ప్రజావాణి దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**

**కరీంనగర్, ఆర్గాన్ న్యూస్, మార్చి 24 :** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సంబంధిత అధికారులను ఆదేశించారు సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు వినతులను అదనపు కలెక్టర్లతో కలిసి కలెక్టర్ స్వీకరించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు ప్రజావాణి ఆశ్రయిస్తున్నారని ఎన్నో వ్యయ ప్రయాసలతో ఇక్కడికి వస్తున్న వారి దరఖాస్తులను వీలైనంత త్వరగా పరిష్కరించాలని అన్నారు సంబంధిత అధికారులు శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదుల తో పాటు పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని అన్నారు ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 169 దరఖాస్తుల స్వీకరించగా వాటిని వెంటనే సంబంధిత అధికారులకు బదిలీ చేసి పరిష్కరించాలని ఆదేశించారు ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మి కిరణ్ ప్రఫుల్ దేశాయి మున్సిపల్ కమిషనర్ చాహత్ భాజ్ పాయి డిఆర్ఓ వెంకటేశ్వర్లు ఆర్డీఓలు రమేష్ మహేశ్వర్ వివిధ జిల్లా స్థాయి అధికారులు కలెక్టరేట్ పర్యవేక్షకులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## సీసీ రోడ్డుకు శంకుస్థాపన

**మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్**

**వికారాబాద్, ఆర్గాన్ న్యూస్, మార్చి 24 :** బంట్వారం మండల కేంద్రంలో ఈరోజు బస్టాండ్ నుండి గ్రామంలోకి ఎన్ఆర్ఈజీఎస్ 10 లక్షల రూపాయల నిధులతో సిసి రోడ్డు పనులను మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి శంకుస్థాపన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో బంట్వారం మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశం మర్పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్లు యాదగిరి నర్సిములు సీనియర్ నాయకులు శ్రీకాంత్ ప్రభాకర్ నర్సిములు రమేష్ కాంగ్రెస్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## జిన్నారంలో మంజూరైన కోర్టు

- మరమ్మతు పనులు ప్రారంభించిన బార్ అసోసియేషన్
- అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, బార్ మెంబర్స్, అడ్వకేట్స్ మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్



**పటాన్చెరు, ఆర్గాన్ న్యూస్, మార్చి 24 :** సంగారెడ్డి జిల్లా పటాన్చెరువు నియోజకవర్గ పరిధిలోని జిన్నారం మండల కేంద్రంలో జూనియర్ సివిల్ జడ్జి -కామ్ - జ్యూడిషల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టుకు సంబంధించిన మరమ్మతు పనులను ఈరోజు ప్రారంభించడం జరిగింది. బార్ అసోసియేషన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, శ్రీధర్‌రెడ్డి మెంబర్స్, అడ్వకేట్స్ మాట్లాడుతూ గతంలో జిన్నారం మండలంలో కోర్టును మంజూరు చేసిన హైకోర్టుకు ముందుగా ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ. హైకోర్టు న్యాయవాది పబ్లిక్ ప్రాసిక్యూటర్ సి. ప్రతాప్ రెడ్డి కూడా ప్రత్యేకంగా ధన్యవాదనాలు తెలుపుతూ. శాశ్వత భవనం ఏర్పాటు అయ్యేంతవరకు తాత్కాలికంగా ఈ భవనాన్ని సద్వినియోగం చేసుకుంటామని తెలిపారు. ఈ కోర్టు నాలుగు పోలీస్ స్టేషన్లో 3 మండలాలను కలుపుకొని జూనియర్ సివిల్ జడ్జి -కామ్- జ్యూడిషల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టును మంజూరు చేయడం జరిగిందని తెలుపుతూ అలాగే గతంలో కోర్టుకు వెళ్లాలంటే దాదాపు 50 కిలోమీటర్లు ప్రయాణించి కోర్టుకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని అన్నారు. అది దృష్టిలో ఉంచుకొని జిన్నారం మండల కేంద్రంలో నూతన కోర్టును మంజూరు చేయడం చాలా సంతోషకరమని హర్షం వ్యక్తం చేశారు. మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్ మాట్లాడుతూ జిన్నారం మండల కేంద్రానికి కోర్టును తీసుకురావడానికి తన వంతు కృషి తను చేశానని మూడు మండలాలను నాలుగు పోలీస్ స్టేషన్లో పరిధిలో ఉన్న కేసులను జిన్నారం మండల కేంద్రంలో పరిష్కరించుకోవడానికి దోహదపడుతుందని తెలిపారు. ఏళ్ల తరబడి కేసులతో ఇబ్బంది పడుతున్న వారికి దూర ప్రయాణాల చేయలేక ఇబ్బంది పడుతున్న వారికి మేలు జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి నర్సాపూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి జిన్నారం మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్ అడ్వకేట్లు శ్రీనివాస్ గౌడ్ ప్రకాష్ ఏ శ్రీనివాస్ సత్యనారాయణ బాలకిషన్ ఏజీపీ సుధాకర్ మధుశ్రీ, నాగరాజు సాయి రామకాంత్ వెంకట్రామిరెడ్డి. నాయకులు మ్యాధరి శంకరయ్య కోరాబోయిన నరేష్ యనగండ్ల నరేందర్ ప్రతాప్ రెడ్డి కోటేష్ గౌడ్ పల్నాటి భాస్కర్ రాజిరెడ్డి గోకర్ వెంకటేష్ ప్రవీణ్ వడ్ల నరేష్ యాదగిరి కంది ప్రవీణ్.వెంకటేష్ అశోక్ నాయకులు ప్రజలు పాల్గొన్నారు.




## ఢిల్లీలో బీసీ బిల్ కోసం గాంధీగిరి

**బీసీ ఆజాది ఫెడరేషన్ అధ్యక్షులు జక్కని సంజయ్ కుమార్**

**మానకొండూర్, ఆర్గాన్ న్యూస్, మార్చి 24 :** తెలంగాణలో ఆమోదించిన 42శాతం వాటా బీసీ బిల్ ను పార్లమెంటులో ప్రవేశపెట్టి తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్తో ఢిల్లీలో బీసీల పోరాటాన్ని కొనసాగిస్తున్నామని బిల్లు పార్లమెంట్లో ప్రవేశపెట్టాలని బిల్లుకు మద్దతు తెలపాలని అందరూ ఎంపీలను కలుస్తూ వినతి చేస్తున్నామని గాంధీయవాద పద్ధతిలో గాంధీ గిరి నినాదంతో ఈ పోరాటం కొనసాగిస్తున్నామని బీసీ ఆజాది ఫెడరేషన్ అధ్యక్షులు జక్కని సంజయ్ కుమార్ తెలిపారు సోమవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్లో నేషనల్ ఓబీసీ ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షులు అల్ల రామకృష్ణ హిందూ బీసీ మహాసభ అధ్యక్షులు బత్తుల సిద్దేశ్వర పటేల్ లతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు బీసీల పోరాటాన్ని ఉధృతం చేస్తామని తప్పకుండా కుల గణన సాధించి బీసీ బిల్ కు చట్ట భద్రత సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు రాష్ట్రంలో గతంలో ఆమరణ దీక్ష చేపట్టి బీసీ బిల్ ను సాధించామని ఇప్పుడు కూడా పోరాటంతో కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి బీసీ బిల్ సాధిస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో బీసీ ఆజాది సంగ్ సంఘం మహేష్ గౌడ్ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి తుమ్మరాడ శ్రీనివాస రావు పొన్నాల అశిష్ తదితరులు పాల్గొన్నారు.



## కలెక్టరేట్లో చలివేంద్రం ప్రారంభం

**కరీంనగర్, ఆర్గాన్ న్యూస్, మార్చి 24 :** కరీంనగర్ రెవెన్యూ క్లబ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ మెయిన్ గేట్ వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశారు ఈచలివేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సోమవారం ప్రారంభించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ పనుల కోసం ప్రజావాణిలో దరఖాస్తు సమర్పించేందుకు కలెక్టరేట్ కు వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ డిఆర్ఓ వెంకటేశ్వర్లు ఆర్డిఓ మహేశ్వర్ ఉద్యోగుల సంఘం నాయకులు శ్రీనివాస్‌రెడ్డి కాళీ చరణ్ పాల్గొన్నారు.

## ప్రజావాణి ప్రతి అర్జీపై తక్షణ చర్యలు

**కలెక్టర్ వల్లూరి క్రాంతి**



**సంగారెడ్డి ప్రతినిధి, ఆర్గాన్ న్యూస్, మార్చి 24 :** సంగారెడ్డి జిల్లాలో ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహిం చిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుండి 69 దరఖాస్తుదారులు తమ సమస్యల పరిష్కారం కోసం అర్జీలు సమర్పించారు. రెవెన్యూ శాఖ 25 పౌరసరఫరాల శాఖ 02,సర్వే ల్యాండ్ 3, పంచాయతీ పిటి విభాగం 7, పంచా యతీరాజ్ 4,డి.ఆర్.డి.ఓ 3,మున్సిపల్ 10, వెల్ఫేర్ డిపార్ట్మెంట్ 5, విద్యాశాఖ 2, వ్యవసాయ శాఖ 3, పశు వైద్య శాఖ 2, వైద్య ఆరోగ్యశాఖ 3, ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ ప్రతి అర్జీపై తక్షణ చర్యలు తీసుకుని సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉండాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే ప్రజల ప్రధాన సమస్యల పై పూర్తి దృష్టి పెట్టి పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి డీ.ఆర్.ఓ పద్మజ రాణి జడ్పీసీఈఓ జానకి రెడ్డి, ఆర్.డి.ఓ లు సంబంధిత శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



## సీతారామాంజనేయ స్వామి దేవాలయ ముఖ ద్వారం ప్రారంభం

**ప్రారంభించిన శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి**

**పటాన్చెరు, ఆర్గాన్ న్యూస్, మార్చి 24 :** సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని వందనాపురి కాలనీలోని గల శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయం ముఖద్వారాన్ని సోమవారం నాడు పటాన్చెరు శాసన సభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి ప్రారంభించిన అనంతరం ఆలయ వార్షికోత్సవ పూజా కార్యక్రమాలలో పాల్గొన్న ఆయన సొంత నిధులతో ఆలయ ముఖద్వారం నిర్మించడం సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నర్సింహా గౌడ్ సీనియర్ నాయకులు రమేష్ గౌడ్ ప్రమోద్ రెడ్డి పాల్గొన్నారు.



## మంచినీటి సరఫరా ట్యాంకర్ ప్రారంభం

**కలెక్టర్ క్రాంతితో వాసవి సంస్థ సభ్యులు**

**సంగారెడ్డి ప్రతినిధి, ఆర్గాన్ న్యూస్, మార్చి 24 :** వేసవిలో సంగారెడ్డి పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం వాసవి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సంగారెడ్డి మున్సిపాలిటీకి అందజేసిన ఉచిత మంచినీటి సరఫరా ట్యాంకర్ ను జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి క్యాంపు కార్యాలయం వద్ద సోమవారం ప్రారంభించారు. వాసవి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గత పది సంవత్సరాలుగా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఏటా ఎండాకాలంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం మున్సిపాలిటీకి ట్యాంకర్ ను ద్వారా ప్రతిరోజు మంచినీటి సరఫరా వాసవి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో తెలిపారు. చలికాలంలో వసతి గృహాల్లో ఉండే విద్యార్థులకు చలి నుండి కాపాడడం కోసం వాసవి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించినట్లు ఈ సందర్భంగా కలెక్టర్ గుర్తు చేశారు. ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా వాసవి స్వచ్ఛంద సంస్థ జిల్లాలో మంచి గుర్తింపు తెచ్చుకుందన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులను కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో వాసవి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు తోపాజి అనంత కిషన్ మున్సిపల్ కమిషనర్ ఎస్ సి వి కె చవాన్ వాసవి స్వచ్ఛంద సంస్థ, సభ్యులుతదితరులు పాల్గొన్నారు.

## 'సీఎం పెళ్లాం' ప్రమోషనల్ సాంగ్ లాంచ్ ఈవెంట్



**ఫిలింనగర్ ప్రతినిధి, ఆర్గాన్ న్యూస్, మార్చి 24 :** ఇంద్రజ, అజయ్ , జయసుధ , సుమన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా "సీఎం పెళ్లాం". ఈ చిత్రాన్ని ఆర్.కే సినిమాస్ బ్యానర్ పై బొల్లా రామకృష్ణ నిర్మిస్తున్నారు. దర్శకుడు గడ్డం రమణా రెడ్డి రూపొందిస్తున్నారు. త్వరలోనే ఈ సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది ఈ నేపథ్యంలో "సీఎం పెళ్లాం" సినిమా ప్రమోషనల్ సాంగ్ లాంచ్ కార్యక్రమాన్ని హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్మాత బొల్లా రామకృష్ణ మాట్లాడుతూ – రాజకీయ నేపథ్యంతో సాగే మంచి సందేశాత్మక చిత్రమిది. సీఎంగా అజయ్, ఆయన భార్య పాత్రలో ఇంద్రజ నటన ఆకట్టుకుంటుంది. మా మూవీ ప్రమోషనల్ సాంగ్ రిలీజ్ చేశాం హైదరాబాద్ నగరం గురించి చేసిన ఈ పాట మీ అందరికీ నచ్చుతుంది. త్వరలోనే మా సీఎం పెళ్లాం సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం. అన్నారు. నటుడు అజయ్ మాట్లాడుతూ – ఈ సాంగ్ చూశాక చాలా ఎమోషనల్ అయ్యాను. సీఎం పెళ్లాం చిత్రంలో నటించే అవకాశం రావడం హ్యాపీగా ఉంది. నేను సీఎంగా నటిస్తే , నా భార్య పాత్రలో ఇంద్రజ చేశారు. ఇంద్రజతో కలిసి నటించడం సంతోషంగా ఉంది. నేను సీఎంగా చేసినా సినిమా మొత్తం ఇంద్రజ ఉంటారు. నటీనటులు ఎలా సమయపాలన పాటించాలో ఇంద్రజని చూసి నేర్చుకున్నాను. డైరెక్టర్ గడ్డం రమణా రెడ్డి మూవీని పర్ఫెక్ట్ ప్లాన్ తో రూపొందించారు. ఈ సినిమాతో ఆయనకు మంచి పేరొస్తుంది. సీఎం పెళ్లాం సినిమా మీ అందరికీ నచ్చేలా ఉంటుందని చెప్పగలను. అన్నారు. నటి ఇంద్రజ మాట్లాడుతూ – సీఎం పెళ్లాం సినిమా ఒక మంచి సోషల్ కాన్సెప్ట్ తో వస్తోంది. సీఎం పెళ్లాం బయటకు వస్తే ఎలా ఉంటుంది అనేది ఈసినిమాలో మా డైరెక్టర్ చక్కగా చూపించారు ఎంటర్ టైన్ మెంట్ ఇస్తూనే ఆలోచింపజేసే చిత్రమిది ఈ చిత్రంలోని సీన్స్ కు మీరంతా కనెక్ట్ అవుతారు మీ రియల్ లైఫ్ లో చూసినవి, విన్నవి, జరిగిన ఇన్సిడెంట్స్ మా సీఎం పెళ్లాం మూవీలో చూస్తారు మాదొక చిన్న సినిమా. ఇటీవల కంటెంట్ ఓరియెంటెడ్ మూవీస్ ను ప్రేక్షకులు బాగా ఆదరిస్తున్నారు ఆ నమ్మకంతోనే ఈ సినిమాను మీ ముందుకు త్వరలో తీసుకొస్తున్నాం సీఎం పెళ్లాం చిత్రానికి విజయాన్ని అందిస్తారని కోరుకుంటున్నా అన్నారు.



## శ్రీ వీరభద్ర స్వామి కళ్యాణోత్సవం

**పాల్గొన్న కాట సుధా శ్రీనివాస్ గౌడ్**

**పటాన్చెరు, ఆర్గాన్ న్యూస్, మార్చి 24 :** సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం మండలం బొంతపల్లి గ్రామంలోని గల శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కల్యాణ మహోత్సవం లో సోమవారం నాడు సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాట సుధా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులతో కలిసి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు. వారు మాట్లాడుతూ భక్తుల నమ్మకంతో ఆలయ మహోత్సవాలు ఎంతో వైభవంగా జరుగుతున్నాయని ప్రజలంతా శాంతి సంపదలతో అభివృద్ధి చెందాలని స్వామి దర్శించుకున్నారు.



## ప్రతి కప్పును ఆస్వాదిస్తుంటే.. వారి స్ఫూర్తిదాయక ప్రయాణం గుర్తుకురావాలి : చంద్రబాబు

**అమరావతి:** అరకు కాఫీ గురించి మన్ కీ బాత్‌లో ప్రస్తావించినందుకు ప్రధాని మోదీకి, పార్లమెంట్‌లో కాఫీ స్టాల్ ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇచ్చిన లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ మైలురాయిని నిజం చేసిన ప్రతి ఒక్కరికీ సీఎం కృతజ్ఞతలు తెలిపారు. పార్లమెంట్ ప్రాంగణంలో కాఫీ స్టాళ్లను ఏర్పాటు చేసిన సందర్భంగా 'ఎక్స్' వేదికగా చంద్రబాబు స్పందించారు. "ఇది మనందరికీ, ముఖ్యంగా మన గిరిజన రైతులకు గర్వకారణం. వారి అంకిత భావం, కృషి.. అరకు కాఫీని జాతీయ స్థాయికి తీసుకెళ్లింది. ప్రతి కప్పును ఆస్వాదిస్తుంటే.. వారి స్ఫూర్తిదాయక ప్రయాణం గుర్తుకురావాలి" అని అన్నారు. పార్లమెంట్‌లో మన అరకు కాఫీ స్టాను ప్రారంభించేందుకు ప్రోత్సహించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఈ సందర్భంగా విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కృతజ్ఞతలు చెప్పారు.



## అమరావతిలో అంతర్జాతీయ స్థాయి వర్సిటీ

### జీఎన్‌యూతో ఏపీ ప్రభుత్వం ఒప్పందం

**అమరావతి:** రాష్ట్రంలో విద్యార్థులకు నాణ్యతతో కూడిన ఉన్నత విద్యను అందించే లక్ష్యంతో అమరావతిలో ప్రతిష్ఠాత్మక ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఏర్పాటుకు జార్జియా నేషనల్ యూనివర్సిటీ ముందుకొచ్చింది. ఈ మేరకు రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సమక్షంలో జార్జియన్ నేషనల్ యూనివర్సిటీ (జీఎన్‌యూ)తో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన ఒప్పందం చేసుకుంది. ఉండవల్లిలోని నివాసంలో జరిగిన కార్యక్రమంలో జీఎన్‌యూ, ఏపీ ప్రభుత్వ ప్రతినిధులు ఎంవోయూపై సంతకాలు చేశారు. ఒప్పందం ప్రకారం అమరావతిలో ఇంటర్నేషనల్ యూనివర్సిటీ స్థాపించడానికి జీఎన్‌యూ సుమారు రూ.1,300 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. ఈ ఒప్పందంతో 500 మందికి ఉపాధి లభించే అవకాశం ఉంది. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. జీఎన్‌యూతో ఒప్పందం రాష్ట్ర విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యను అందించడంతోపాటు ఏపీ విద్యారంగాన్ని ప్రపంచపటంలో నిలిపేందుకు దోహదపడుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో విద్యా ప్రమాణాలను పెంచడమే కాకుండా ప్రపంచ ఉద్యోగ మార్కెట్‌లో విజయం సాధించడానికి అవసరమైన నైపుణ్యాలు అందుతాయని తెలిపారు. ఏపీ విద్యార్థులను గ్లోబల్ లీడర్లుగా తీర్చిదిద్దాలన్న తమ ప్రభుత్వ చిత్తశుద్ధి, నిబద్ధతకు ఈ ఒప్పందం నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్నత విద్య ప్రమాణాలను మెరుగుపర్చడం, గ్లోబల్ ఎక్స్‌పోజర్, పాఠ్యాంశాలను మెరుగుపర్చడం, అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకోవడం, పరిశోధన, నవీన ఆవిష్కరణలను ప్రోత్సహించడం ఈ ఒప్పందం ప్రధాన లక్ష్యమని లోకేశ్ వెల్లడించారు. అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన టెక్నాలజీ, బిజినెస్, హెల్త్ కేర్ రంగాల్లో విద్యార్థులకు జీఎన్‌యూ నైపుణ్యాలను అందిస్తుందన్నారు.



## టీటీడీ ఆస్తుల పరిరక్షణకు కమిటీ ఏర్పాటు

### చైర్మన్ బీఆర్ నాయుడు

**తిరుమల:** తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) శాశ్వత ఉద్యోగులకు మూడు నెలలకు ఒకసారి సుపథం దర్శనం కల్పిస్తామని తితిదే చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. సుపథం టికెట్ ఇచ్చి శ్రీవారి దర్శనం కల్పిస్తామని చెప్పారు. తిరుమలలో లైసెన్స్ లేని దుకాణాలను ఖాళీ చేయిస్తామని తెలిపారు. తితిదే ధర్మకర్తల మండలి సమావేశం అనంతరం ఈవో శ్యామలరావుతో కలిసి బీఆర్ నాయుడు మీడియాతో మాట్లాడారు. బోర్డు తీర్మానాలను వివరించారు.

**బోర్డు చేసిన తీర్మానాలు ఇవీ..**

- ఇతర దేశాల్లో ఆలయాల నిర్మాణాల కోసం ప్రత్యేక ట్రస్ట్
- టీటీడీ ఆస్తులు పరిరక్షించేందుకు కమిటీ ఏర్పాటు
- టీటీడీకు చెందిన భూముల న్యాయపరమైన వివాదాలపై పరిష్కారం కోసం ప్రత్యేక చర్యలు
- టీటీడీలో విధులు నిర్వహిస్తున్న హిందూయేతర ఉద్యోగుల తొలగింపుపై తీర్మానం.
- వచ్చే ఏడాది కాలంలో వివిధ రాష్ట్రాల రాజధానుల్లో శ్రీవారి ఆలయాల నిర్మాణానికి సంబంధించి ప్రత్యేక చర్యలు
- గ్రామాల్లో అర్ధాంతరంగా ఆగిన ఆలయాల నిర్మాణాలకు ఆర్థిక సాయం
- శ్రీనివాస సేవా సమితి పేరుతో స్వామి వారికి కైంకర్యాల సామగ్రి సరఫరాలో జరిగిన అక్రమాలపై విచారణకు ఆదేశం
- టీటీడీ మూలాలున్న వివిధ ప్రాంతాల్లోని ఆలయాల పునరుద్ధరణకు తీర్మానం
- తిరుమలలో అనధికార హాకర్ల తొలగింపునకు విజిలెన్స్, రెవెన్యూ అధికారులతో కమిటీ
- వృద్ధులు, దివ్యాంగులకు ఆఫ్‌లైన్‌లో దర్శన టికెట్లు కేటాయింపు. ప్రయోగాత్మకంగా పూర్వ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయం
- రూ.5,258.68 కోట్లతో తితిదే 2025-26 బడ్జెట్‌కు ఆమోదం
- రూ.772 కోట్లతో గదుల ఆధునికీకరణకు నిర్ణయం

## పీ-4 విధానం.. మొదటి దశలో 20 లక్షల కుటుంబాలకు ప్రయోజనం

### సీఎం చంద్రబాబు



**అమరావతి:** సంపన్నులు-పేదలను ఒకే చోటకు చేర్చడమే లక్ష్యంగా పీ-4 విధానాన్ని రూపొందించినట్లు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఆ విధానంలో భాగస్వాములు కావడానికి ఎన్నారైలతో సహా ఎవరైనా స్వచ్ఛందంగా ముందుకు రావొచ్చన్నారు. ఈ విధానం అమలు ప్రక్రియలో అండగా నిలిచేవారిని మార్గదర్శిగా, లబ్ధిపొందే కుటుంబాలను బంగారు కుటుంబాలుగా వ్యవహరిస్తామన్నారు. పీ-4 విధానంపై సచివాలయంలో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఈ విధానం అమలు తీరుపై సీఎం స్పష్టత ఇచ్చారు. పీ4 అమల్లో భాగంగా.. తొలుత గ్రామ, వార్డు సభల ద్వారా లబ్ధిపొందే కుటుంబాల జాబితా రూపొందిస్తారు. మొదటి దశలో 20 లక్షల కుటుంబాలకు ప్రయోజనం చేకూరనుందని సీఎం తెలిపారు. 2029 నాటికి పేదరికాన్ని నిర్మూలించాలనేదే సంకల్పంగా ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. ఉగాది పండుగ రోజు అమరావతిలో పీ-4 విధానాన్ని ప్రారంభించనున్నట్లు సీఎం చెప్పారు. పేదరిక నిర్మూలన కోసం ఈ కార్యక్రమం నిరంతరం కొనసాగుతూనే ఉంటుందని, ఈ కార్యక్రమానికి ప్రభుత్వ పథకాలకూ ఎలాంటి సంబంధం లేదని చంద్రబాబు తెలిపారు.

## పాఠశాలల్లో 'వాటర్ బెల్' విధానం అమలు చేయాలి

### చంద్రబాబు ఆదేశం

**అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కడా తాగునీటి ఎద్దడి కనిపించకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. నిత్యం నమోదవుతున్న ఉష్ణోగ్రతల సమాచారాన్ని మొబైల్ అలర్ట్స్ ద్వారా ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ మేరకు వేసవి ప్రణాళికపై డిజాస్టర్ మేనేజ్‌మెంట్, పంచాయతీ రాజ్, మున్సిపల్, వైద్యారోగ్య శాఖల అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ముందస్తు జాగ్రత్తలతో తీసుకోవడం ద్వారా వడదెబ్బ మరణాలు తగ్గించాలన్నారు. తీవ్ర వడగాలులు వీచే అవకాశమున్న ప్రాంతాల్లో మజ్జిగ కేంద్రాలు, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. పాఠశాలల్లో వాటర్ బెల్ విధానం అమలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అడవుల్లో అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని.. డ్రోన్లతో పరిస్థితిని పర్యవేక్షించాలని సీఎం సూచించారు.

## రెడ్‌వైన్ కూడా సురక్షితం కాదు

### ఎలాంటి మద్యంతోనైనా క్యాన్సర్ ముప్పు



**హ్యూస్టన్:** మద్యంలో రెడ్‌వైన్ ఆరోగ్యకరమని కొందరు భావిస్తుంటారు. అయితే ఆ వాదన తప్పని తాజా పరిశోధన చెబుతోంది. రెడ్‌వైన్, వైట్ వైన్ తాగేవారిలో క్యాన్సర్ ముప్పు ఒకేలా ఉందని పేర్కొంది. అమెరికాలోని బ్రౌన్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు ఈ పరిశోధన చేశారు. ఇందులో భాగంగా వారు 42 అధ్యయనాల్లో వెల్లడైన డేటాను విశ్లేషించారు. "రెడ్‌వైన్‌లో రెస్‌వెరట్రాల్ వంటి యాంటీఆక్సిడెంట్లు ఉంటాయని, అందువల్ల అది ఆరోగ్యకరమని భావిస్తుంటారు. అయితే ఈ పానీయం క్యాన్సర్ ముప్పును తగ్గిస్తుందనడానికి గట్టి ఆధారాలేమీ మాకు లభించలేదు" అని పరిశోధనకు నాయకత్వం వహించిన యున్‌యంగ్ చో పేర్కొన్నారు. వైట్ వైన్ వల్ల మహిళల్లో క్యాన్సర్ ముప్పు ఎక్కువని కూడా వీరి అధ్యయనంలో వెల్లడైంది. చర్మ క్యాన్సర్ ముప్పును అది 22 శాతం మేర పెంచుతుందని తేలింది. అయితే సూర్యకాంతికి ఎక్కువగా లోనుకావడం వంటి జీవనశైలికి సంబంధించిన అంశాలు కూడా ఇందులో పాత్ర పోషించి ఉండొచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు. నిత్యం తాగే ప్రతి గ్లాసు రెడ్‌వైన్‌కు 5 శాతం చొప్పున క్యాన్సర్ ముప్పు పెరగొచ్చని పేర్కొన్నారు. ఈ లెక్కన మద్యం ఏ రూపంలో ఉన్నా ముప్పు పొంచి ఉంటుందని అర్థమవుతున్నట్లు తెలిపారు.

## ఏసర్ ఇండియాలో మహిళా ఉద్యోగులకు నెలసరి సెలవు



ప్రముఖ ఇంజినీరింగ్ సంస్థ ఎల్‌అండ్‌టీ బాటలోనే ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల సంస్థ ఏసర్ ఇండియా మహిళా ఉద్యోగులకు ఊరటనిచ్చే నిర్ణయాన్ని ప్రకటించింది. నెలసరి సమయంలో ఒక రోజు పెయిడ్ లీవ్‌ను ఇవ్వనున్నట్లు వెల్లడించింది. ఇది మహిళల సాధారణ సెలవులపై ఎలాంటి ప్రభావం లేకుండా నెలసరి సమయంలో ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వడానికి వీలు కల్పిస్తుందని తెలిపింది. మాతృక పేరిట ఈ లీవ్‌ను అందించనుంది. " మాతృక నెలసరి విధానంతో.. మహిళల ఆరోగ్యం, శ్రేయస్సుపై ప్రత్యేక దృష్టిసారించాం" అని ఏసర్ ఇండియా అధ్యక్షుడు, మేనేజింగ్ డైరెక్టర్ హరీష్ కోహ్లీ అన్నారు. కొన్నివారాల క్రితం ఎల్‌అండ్‌టీ సంస్థ ఈ తరహా లీవ్‌ను ప్రకటించింది. దానివల్ల సుమారు 5 వేల మంది మహిళా ఉద్యోగులకు ప్రయోజనం చేకూరుతోంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమంలో ఎల్‌అండ్‌టీ ఛైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ ఆ మేరకు ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. ఎల్‌అండ్‌టీ మాతృ సంస్థలో పనిచేసే ఉద్యోగులకు మాత్రమే ఈ ప్రయోజనం వర్తించనుంది. ఫైనాన్షియల్, టెక్నాలజీ వంటి అనుబంధ సంస్థల్లో పనిచేసే వారికి వర్తించదు. ఇక, ఇప్పటికే స్విగ్గీ, జొమాటో వంటి సంస్థలు ఇదే తరహా ప్రకటన చేశాయి. బిహార్, ఒడిశా, సిక్కిం, కేరళ రాష్ట్రాలు సైతం నెలసరి సెలవు విషయంలో పాలసీని అమలు చేస్తున్నాయి. సుప్రీంకోర్టు గతేడాది ఈ విషయంలో ఓ పాలసీని రూపొందించాలని ప్రభుత్వానికి సూచించింది. నెలసరి సెలవులు మంచి నిర్ణయమే అయినప్పటికీ.. దానివల్ల మహిళలు ఉద్యోగ అవకాశాలకు దూరంకాకుండా చూసుకోవాలని అభిప్రాయపడింది.

## కునాల్ క్షమాపణలు చెప్పాలి

### శిందేపై కమెడియన్ వివాదాస్పద వ్యాఖ్యలపై ఫడణవీస్ ఆగ్రహం



**ముంబయి:** మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ శిందేపై స్టాండప్ కమెడియన్ కునాల్ కమ్రా చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. దీనిపై మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్ స్పందించారు. "నేను హాస్యానికి వ్యతిరేకం కాదు. అయితే ఆ పేరుతో ఇతరులను అగౌరవపరచడం ఆమోదయోగ్యం కాదు. దిగజారుడు హాస్యం, డిప్యూటీ సీఎంను అగౌరవపరచడం సరికాదు. ఈ వ్యాఖ్యలపై క్షమాపణలు చెప్పాలి" అని కునాల్ తీరును ఖండించారు. అతడిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. మరో డిప్యూటీ సీఎం, ఎన్‌సీపీ నేత అజిత్ పవార్ కూడా ఈ వ్యవహారంపై స్పందిస్తూ.. "ఎవరూ చట్ట పరిధి దాటి వ్యవహరించకూడదు. ఎవరైనా హద్దుల్లో ఉండే మాట్లాడాలి. ఒక్కొక్కరికి భిన్నమైన అభిప్రాయాలు ఉండొచ్చు. కానీ వారి మాటల ద్వారా పోలీసుశాఖ జోక్యం చేసుకొనే పరిస్థితి ఉండకూడదు" అని హెచ్చరించారు. ఖార్ ప్రాంతంలోని ది యూనికాంటినెంటల్ హోటల్‌లోని హాబిటాట్ కామెడీ క్లబ్‌లో కునాల్ కమ్రా షో జరిగింది. ఇందులో కమ్రా.. డిప్యూటీ సీఎంను ఉద్దేశిస్తూ ఓ జోక్ వేశారు. "శివసేన నుంచి శివసేన బయటికి వచ్చింది. ఎన్సీపీ నుంచి ఎన్సీపీ విడిపోయింది. అంతా గందరగోళంగా ఉంది" అంటూ మహారాష్ట్ర రాజకీయాల గురించి మాట్లాడిన కమెడియన్.. ఏక్‌నాథ్ శిందేను ద్రోహిగా అభివర్ణించారు. ఈసందర్భంగా 'దిల్ తో పాగల్ హై' అనే హిందీ పాటలోని చరణాలను రాజకీయాలకు అనుగుణంగా మార్చి అవమానకర రీతిలో పాడారు. దీనికి సంబంధించిన వీడియోను శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్‌రౌత్ 'ఎక్స్'లో పోస్ట్ చేస్తూ 'కునాల్ కా కమల్' అంటూ ఎద్దేవా చేశారు. కమెడియన్ వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తంచేసిన శివసేన కార్యకర్తలు.. ఆదివారం రాత్రి ఆ షో జరిగిన హోటల్‌పై దాడి చేశారు. కమ్రా క్షమాపణలు చెప్పాల ని డిమాండ్ చేస్తూ దాడికి పాల్పడ్డారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి కొంతమంది శివసేన కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు, తాజా పరిణామాల నేపథ్యంలో తమ క్లబ్‌ను మూసివేస్తున్నట్లు హాబిటాట్ స్టూడియో ప్రకటించింది.

## బీచ్ పర్యాటకానికి ఊతమిచ్చేలా ప్రభుత్వ చర్యలు : మంత్రి దుర్గేశ్



**విశాఖ:** విశాఖ రుషికొండ బీచ్‌లో మంత్రి కందుల దుర్గేశ్ బ్లూఫ్లాగ్ ఎగురవేశారు. కొన్ని రోజుల క్రితం తాత్కాలికంగా బ్లూఫ్లాగ్ సర్టిఫికేషన్‌ను డెన్మార్క్ సంస్థ నిలిపేసింది. ప్రస్తుతం ఇక్కడి పరిస్థితులను చక్కదిద్దడంతో మళ్లీ బ్లూఫ్లాగ్ సర్టిఫికేషన్ లభించింది. ఈక్రమంలో రెండు రోజుల క్రితం ఫ్లాగ్‌ను జిల్లా కలెక్టర్‌కు సంస్థ ప్రతినిధులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేశ్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ పర్యాటకుల ఆకర్షణకు బ్లూ ఫ్లాగ్ తోడ్పడుతుందన్నారు. బీచ్ పరిశుభ్రతకు పర్యాటకులు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. రాష్ట్రంలో బీచ్ పర్యాటకానికి మరింత ఊతమిచ్చేలా ప్రభుత్వ చర్యలు ఉంటాయన్నారు.

## రాహుల్ గాంధీ పౌరసత్వంపై కేంద్రానికి 4 వారాల గడువు




**లఖ్‌నవూ:** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పౌరసత్వం అంశంలో కేంద్రానికి అలహాబాద్ హైకోర్టు గడువు నిర్దేశించింది. నాలుగు వారాల్లో పౌరసత్వం అంశం తేల్చాలని సూచించింది. న్యాయస్థానానికి 8 వారాల గడువు కోరగా.. నాలుగు వారాల గడువు ఇస్తూ తదుపరి విచారణను లఖ్‌నవూ బెంచ్ ఏప్రిల్ 21కి వాయిదా వేసింది. ఆ లోగా స్టేటస్ రిపోర్ట్‌ను కేంద్రం కోర్టుకు సమర్పించాల్సి ఉంటుంది. రాహుల్ గాంధీ పౌరసత్వం అంశం కొన్నేళ్లుగా వివాదం నలుగుతూనే ఉంది. రాహుల్ గాంధీ బ్రిటన్ పౌరుడని, భారత పౌరసత్వాన్ని రద్దు చేయాలంటూ భాజపా నేత సుబ్రహ్మణ్య స్వామి, కర్ణాటకకు చెందిన భాజపా కార్యకర్త విఘ్నేశ్ శిశిర్ వేసిన పిటిషన్లపై న్యాయస్థానం తాజా ఆదేశాలు ఇచ్చింది. బ్రిటన్‌లో నమోదైన ఓ కంపెనీకి రాహుల్ గాంధీ డైరెక్టర్, సెక్రటరీగా ఉన్నారని సుబ్రహ్మణ్య స్వామి కొంతకాలంగా చెబుతున్నారు. ఆ కంపెనీ వార్షిక నివేదికలో తనను తాను బ్రిటిష్ పౌరుడిగా గాంధీ పేర్కొన్నట్లు స్వామి తెలిపారు. వేరే దేశంలో పౌరుడిగా ఉన్న వ్యక్తి ఆ దేశ పౌరసత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకోవాల్సి ఉంటుందన్నారు. అలా చేయకపోవడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 9, భారతీయ పౌరసత్వ చట్టం, 1955ని ఉల్లంఘించడమే అవుతుందని పేర్కొన్నారు. ఇదే అంశంపై గతంలో కేంద్రానికి లేఖ రాశారు. తన వద్ద రాహుల్‌గాంధీ పౌరసత్వానికి సంబంధించిన యూకే ప్రభుత్వం సమర్పించిన రికార్డులు ఉన్నాయని విఘ్నేశ్ చెబుతున్నారు.



## ఏపీఐఐసీలో అవినీతిపై విచారణకు ఆదేశాలు

### సమగ్ర విచారణకు ఆదేశించిన రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి యువరాజ్

**అమరావతి, ఆర్గాన్ న్యూస్, మార్చి 24:** ఏపీఐఐసీలో అక్రమ వసూళ్ల వ్యవహా రంపై రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి యువరాజ్ విచారణకు ఆదేశించారు. ఆన్లైన్ సేవలకు రేటు కట్టి ఒక్కో అప్లికే షన్‌కు రూ.20 వేల నుంచి 30 వేల చొప్పున ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల్ని నిలువుదోపిడీకి గురిచేస్తున్నారన్న విషయాన్ని మీడియా వెలుగులోకి తెచ్చింది. దీనిపై తీవ్రంగా స్పందించిన యువరాజ్ ఏపీఐఐసీ అధికారుల్ని విచారణకు ఆదేశించారు. ఈక్రమంలో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఆన్లైన్ను ఆసరాగా చేసుకొని కొందరు ఔట్సోర్సింగ్ సిబ్బంది దండిగా సంపాదిస్తున్నారనేది బహిరంగ రహస్యం. వీరికి కొందరు అధి కారుల ప్రోత్సహం ఉండటంతో సమగ్ర విచారణ నిర్వహిస్తే మొత్తం వ్యవహారం బహిర్గతమయ్యే ప్రమాదం ఉందని అక్రమార్కులు బెంబెలెత్తుతున్నారు. ఆన్లైన్ దరఖాస్తులు, ఈవోటీల వ్యవహారంపై ఉన్నతాధికారులు సమగ్ర దర్యాప్తు నిర్వహిస్తే వాస్తవాలు వెలుగు చూసే అవకాశం ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి.ఒక పక్కన పరిశ్రమలు నెలకొల్పేందుకు ముందుకు రమ్మని ప్రభుత్వం రెడ్ కార్పెట్ వేసి పిలుస్తుంది.. మరో పక్కన అప్లికేషన్లకే వేలల్లో వసూళ్లు చేస్తున్న విషయం వెలుగులోకి రావడంతో విచారణ తరువాత ప్రభుత్వం ఎలా స్పందిస్తుందోనని అన్ని వర్గాల నుండి ఆత్రుత కనిపిస్తుంది. దీన్ని వెలుగులోకి తేవడానికి ఎమ్మెల్యే సోమిరెడ్డి అసెంబ్లీలో ప్రస్థావించడం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది.



## రాష్ట్ర బ్రాహ్మణ సంఘం బాధ్యులకు సన్మానం

**సంగారెడ్డి ప్రతినిధి, ఆర్గాన్ న్యూస్, మార్చి 24 :** తెలంగాణ బ్రాహ్మణ సంఘాల సమాఖ్య నూతన కార్యవర్గాన్ని సంగారెడ్డి జిల్లాకు చెందిన సంఘ బాధ్యులు కలిసి అభినందనలు తెలియజేసారుసంఘ నూతన చైర్మన్ వీ. జగన్మోహన్ శర్మ, అధ్యక్షులు మొతుకూరి రామమోహన్ రావ్ ప్రధాన కార్యదర్శి వైద్య ప్రభాకర్ శర్మ, కోశాధికారి సముద్రాల విజయం సారధి లను సోమవారం రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయ భాస్కర్ దేశపాండే రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి రాజశేఖర్ కులకర్ణి, కార్యవర్గ సభ్యులు రవిశంకర్ కుమార్ శ్యామ్‌రావు పట్వారీ వాసుదేవరావు శిరీష అశోక్ వసంత్ రావు పాండురంగా రావు, మారుతీ రావు లు కలిసి శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

# జస్టిస్ యశ్వంత్ వర్మ వ్యవహారం..

## కొలీజియం కీలక నిర్ణయం



**న్యూఢిల్లీ :** ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో భారీఎత్తున నోట్ల కట్టలు బయటపడినట్లు వచ్చిన వార్తలు సంచలనం సృష్టించాయి. ఈ నేపథ్యంలో జస్టిస్ వర్మ వ్యవహారంలో సుప్రీంకోర్టు కొలీజియం సోమవారం కీలక నిర్ణయం తీసుకుంది. ఆయన్ను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలని సిఫారసు చేసింది. దీనిపై కేంద్రం ఆమోదం లభించాక తుది ప్రకటన వెలువడనుంది. న్యాయమూర్తి అధికార నివాసంలో అగ్నిప్రమాదం జరగడంతో.. ఆర్పేందుకు వెళ్లిన సిబ్బందికి అనుకోకుండా అక్కడ భారీగా నోట్ల కట్టలు దర్శనమిచ్చినట్లు వార్తలు రావడంతో సుప్రీంకోర్టు కొలీజియం ఈ అంశంపై అత్యవసరంగా విచారణ ప్రారంభించింది. జస్టిస్ యశ్వంత్‌వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేసే ప్రక్రియను ప్రారంభించినట్లు ఇదివరకే పేర్కొంది. అయితే ఆ నిర్ణయంపై కొలిజియంలోని కొందరు సభ్యుల నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది. ఇదిలా ఉంటే.. ఈ రోజు ఢిల్లీ హైకోర్టు రిజిస్ట్రీ కీలక ప్రకటన చేసింది. ఆయనను న్యాయపరమైన విధులకు దూరంగా ఉంచుతూ నిర్ణయం తీసుకుంది. తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు అది అమల్లో ఉంటుందని తెలిపింది. కానీ ఇంతలోనే కొలీజియం ఈ నిర్ణయం తీసుకుంది. జస్టిస్ వర్మ మాత్రం తనపై వచ్చిన ఆరోపణలను ఖండించారు. ఢిల్లీ హైకోర్టు సీజేకు ఇచ్చిన సమాధానంలో ఆయన ఈమేరకు స్పష్టం చేశారు. తాను గానీ, తన బంధువులు గానీ ఎటువంటి నోట్ల కట్టలను గదిలో ఉంచలేదని తెలిపారు. తన ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు జరిగిన కుట్రగా దీనిని పేర్కొన్నారు. తమ నగదు ఉపసంహరణలు బ్యాంకుల ద్వారానే జరుగుతాయని, తాము యూపీఐ యాప్‌లను వాడతామని, కార్డులతో లావాదేవీలు జరుపుతామని వివరించారు. తాము ఆ గదిని.. సాధారణంగా ఉపయోగంలో లేని ఫర్నిచర్, సీసాలు, క్రాకరీ, పరుపులు, కార్పెట్లు, పాత స్పీకర్లు, గార్డెన్ వస్తువులను ఉంచడానికి వాడతామని తెలిపారు. జస్టిస్ వర్మపై వచ్చిన ఆరోపణలను సుప్రీంకోర్టు మాజీ జడ్జి జస్టిస్ మార్కండేయ కట్జు తోసిపుచ్చారు. మూడు తరాలుగా ఆయన కుటుంబం గురించి తనకు తెలుసని పేర్కొన్నారు.



# పార్లమెంటు సభ్యుల వేతనాలు పెంపు

**న్యూఢిల్లీ :** పార్లమెంటు సభ్యులకు ప్రతి నెలా అందే వేతనాలు, పెన్షన్లను కేంద్రం పెంచింది. ద్రవ్యోల్బణ సూచీ ఆధారంగా ఎంపీల జీతాన్ని దాదాపు 24శాతం మేర పెంచుతూ పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో ఒక్కో ఎంపీ వేతనం నెలకు రూ.లక్ష నుంచి రూ.1.24లక్షలకు పెరగనుంది. అలాగే, సిట్టింగ్ సభ్యుల రోజువారీ భత్యాన్ని రూ.2వేల నుంచి 2,500కు పెంచుతున్నట్లు పేర్కొంది. మాజీ పార్లమెంటు సభ్యులకు ప్రస్తుతం ఇస్తున్న పెన్షన్‌ను రూ.25వేల నుంచి రూ.31వేలకు పెంచుతున్నట్లు నోటిఫికేషన్‌లో వెల్లడించింది. పెంచిన ఈ వేతనాలను 2023 ఏప్రిల్ 1 నుంచి వర్తింపజేస్తున్నట్లు తెలిపింది.

# భర్త సొమ్ములిస్తే.. ప్రియుడితో బెట్టింగ్ ఆడించి

## మేరఠ్ హత్య కేసులో కీలక విషయాలు



**మేరఠ్:** ప్రేమించి పెళ్లాడిన భర్తను ప్రియుడి సాయంతో కట్టుకున్న భార్యే దారుణంగా హత్య చేసి, ముక్కలు చేసిన ఘటన సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఉత్తర్‌ప్రదేశ్‌లోని మేరఠ్‌లో చోటుచేసుకున్న మర్చంట్ నేవీ అధికారి సౌరభ్ రాజ్‌పుత్ హత్య కేసులో పోలీసులు ముమ్మర దర్యాప్తు సాగిస్తున్నారు. ఈసందర్భంగా పలు కీలక విషయాలు వెలుగుచూస్తున్నాయి. నిందితురాలు ముస్కాన్ రస్తోగి తన భర్త సంపాదించిన డబ్బులను ప్రియుడు సాహిల్ శుక్లాకు ఇచ్చినట్లు తెలిసింది. ఆ సొమ్ముతో బెట్టింగ్ ఆడించి వచ్చిన డబ్బుతో వీరిద్దరూ విహారయాత్రలకు వెళ్లినట్లు పోలీసు వర్గాల సమాచారం. విదేశాలకు వెళ్లిన సౌరభ్.. తన భార్య, కుమార్తె అవసరాల కోసం ప్రతినెలా రూ.లక్ష చొప్పున పంపించేవాడని దర్యాప్తులో తేలింది. ఆ డబ్బులు తన అకౌంట్‌లో పడగానే ముస్కాన్ ఆ విషయాన్ని ప్రియుడికి చేరవేసేదట. ఆ డబ్బుతో సాహిల్ క్రికెట్ మ్యాచ్‌లపై బెట్టింగ్ పెట్టేవాడని పోలీసువర్గాలు పేర్కొన్నాయి. అక్కడ వచ్చిన డబ్బుతో వీరిద్దరూ రిషికేశ్, డెహ్రాడూన్ వంటి ప్రాంతాలకు ట్రిప్‌లకు వెళ్లినట్లు తెలిసింది. సాహిల్‌కు ఎలాంటి ఉద్యోగం లేదని, గ్యాంబ్లింగ్‌లో వచ్చిన డబ్బులతోనే జల్సాలు చేసేవాడని స్థానికులు చెబుతున్నారు.

### మందుల చీటీ మార్చి..

కాగా.. సౌరభ్‌ను హత్య చేసేందుకు ముస్కాన్ పక్కాగా ప్లాన్ చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఇందుకోసం మందుల చీటీని ఫోర్జరీ చేసి నిద్రమాత్రలు సంపాదించినట్లు తెలిసింది. "ఫిబ్రవరి 22న ముస్కాన్ స్థానికంగా ఉన్న ఓ వైద్యుడి వద్దకు వెళ్లింది. ఆందోళన సమస్యతో బాధపడుతున్నానని చెప్పి మందులు రాయించుకుంది. ఆ తర్వాత ఓ ఖాళీ ప్రిస్క్రిప్షన్ పేపర్‌ను సంపాదించి అందులో ఆ మందులు రాసింది. వాటితో పాటు నిద్ర మాత్రల గురించి ఆన్‌లైన్‌లో తెలుసుకొని ఆ పేర్లను చేర్చింది. తొలుత ఫిబ్రవరి 25నే అతడిని హత్య చేసేందుకు ప్రయత్నించింది. ఆ రోజున సౌరభ్ మద్యం తాగకపోవడంతో ఆమె ప్లాన్ ఫెయిల్ అయ్యింది. ఆ తర్వాత మార్చి 4న అతడికి నిద్ర మాత్రలు ఇచ్చి ప్రియుడితో కలిసి అతి దారుణంగా హత్య చేసింది" అని పోలీసు వర్గాలు వెల్లడించాయి. సౌరభ్ రాజ్‌పుత్(29), ముస్కాన్(27) 2016లో ప్రేమవివాహం చేసుకున్నారు. సౌరభ్ మర్చంట్ నేవీలో పని చేసేవాడు. వారికి 2019లో కుమార్తె జన్మించింది. ఆ తర్వాత ముస్కాన్‌కు సాహిల్(25)తో వివాహేతర సంబంధం ఏర్పడింది. సౌరభ్ ఉద్యోగం మానేసి లండన్‌కు వెళ్లి ఓ బేకరీలో పనిచేసేవాడు. గత నెల కుమార్తె పుట్టినరోజు కోసం అతడు ఇండియాకు వచ్చాడు. ఇది నచ్చని ముస్కాన్.. ప్రియుడితో కలిసి ఈ దారుణానికి ఒడిగట్టింది. అనంతరం వీరు మృతదేహాన్ని 15 ముక్కలుగా నరికారు. శరీర భాగాలను ఓ ప్లాస్టిక్ డ్రమ్ములో దాచిపెట్టి పైన సిమెంటుతో కప్పిపెట్టారు.

# విద్యార్థి వీసాలకు అమెరికా కత్తెర


## 41శాతం దరఖాస్తుల తిరస్కరణ




**వాషింగ్టన్ :** విదేశాల్లో పైచదువులు చదవాలన్నది చాలామంది కల. అందులోనూ అమెరికాలో ఉన్నతవిద్య అభ్యసించేందుకు మరింత ఎక్కువ ఇష్టపడుతుంటారు. అలా చాలా దేశాల నుంచి ఏటా ఎంతోమంది విద్యార్థులు అగ్రరాజ్యానికి వెళుతుంటారు. అయితే, గత కొంతకాలంగా ఈ విద్యార్థి వీసాల సంఖ్యకు అమెరికా సర్కారు భారీగా కత్తెర వేస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో ఏకంగా 41శాతం వీసా దరఖాస్తులను తిరస్కరించింది. దశాబ్దం క్రితంతో పోలిస్తే ఎఫ్-1 వీసాల తిరస్కరణ దాదాపు రెట్టింపు కావడం గమనార్హం. అమెరికా విదేశాంగ శాఖ గణాంకాల ప్రకారం.. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఎఫ్-1 వీసాల కోసం 6.79 లక్షల దరఖాస్తులు రాగా.. ఇందులో 2.79 లక్షల (దాదాపు 41శాతం) దరఖాస్తులను అధికారులు తిరస్కరించారు. అంతకుముందు 2022-23 ఆర్థిక సంవత్సరంలో 6.99 లక్షల దరఖాస్తుల్లో 2.53 లక్షల (36శాతం) అప్లికేషన్లకు అధికారులు ఆమోదం తెలపలేదు. 2013-14 ఆర్థిక సంవత్సరంలో 7.69 లక్షల మంది విద్యార్థి వీసాల కోసం దరఖాస్తు చేసుకోగా.. 1.73 లక్షల (23శాతం) అప్లికేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. నాటితో పోలిస్తే గతేడాది సంఖ్య దాదాపు రెట్టింపుగా ఉంది. అయితే, దేశాలవారీగా తిరస్కరణకు గురైన వారి సంఖ్యను అమెరికా వెల్లడించలేదు. కానీ, గతేడాది డిసెంబరు 9 నాటి వరకు ఉన్న గణాంకాల ప్రకారం.. 2024 సంవత్సరం తొలి 9 నెలల్లో భారతీయ విద్యార్థులకు ఎఫ్-1 వీసాలు 38శాతం తగ్గినట్లు తెలిసింది. కొవిడ్ తర్వాత భారతీయ విద్యార్థులకు వీసాలు ఈ స్థాయిలో తగ్గడం ఇదే తొలిసారి. బ్యూరో ఆఫ్ కాన్సులర్ అఫైర్స్ నెలవారీ నివేదికల డేటా ప్రకారం.. 2024 జనవరి నుంచి సెప్టెంబరు మధ్య 64 వేల మంది భారతీయ విద్యార్థులకు ఎఫ్-1 వీసాలను జారీ చేశారు. అంతకుముందు 2023 ఇదే సమయంలో ఈ సంఖ్య 1.03 లక్షలుగా ఉండటం గమనార్హం.

# అమెరికాది దుందుడుకు చర్య

## ఉషా వాన్స్ పర్యటనపై గ్రీన్‌ల్యాండ్ ప్రధాని



**గ్రీన్‌ల్యాండ్ :** అమెరికా అధ్యక్ష కార్యవర్గంలోని కీలక అధికారులు, సెకండ్ లేడీ ఉషా వాన్స్ తమ దేశంలో అనధికారిక పర్యటనకు రానుండటాన్ని గ్రీన్‌ల్యాండ్ తప్పు పట్టింది. దానిని ఓ దుందుడుకు చర్యగా అభివర్ణించింది. ఈమేరకు ప్రధాని మూట్ బి ఎగీడ్ ఓ ఇంటర్వ్యూలో కీలక వ్యాఖ్యలు చేశారు. ఇక అమెరికా జాతీయ భద్రతా సలహాదారు వాల్ట్ పర్యటనపై కూడా ఆయన అభ్యంతరం వ్యక్తంచేశారు. "అమెరికా భద్రతా సలహాదారు గ్రీన్‌ల్యాండ్‌లో ఏం చేస్తున్నారు. మాపై శక్తి ప్రదర్శనకే ఆయన వస్తున్నారు. ఆ పర్యటనతో ట్రంప్ ప్రణాళికలపై అమెరికన్లకు నమ్మకం పెరుగుతుంది" అని వ్యాఖ్యానించారు. మరోవైపు ఇటీవల ఎన్నికల్లో విజయం సాధించిన నేత ఫ్రెడ్రిక్ నీల్సన్ మాట్లాడుతూ తమ దేశమంటే చిన్నచూపును అమెరికన్ల పర్యటన తెలియజేస్తోందన్నారు. ఇక డెన్మార్క్ ప్రధాని ఫ్రెడ్రిక్సన్ ఓ వార్తా సంస్థకు తన స్పందన తెలియజేశారు. అమెరికా ప్రతినిధి బృందం పర్యటనను కొంత తీవ్రంగానే తీసుకోవాల్సి ఉంటుందన్నారు. గ్రీన్‌ల్యాండ్‌లో జరిగే సంప్రదాయ డాగ్‌స్లెడ్ రేస్‌ను వీక్షించేందుకు ఉషావాన్స్ పర్యటించనున్నట్లు శ్వేతసౌధం వెల్లడించింది. అంతేకాదు.. ఉషతోపాటు ఆమె కుమారుడు, అమెరికా ప్రతినిధుల బృందం ఉంటుందని పేర్కొంది. గ్రీన్‌ల్యాండ్ సంప్రదాయాలను ఆమె తెలుసుకొంటారని వెల్లడించింది. 1953 వరకు డెన్మార్క్ గ్రీన్‌ల్యాండ్ కాలనీగానే కొనసాగింది. ఆ తర్వాత దానికి స్వయంపాలనకు సంబంధించిన అవకాశాలు వచ్చాయి. 2009లో తమ భూభాగంపై ఖనిజాలు, శాంతిభద్రతలు, కోర్టులు-చట్టాలపై అధికారాలు సంక్రమించాయి. ఇప్పటికే డెన్మార్క్ చేతిలో భద్రత, విదేశాంగ విధానం, ద్రవ్య పరపతి విధానం ఉన్నాయి. ట్రంప్ కార్యవర్గం గ్రీన్‌ల్యాం డ్‌పై దృష్టి పెట్టడానికి పలు కారణాలున్నాయి. రెండో ప్రపంచ యుద్ధ కాలం నుంచే అక్కడ అమెరికా వైమానిక స్థావరం ఉంది. ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో సోవియట్ నుంచి, తరవాత ఉక్రెయిన్ యుద్ధంలో రష్యా నుంచి ముప్పును ఎదుర్కోవడానికి నాటో సైనిక కూటమి తరఫున అమెరికా ఆ స్థావరాన్ని నిర్వహిస్తోంది. గ్రీన్‌లాండ్, కెనడా, అలాస్కా, నార్వే, స్వీడన్, ఫిన్లాండ్, డెన్మార్క్, రష్యాలు అతిశీతల ఆర్కిటిక్ మహాసముద్ర ప్రాంతంలో ఉన్నాయి. ఇప్పుడు వేసవిలో ఆర్కిటిక్ మహాసముద్ర మంచు దశాబ్దానికి 12.2శాతం చొప్పున కరిగిపోతోంది. మంచు లేని ఆర్కిటిక్ ప్రాంతంలో రవాణా నౌకల సంచారం పెరిగిపోతుంది. అక్కడి అపార చమురు, గ్యాస్ నిక్షేపాలు, అరుదైన లోహాలను తవ్వితీయడానికి పోటీ ముమ్మరమవుతుంది. భూగోళం పై అరుదైన లోహ నిక్షేపాల్లో 25శాతం గ్రీన్‌లాండ్‌లో పోగుపడ్డాయి. ఆర్కిటిక్ మంచు కరిగి ఉత్తర సముద్రమార్గం అందుబాటులోకి వస్తే చైనా, జపాన్‌ల నుంచి సరకులను ఆ మార్గంలోనే అమెరికా, ఐరోపాలకు పంపవచ్చు.

# ట్రంప్ మాజీ కోడలితో టైగర్‌వుడ్స్ ప్రేమాయణం



**లాస్ ఏంజిల్స్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాజీ కోడలితో తాను రిలేషన్‌లో ఉన్నానని గోల్ఫ్ సూపర్‌స్టార్ టైగర్ వుడ్స్ సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ వైరల్‌గా మారింది. వెనెసాతో తాను డేటింగ్ చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. "నీ ప్రేమలో ఉంటే గాల్లో తేలినట్లుంది.. నువ్వు నా పక్కన ఉంటే జీవితం మరింత అద్భుతంగా ఉంటుంది" అని రాసుకొచ్చారు. ఆమెతో కలిసి దిగిన ఫొటోలను పంచుకున్నారు. ఈ విషయంలో తమ వ్యక్తిగత గోప్యతను గౌరవించినందుకు సన్నిహితులకు కృతజ్ఞతలు తెలిపారు. వెనెసా సైతం తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో టైగర్ వుడ్స్‌తో కలిసి దిగిన ఫొటోను షేర్ చేస్తూ తమ బంధాన్ని ధ్రువీకరించారు. ట్రంప్ కుమారుడు డొనాల్డ్ ట్రంప్ జూనియర్‌కు ఆమె మాజీ భార్య కావడంతో ఈ పోస్ట్ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ట్రంప్ జూనియర్ 2005లో వెనెసాను వివాహం చేసుకున్నారు. ఆ తర్వాత వీరి మధ్య విభేదాలు రావడంతో 13 ఏళ్ల తమ వైవాహిక బంధానికి స్వస్తి పలుకుతూ 2018లో విడాకులు తీసుకున్నారు. వీరిద్దరికీ ఐదుగురు సంతానం. అనంతరం ట్రంప్ జూనియర్‌కు 2020లో ఫాక్స్‌న్యూస్ మాజీ హోస్ట్ కింబర్లీతో నిశ్చితార్థం జరిగింది. ఇదిలాఉండగా.. డొనాల్డ్ ట్రంప్ జూనియర్ మరో అమ్మాయితో డేటింగ్‌లో ఉన్నట్లు తాజాగా వార్తలు వస్తున్నాయి. ఆయన ఓ అమ్మాయి చేయి పట్టుకొని నడుస్తున్న దృశ్యాలు అంతర్జాతీయ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. దీంతో కింబర్లీతో ఆయన నిశ్చితార్థాన్ని రద్దు చేసుకున్నారనే ప్రచారం జరుగుతోంది.

# విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు టాస్క్‌ఫోర్స్

## 'సుప్రీం' ఆదేశాలు



**న్యూఢిల్లీ :** విద్యాసంస్థల్లో విద్యార్థులు తరచూ ఆత్మహత్యలకు పాల్పడుతుండడంపై సుప్రీం కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఇటీవల ఐఐటీ-ఢిల్లీలో ఇద్దరు విద్యార్థులు ఆత్మహత్య చేసుకోవడబానికి గల కారణాలపై విచారణ చేపట్టాలని జస్టిస్ జె బి పార్డివాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం పోలీసులను ఆదేశించింది. ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థుల మానసిక ఆరోగ్య సమస్యలను పరిష్కరించేందుకు, ఆత్మహత్యలను నివారించేందుకు 'నేషనల్ టాస్క్‌ఫోర్స్'ను ఏర్పాటు చేయాలని న్యాయస్థానం అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. "విద్యార్థుల భద్రత, శ్రేయస్సు కోసం చర్యలు తీసుకునే బాధ్యత ప్రతి విద్యాసంస్థపై ఉంది. కాబట్టి క్యాంపస్ పరిధిలో ఆత్మహత్య వంటి ఏదైనా దురదృష్టకర సంఘటన జరిగినప్పుడు యాజమాన్యం వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చి.. ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి. అది వారి ప్రాథమిక విధి. దీనికి పోలీసులు కూడా సరైన సమయంలో స్పందించి వేగంగా చర్యలు తీసుకోవాలి" అని ధర్మాసనం పేర్కొంది. విద్యార్థులు మానసిక కుంగుబాటు, ఒత్తిడికి లోనవ్వకుండా వివిధ కార్యక్రమాలు నిర్వహించడం, సామాజిక సంస్థలతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం మొదలైన చర్యలు చేపట్టాలని సూచించింది. ఇటీవల కాలంలో విద్యార్థుల్లో తీవ్రమవుతున్న ఒత్తిడి, మానసిక సమస్యలను వారు ఎవరికీ చెప్పుకోలేని పరిస్థితుల్లో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని కోర్టు పేర్కొంది. వాటికి దారితీసే అంతర్గత కారణాలను నివారించడానికి సరైన మార్గదర్శకాలను రూపొందించాల్సిన సమయం వచ్చిందని అభిప్రాయం వ్యక్తం చేసింది. విద్యార్థుల మానసిక ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికి, ఉన్నత విద్యా సంస్థల్లో ఆత్మహత్యలను నివారించడానికి జాతీయ టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఈ విభాగానికి సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎస్ రవీంద్ర భట్ నాయకత్వం వహిస్తారని పేర్కొంది. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలోని విద్యశాఖ ఉన్నతాధికారులను ఇందులో భాగం చేయాలని అధికారులను ఆదేశించింది.




# టారిఫ్‌ల ఆందోళన వేళ..

## భారత్‌కు అమెరికా వాణిజ్య ప్రతినిధి

**న్యూఢిల్లీ :** అమెరికా వాణిజ్య ప్రతినిధి బ్రెండన్ లించ్ మార్చి 25 నుంచి 29వ తేదీ వరకు భారత్‌లో పర్యటించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. భారత్ అధిక సుంకాలు విధిస్తోందని, ఏప్రిల్ 2 నుంచి ప్రతీకార సుంకాలు తప్పవంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిస్తున్న విషయం తెలిసిందే. ఇతర దేశాలతో ట్రంప్ వాణిజ్య యుద్ధాలను కొనసాగిస్తున్న వేళ ఆ దేశానికి చెందిన వాణిజ్య ప్రతినిధి భారత్‌లో పర్యటించడం ప్రాధాన్యం సంతరించుకుంది. దక్షిణ, మధ్య ఆసియాకు అమెరికా సహాయ వాణిజ్య ప్రతినిధిగా ఉన్న బ్రెండన్ లించ్, యూఎస్ అధికారుల బృందంతో కలిసి వచ్చే నెలలో భారత్ రానున్నారని..ఐదు రోజుల పర్యటనలో భాగంగా ఇరుదేశాల మధ్య వాణిజ్యం, సుంకాల అమలు మొదలైన విషయాల గురించి వాణిజ్య మంత్రి పీయూశ్ గోయల్ సహా ఇతర భారత అధికారులతో చర్చలు జరపనున్నారని అధికారిక వర్గాలు పేర్కొంటున్నాయి. లెవీలు, మార్కెట్ యాక్సెస్‌కు సంబంధించిన సమస్యలను పరిష్కరించే పలు ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాల గురించి కూడా మాట్లాడుకోనున్నట్లు వెల్లడించాయి. భారతదేశంతో పెట్టుబడి, వాణిజ్య సంబంధాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడానికి నిబద్ధతతో ఉన్నామని..త్వరలో భారత అధికారులతో చర్చలు జరపడానికి ఎదురు చూస్తున్నామని బ్రెండన్ లించ్ పేర్కొన్నట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. ట్రంప్ సుంకాల విధింపునకు మరికొద్ది రోజులే గడువున్న నేపథ్యంలో సుంకాలు సంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రయత్నాలు చేస్తున్నామని భారత్ పేర్కొంది. ఇరువురికీ ప్రయోజనకరమైన వాణిజ్య ఒప్పందం కోసం ఓ ఫ్రేమ్‌వర్క్ రూపకల్పనకు అమెరికాతో సంప్రదింపులు చేస్తున్నామని తెలిపింది. "పరస్పరం ప్రయోజనం చేకూరే వాణిజ్య ఒప్పందం కోసం అమెరికా యంత్రాంగంతో వివిధ స్థాయిల్లో సంప్రదింపులు జరుపుతున్నాం. వీటిని ముందుకు తీసుకెళ్లే ప్రక్రియలో ఇరు దేశాలు నిమగ్నమై ఉన్నాయి. వాణిజ్యాన్ని విస్తరించడం, మార్కెట్ యాక్సెస్, సుంకాల తగ్గింపు, సప్లై-చైన్ సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఇవి కొనసాగుతున్నాయి" అని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణ్-ధీర్ జైశ్వాల్ పేర్కొన్నారు.

# కునాల్ కమ్రా వివాదం

## హాబిటాట్ క్లబ్ ఆక్రమణల తొలగింపు..




**ముంబయి:** ప్రముఖ స్టాండప్ కమెడియన్ కునాల్ కమ్రా వ్యాఖ్యలతో ది యూనికాంటినెంటల్ హోటల్‌లోని హాబిటాట్ క్లబ్‌కు కష్టాలు మొదలయ్యాయి. దానిలోని ఆక్రమణలు తొలగించేందుకు బీఎంసీ (బృహన్ ముంబయి కార్పొరేషన్) ఉద్యోగులు ఖార్ వద్దకు చేరుకొన్నారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ప్రతాప్ సర్నైక్ మాట్లాడుతూ ఖార్‌లోని ఆ స్టూడియో అక్రమ నిర్మాణమని.. చర్యలు తీసుకోవాలని ముంబయి కమిషనర్‌ను కోరినట్లు వెల్లడించారు. తాజా పరిణామాలపై ఆయన ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ "ఓ మంత్రిగా నిన్న జరిగిన పరిణామాలకు నేను మద్దతు ఇవ్వను. కానీ, మంత్రి కావడానికి ముందే నేను శివసైనికుడిని. ఆ స్టూడియో అక్రమ నిర్మాణం. అక్కడ ప్రధాని మోదీ సహా పలువురిపై తప్పుడు వ్యాఖ్యలు చేశారు. అసలు అలాంటి అక్రమ స్టూడియోకు కొందరు ఎందుకు మద్దతు తెలుపుతున్నారన్నదానిపై కూడా దర్యాప్తు జరగాలి" అని వ్యాఖ్యానించారు. అసిస్టెంట్ కమిషనర్ వినాయక్ విస్పుటే మాట్లాడుతూ "స్టూడియో యజమాని కొన్ని అక్రమ షెడ్లను నిర్మించారు. వాటిని ఇప్పుడు మేము తొలగిస్తున్నాం. వీటికి నోటీసులతో పనిలేదు" అని వెల్లడించారు. అసలు స్టూడియో ప్లాన్‌ను కూడా పరిశీలించి చర్యలు తీసుకొంటామని తెలిపారు. ఇటీవల హబిటాట్ స్టూడియోలో జరిగిన ఓ కార్యక్రమంలో మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ శిందేపై కునాల్ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. ఆయన్ను ద్రోహితో పోల్చాడు. ఈ సందర్భంగా 'దిల్ తో పాగల్ హై' అనే హిందీ పాటలోని చరణాలను రాజకీయాలకు అనుగుణంగా మార్చి అవమానకర రీతిలో పాడారు. దీంతో శివసేన శిందే వర్గం కార్యకర్తలు ఆ స్టూడియోపై దాడి చేసి ధ్వంసం చేశారు. దీంతో 12 మందిని అరెస్టు చేశారు. మరోవైపు పోలీసులు సోమవారం కునాల్‌పై కూడా ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. తాజగా బీఎంసీ ఉద్యోగులు భారీ పనిముట్లతో అక్కడకు చేరుకొని స్టూడియోలోని అక్రమ నిర్మాణాలను కూల్చివేతలు మొదలుపెట్టారు.



# శిమ్లాలో రన్‌వేపై అదుపుతప్పిన విమానం

**శిమ్లా :** శిమ్లా ఎయిర్ పోర్టులో ఓ భారీ విమాన ప్రమదం త్రుటిలో తప్పింది. అలయన్స్ ఎయిర్ ఫ్లయిట్ నెంబర్ 91821 నేడు రన్‌వే నుంచి అదుపు తప్పి దూసుకెళ్లింది. ఈ విమానంలో హిమాచల్ ప్రదేశ్ డిప్యూటీ సీఎం ముఖేశ్ అగ్నిహోత్రీ, రాష్ట్ర డీజీపీ అతుల్ వర్మ సహా 44 మంది ప్రయాణికులు ఉన్నారు. ఢిల్లీ నుంచి బయల్దేరి శిమ్లాలో ల్యాండింగ్ చేసే సమయంలో విమానం బ్రేకులు ఫెయిల్ అయ్యాయి. దీంతో పైలట్ విషయాన్ని ప్రయాణికులకు తెలియజేసి.. ఎమర్జెన్సీ బ్రేకులు వేసేందుకు తీవ్రంగా ప్రయత్నించాడు. ప్రయాణికులు ఒక్కసారిగా తీవ్ర భయాందోళనలకు లోనయ్యారు. ఈ ప్రమాదంపై అలయన్స్ ఎయిర్ ఇప్పటి వరకు స్పందించలేదు. ఈ విమానం ఢిల్లీ-శిమ్లా-ధర్మశాల-ఢిల్లీ మధ్య ప్రయాణిస్తుంటుంది. "ఈ ఉదయం మేము విమానంలో శిమ్లా చేరుకొన్నాం. ల్యాండింగ్ సమయంలో కొన్ని సమస్యలు ఎదురయ్యాయి. సాంకేతిక అంశాలు నాకు తెలియదు. కానీ, విమానం ఎక్కడ దిగాలో అక్కడ ల్యాండ్ కాలేదు..ఆగాల్సిన చోట ఆగలేదు. రన్‌వే చివరికి దూసుకెళ్లి ఆగింది. వేగాన్ని తగ్గించేందుకు శక్తిమంతమైన బ్రేకులు వేయాల్సి వచ్చింది. ఆ తర్వాత మరో 25 నిమిషాలపాటు విమానంలోనే ఉండిపోవాల్సి వచ్చింది" అని హిమాచల్ ప్రదేశ్ డిప్యూటీ సీఎం అగ్నిహోత్రి తెలిపారు.



# బంతి కనిపిస్తే.. బాదుడే..

## ఈ టోర్నీ మొత్తం మేము ఇలానే ఆడనున్నాం

## భవిష్యత్తులో గత రికార్డు దాటడమే టార్గెట్ : ఇషాన్ కిషన్

బీసీసీఐ కాంట్రాక్టు నుంచి తొలగించడంపై

ఈసందర్భంగా బీసీసీఐ కాంట్రాక్టు నుంచి తొలగించడంపై ఇషాన్‌ను ప్రశ్నించగా.. సానుకూల దృక్పథంతో స్పందించాడు. "పరిస్థితి ఏదైనా సరే.. చెడు గురించి ఆలోచించే వ్యక్తిని కాదు. వర్తమానంలో జీవిస్తాను. బాగా ఆడటం ముఖ్యం.. అది నాకు కూడా మంచిది. నేను ఏం చేస్తానో చివరికి అదే నాకు ఉపయోగపడుతుంది. ప్రతికూల ఆలోచనలు మొత్తం పక్కన పెట్టాలని నిర్ణయించుకొన్నాను. భవిష్యత్తు పైనే దృష్టిపెట్టాను" అని చెప్పాడు.



తొలి మ్యాచ్‌లోనే సన్‌రైజర్స్ హైదరాబాద్ గత రికార్డును బద్దలు కొట్టాలని భావించింది. మ్యాచ్ ముగిసిన తర్వాత ఈ విషయాన్ని సెంచరీ హీరో ఇషాన్ కిషన్ స్వయంగా వెల్లడించాడు. "మ్యాచ్ మధ్యలో వాటర్ బాటిల్‌తో ఒకరు మైదానంలోకి వచ్చారు. 'ఈసారి మనం రికార్డు స్కోర్ (287)ను దాటాలి' అని అన్నారు. వారు దానిని లక్ష్యంగా పెట్టుకొన్నారా..? ఇంకేమైనానా అన్న విషయం తెలియదు. కానీ, మనం ఏదైనా లక్ష్యాన్ని సాధించలేనప్పుడు.. దానికోసం మరోసారి ప్రయత్నం చేయాలనిపిస్తుంది. ఆ లక్ష్యాన్ని మేము రాజస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో సాధించలేదు. రానున్న రోజుల్లో మేం పుంజుకోవడానికి అదే గోల్ అవుతుంది. మాకు మంచి ఆరంభం వచ్చినప్పుడు రికార్డు స్కోర్ సాధించడానికి యత్నిస్తాం" అని పేర్కొన్నాడు. వేలంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ కొనుగోలు చేయగానే.. తొలుత మొబైల్ తీసి అభిషేక్ శర్మకు ఫోన్ చేసినట్లు ఇషాన్ కిషన్ వెల్లడించాడు. "నాడు ఫోన్ చేసిన వెంటనే.. మీరు నా నుంచి ఏం ఆశిస్తున్నారు. నేనొచ్చి ప్రతి బంతిని బాదాలనా..? అని ప్రశ్నించాను. దానికి అభిషేక్ స్పందిస్తూ.. 'అవును. అదే నీ పని. నువ్వు ఇక్కడికి రావడం.. ప్రతిబంతిని చితక్కొట్టడం. ఈ జట్టులో నువ్వు ఎంజాయ్ చేస్తావని అభిషేక్ చెప్పాడు. నేను ఈ మ్యాచ్‌కు ముందే దానిని ఫీల్ అయ్యాను. నాకు అందిన మెసేజ్ చాలా స్పష్టంగా ఉంది. బంతి కనిపిస్తే.. వీరబాదుడు బాదడమే. మ్యాచ్‌లో ప్రతిక్షణం ఆస్వాదించడం. ఈ టోర్నీ మొత్తం మేము అలానే ఆడనున్నాం. మేము చాలా పటిష్ఠమైన స్థితిలో ఉన్నా సరే.. ప్రతి మ్యాచ్‌లో అలానే ఆడతాము" అని ఇషాన్ వెల్లడించాడు. హైదరాబాద్ జట్టు నుంచి అత్యంత వేగవంతమైన మూడో శతకం చేసిన బ్యాటర్‌గా ఇషాన్ నిలిచాడు. గతంలో ట్రావిస్ హెడ్, డేవిడ్ వార్నర్‌లు ఈ జాబితాలో ఉన్నారు. నిన్నటి మ్యాచ్లో ఇషాన్ 47 బంతుల్లో 106 పరుగులు సాధించాడు.



## రోహిత్ మాటలకు ఆశ్చర్యపోయా..

# తర్వాత అర్థమైంది : రమణ్‌దీప్

కేవలం జట్టులోని సభ్యుల బలాలను నమ్ముకోవడమే కాకుండా.. ప్రత్యర్థి పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనాలు వేసి వ్యూహాలు మార్చేవాడు గొప్ప నాయకుడిగా మారతాడు. ఈ విషయంలో రోహిత్ శర్మకు తిరుగులేదు. ముంబయి ఇండియన్స్‌కు ఐదు టైటిళ్లను అందించిన కెప్టెన్‌గా చరిత్రలో నిలిచిపోయాడు. ప్రస్తుతం ముంబయి సారథ్యం లేకపోయినా భారత జట్టుకు మాత్రం నాయకత్వం వహిస్తున్న సంగతి తెలిసిందే. రోహిత్ కెప్టెన్సీలో ముంబయికి ఆడిన ఆల్‌రౌండర్ రమణ్‌దీప్ సింగ్ ఇప్పుడు కేకేఆర్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. గతంలో తనకు ఎదురైన అనుభవం గురించి ఓ పాడ్‌కాస్ట్‌లో రమణ్ వెల్లడించాడు. రోహిత్‌లోని అసలైన నాయకుడు బయటకొచ్చాడని గుర్తు చేసుకున్నాడు. ఎంఎస్ ధోనీ బ్యాటింగ్ చేస్తున్నప్పుడు తన చేతికి బంతినిచ్చాడని పేర్కొన్నాడు. "నా బ్యాటింగ్ నైపుణ్యంపై నాకు నమ్మకం ఉంది. ఐపీఎల్‌లో (2022 సీజన్) తొలిసారి బౌలింగ్ చేసే అవకాశం వచ్చింది. అప్పటి వరకు నాకు ఇలాంటి మెగా లీగ్‌లో ఆడిన అనుభవం లేదు. అసలేం జరుగుతుందో కూడా తెలియదు. బ్యాటర్లకు మంచి రోజైతే వారిని ఆపడం చాలా కష్టం. నేను బౌలింగ్‌కు వచ్చినప్పుడు ధోనీ క్రీజ్‌లో ఉన్నాడు. నాకు బంతినిస్తూ రోహిత్ 'ధోనీ నిన్ను కొట్టాలని అనుకుంటున్నా' అని అన్నాడు. అదేంటి బౌలర్‌తో ఇలా ఎవరైనా అంటారా? అని అనుకొన్నా. కానీ, అప్పటికే సీఎస్కే ఏడు వికెట్లను కోల్పోయింది. వారు మా బౌలింగ్‌లో హిట్టింగ్ చేయడానికి ప్రయత్నిస్తే ఔట్ చేసేందుకు అవకాశం దొరుకుతుంది. అప్పుడు మేం గెలిచేందుకు ఆస్కారం ఉంటుందనేది ప్లానింగ్. రోహిత్ ఈ విషయం చెప్పడంతో అర్థమైంది. గొప్ప కెప్టెన్ మాత్రమే ఇలాంటి స్వేచ్ఛ ఇవ్వగలడు. అందుకే రోహిత్ అసలైన లీడర్" అని రమణ్‌దీప్ వెల్లడించాడు.

# అశుతోశ్ మెరుపులు..

## ఉత్కంఠ పోరులో ఢిల్లీదే విజయం

**విశాఖపట్నం:** ఐపీఎల్-18 సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ బోణీ కొట్టింది. విశాఖపట్నం వేదికగా లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో ఒక వికెట్ తేడాతో విజయం సాధించింది. 210 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ 19.3 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి విజయాన్ని ఖాతాలో వేసుకుంది. ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన అశుతోష్ శర్మ (66, 31 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్స్‌లు) ఢిల్లీ విజయంలో కీలకపాత్ర పోషించాడు. విప్రజ్ నిగమ్ (39బీ 15 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), ట్రిస్టన్ స్టబ్స్ (34, 22 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. ఓపెనర్ ఫాఫ్ డుప్లెసిస్ (29) పరుగులు చేశాడు. లఖ్‌నవూ బౌలర్లలో శార్దూల్ ఠాకూర్, సిద్ధార్థ్, దిగ్వేశ్, రవి బిష్ణోయ్ తలో 2 వికెట్లు తీశారు. లక్ష్యఛేదనకు దిగిన ఢిల్లీకి ఆరంభంలోనే వరుస షాక్‌లు తగిలాయి. శార్దూల్ వేసిన తొలి ఓవర్‌లోనే జేక్ ఫ్రేజర్ (1), అభిషేక్ పొరెల్ (0) వెనుదిరిగారు. సమీర్ రిజ్వీ (4)ని సిద్ధార్థ్ వెనక్కి పంపడంతో ఢిల్లీ రెండు ఓవర్లలోపే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. అక్షర్ పటేల్ (22), డుప్లెసిస్ (29) నిలకడగా ఆడుతూ ఇన్నింగ్స్‌ను గాడిలో పెడుతుండగా.. అక్షర్‌ను దిగ్వేశ్ ఔట్ చేశాడు. కాసేపటికే డుప్లెసిస్‌ను బిష్ణోయ్ వెనక్కి పంపాడు. దీంతో 65 పరుగులకే ఢిల్లీ ఐదు వికెట్లు కోల్పోయి మళ్లీ కష్టాల్లో పడింది. ఈ దశలో ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన అశుతోశ్.. స్టబ్స్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. ఆరంభంలోనే నెమ్మదిగా ఆడిన అశుతోశ్ క్రమంగా దూకుడు పెంచాడు. సిద్ధార్థ్ బౌలింగ్‌లో వరుసగా రెండు భారీ సిక్స్‌లు బాదిన స్టబ్స్ తర్వాతి బంతికే క్లీన్‌బౌల్డ్ అయ్యాడు.

### అశుతోశ్, విప్రజ్ మెరుపులు

అనంతరం క్రీజులోకి వచ్చిన విప్రజ్.. ధాటిగా ఆడేశాడు. బిష్ణోయ్ వేసిన 14 ఓవర్‌లో రెండు ఫోర్లు, ఓ సిక్స్.. షాబాజ్ అహ్మద్ బౌలింగ్‌లో 4,6 రాబట్టాడు. దీంతో 15 ఓవర్లకు ఢిల్లీ 148/6తో నిలిచింది. తర్వాత అశుతోశ్ ఒక్కసారిగా గేర్లు మార్చి ఆడాడు. ప్రిన్స్ యాదవ్ వేసిన 16 ఓవర్‌లో ఓ సిక్స్, ఫోర్ బాదాడు. విప్రజ్ కూడా రెండు బౌండరీలు సాధించాడు. దూకుడుగా ఆడుతున్న విప్రజ్‌ను దిగ్వేశ్ ఔట్ చేశాడు. స్టార్క్ (2) కూడా ఎక్కువ సేపు క్రీజులో నిలవలేకపోయాడు. అయితే, బిష్ణోయ్ వేసిన 18 ఓవర్‌లో చివరి మూడు బంతులకు అశుతోశ్ వరుసగా 6,4,6 బాదేయడంతో ఢిల్లీ పోటీలోకి వచ్చింది. కుల్‌దీప్ (5) ఓ ఫోర్ బాది రనౌట్‌గా వెనుదిరగడంతో ఢిల్లీ ఆలౌట్ అవుతుందేమో అనిపించింది. ప్రిన్స్ వేసిన 19 ఓవర్‌లో చివరి రెండు బంతులకు అశుతోశ్ సిక్స్, ఫోర్ కొట్టడంతో ఢిల్లీ విజయ సమీకరణం 6 బంతుల్లో 6 పరుగులుగా మారింది. చివరి ఓవర్‌లో మోహిత్ (1) నుంచి స్ట్రైకింగ్ అందుకున్న అశుతోశ్ సిక్సర్‌తో మ్యాచ్‌ను ముగించాడు. అంతకుముందు లఖ్‌నవూ 8 వికెట్ల నష్టానికి 209 పరుగులు చేసింది. మిచెల్ మార్ష్ (72, 36 బంతుల్లో 6x4, 6x6), పూరన్ (75బీ 30 బంతుల్లో 6ఐ4, 7ఐ6) అర్ధశతకాలతో చెలరేగారు. డేవిడ్ మిల్లర్ (27, 19 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు) రాణించాడు. మెగా వేలంలో భారీ ధర దక్కించుకున్న కెప్టెన్ రిషభ్‌పంత్ (0, 6 బంతుల్లో) నిరాశపర్చాడు. ఢిల్లీ బౌలర్లలో మిచెల్ స్టార్క్ 3 వికెట్లు పడగొట్టగా.. కుల్‌దీప్ యాదవ్ 2, నిగమ్, ముకేశ్ కుమార్ చెరో వికెట్ తీశారు.





## సెన్సెక్స్ 78వేల పైకి..

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. బ్యాంకింగ్ స్టాక్స్ సూచీలను ముందుండి నడిపించాయి. దీంతో వరుసగా ఆరో ట్రేడింగ్ సెషన్‌లోనూ సూచీలు భారీగా లాభపడ్డాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 1200 పాయింట్లకు పైగా లాభపడడంతో చాలా రోజుల తర్వాత మళ్లీ 78 రోజుల మార్కును అందుకుంది. నిఫ్టీ 23,700 స్థాయిని దాటింది. మదుపర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలోని కంపెనీల మార్కెట్ విలువ దాదాపు రూ.5 లక్షల కోట్ల మేర పెరిగి రూ.418 లక్షల కోట్లకు చేరింది. నిఫ్టీ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు సైతం ఒక శాతం మేర లాభపడ్డాయి. సెన్సెక్స్ ఉదయం 77,456.27 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,905. 51) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 78,107.23 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 1078.87 పాయింట్ల లాభం తో 78వేలకు కాస్త దూరంలో 77,984.38 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 23,700 పాయింట్ల మార్కును దాటింది. చిరికి 307.95 పా యింట్లు లాభపడి 23,658.35 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 35 పైసలు బలపడి 85.64కు చేరింది. సెన్సెక్స్ 30 సూచీ లో ఎన్టీపీసీ, కోటక్ మహీంద్రా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టెక్ మహీంద్రా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు లాభాల్లో ముగిశాయి. టైటాన్, ఇండస్ ఇండ్ బ్యాంక్, జొమాటో, మహీంద్రా అండ్ మహీంద్రా, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 72.54 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 3030 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# బీమాపై జీఎస్టీ 5 శాతం..?



ఆరోగ్య, జీవిత బీమా పాలసీలను జీఎస్టీ నుంచి మినహాయించాలన్న డిమాండ్ చాలా రోజుల నుంచి వినిపిస్తోంది. దీనిపై జీఎస్టీ కౌన్సిల్‌లో పలుమార్లు చర్చించినా నిర్ణయం మాత్రం వాయిదా పడుతూ వస్తోంది. అయితే త్వరలో జరగబోయే సమావేశంలో ఈ పాలసీలపై పన్ను తగ్గించేందుకు జీఎస్టీ కౌన్సిల్ అంగీకరించవచ్చని తెలుస్తోంది. ప్రస్తుతం 18 శాతంగా ఉన్న జీఎస్టీని పూర్తి రద్దుకు బదులు 5 శాతానికి తగ్గించొచ్చని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. "జీవిత, ఆరోగ్య బీమా ప్రీమియంలను జీఎస్టీ నుంచి పూర్తిగా మినహాయించడానికి మేం అనుకూలంగా లేం. కానీ పన్ను రేట్లు తగ్గించాలని కోరుకుంటున్నాం. ఈ దిశగా మా నివేదికను సిద్ధంచేశాం. ఇక దీనిపై నిర్ణయం తీసుకోవాల్సిన బాధ్యత జీఎస్టీ కౌన్సిల్‌దే. కొత్తగా ప్రతిపాదించిన 5 శాతం జీఎస్టీ, పాలసీ తీసుకునేవారిపై భారాన్ని తగ్గిస్తుంది" అని మంత్రుల బృందంలోని సభ్యుడొకరు ఓ ఆంగ్లపత్రికకు వెల్లడించారు. మెజార్టీ సభ్యులు పన్ను తగ్గింపును సమర్థిస్తున్నారు. అటు బీమా సంస్థలు సైతం జీఎస్టీ పూర్తి రద్దును వ్యతిరేకిస్తున్నాయి. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను పొందడానికి అవకాశం లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. బిహార్ డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌధరి నేతృత్వంలోని మంత్రుల బృందం హెల్త్, లైఫ్ ఇన్సూరెన్స్‌లపై నివేదికను ఇప్పటికే జీఎస్టీ కౌన్సిల్ ముందు ఉంచింది. టర్మ్ ఇన్సూరెన్స్‌లపై జీఎస్టీని పూర్తిగా మినహాయించాలని ప్రతిపాదించింది. సీనియర్ సిటిజన్లకు టర్మ్ ఇన్సూరెన్స్‌లు, హెల్త్ ఇన్సూరెన్స్ చెల్లింపులపై పూర్తి మినహాయింపు ఇవ్వాలని పేర్కొంది. అలాగే ఆరోగ్య బీమా పాలసీలపై రూ.5లక్షల వరకు 5 శాతం జీఎస్టీ విధించాలని మంత్రివర్గం ప్రతిపాదించింది. దీనిపై డిసెంబర్ 21న జరిగిన జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో రాష్ట్రాల ఏకాభిప్రాయం వ్యక్తమైనప్పటికీ.. అప్పటికి నిర్ణయం వాయిదా పడింది. ఇటీవల బీమా నియంత్రణ ప్రాధికార సంస్థ జీఎస్టీ కోతపై తన అభిప్రాయాన్ని తెలియజేసిన సంగతి తెలిసిందే. దీంతో ఏప్రిల్ నెలాఖరులో గానీ, మే నెలలో గానీ కౌన్సిల్ సమావేశం ఉండొచ్చు. అక్కడ తుది




## సెల్లర్లకు అమెజాన్ గుడ్‌న్యూస్..

### ఆ ఉత్పత్తులపై జీరో కమీషన్

ప్రముఖ ఇ-కామర్స్ సంస్థ అమెజాన్.. తమ వేదికపై ఉత్పత్తులు విక్రయించే చిన్న విక్రేతలకు గుడ్‌న్యూస్ చెప్పింది. 135 కేటగిరీలకు చెందిన రూ.300 కంటే తక్కువ విలువ కలిగిన 1.2 కోట్ల ఉత్పత్తులకు సెల్లర్ ఫీజును (రిఫరల్ ఫీజు) రద్దు చేస్తున్నట్లు సోమవారం ప్రకటించింది. ఏప్రిల్ 7 నుంచి ఇది అమల్లోకి రానుంది. ఇప్పటివరకు తమ వేదికను ఉపయోగించుకొని ఉత్పత్తులు విక్రయించినందుకు గానూ సెల్లర్ల నుంచి అమెజాన్ కమీషన్ తీసుకుంటుంది. ఈ మొత్తం కేటగిరీని బట్టి 2 శాతం నుంచి 16 శాతం వరకు ఉంటుంది. అమ్మకం ధర ఆధారంగా ఈ ఫీజును నిర్ణయిస్తుంటుంది. దీంతోపాటు వెయిట్ హ్యాండ్లింగ్, షిప్పింగ్ ఛార్జీలను సైతం అమెజాన్ తగ్గించింది. ఈజీ షిప్, సెల్లర్ ఫ్లెక్స్ వంటి ఇతర ఫుల్‌ఫిల్‌మెంట్ ఛానెల్స్ ద్వారా చేసే షిప్పింగ్ రేట్లను రూ.77 నుంచి రూ.65కి తగ్గించినట్లు అమెజాన్ తెలిపింది. వెయిట్ హ్యాండ్లింగ్ ఫీజును సైతం కేజీకి రూ.17 వరకు తగ్గిస్తున్నట్లు పేర్కొంది. సెల్లర్ ఎవరైనా ఒకటికంటే ఎక్కువ వస్తువులను షిప్పింగ్ చేసినప్పుడు రెండో వస్తువుపై 90 శాతం మేర సెల్లింగ్ ఫీజును ఆదా చేసుకోవచ్చని అమెజాన్ ఓ ప్రకటనలో తెలిపింది. కొత్త ఫీజు విధానంలో 'రెండు కొంటే 10 శాతం తగ్గింపు' వంటి ఆఫర్లను ప్రకటించడం ద్వారా సెల్లర్లు ఎక్కువ ఆదా చేసుకోవడం వీలుపడుతుందని అమెజాన్ తెలిపింది. తక్కువ ధరకు, మరిన్ని ఉత్పత్తులను విక్రయించుకోవడానికి వీలుగా తమ వేదికను తీర్చిదిద్దే ఉద్దేశంతో ఫీజు విధానంలో మార్పులు చేపట్టినట్లు అమెజాన్ ఇండియా డైరెక్టర్ అమిత్ నందా తెలిపారు. చిన్న విక్రేతలకు ఇది ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. 2024 సెప్టెంబర్‌లోనూ 59 రకాల ఉత్పత్తులపై సెల్లర్ ఫీజును 3 నుంచి 12 శాతం మేర తగ్గించింది.

ఆర్గాన్ న్యూస్
సినిమా / CINEMA
www. organnews.in
organ.today@gmail.com
@organnews



## ఇంతకంటే గొప్ప విషయం ఏముంటుంది..

### సల్మాన్‌తో వర్క్‌పై రష్మిక కామెంట్స్

సల్మాన్‌ఖాన్‌తో పనిచేయడం కంటే పెద్ద విషయం మరొకటి ఉండదని రష్మిక అన్నారు. ఈ అగ్ర హీరోతో కలిసి 'సికందర్' అంటూ సందడి చేయడానికి సిద్ధమయ్యారు రష్మిక. మార్చి 30న ఈ సినిమా విడుదల కానుంది. ఈసందర్భంగా చిత్రబృందం ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించింది. అందులో సల్మాన్, దర్శకుడు మురుగదాస్‌తో కలిసి వర్క్ చేయడంపై రష్మిక మాట్లాడింది. "ఈ సినిమాను చూడడం కోసం ఆడియన్స్‌తో పాటు నేను కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. మీరంతా దీన్ని ఆదరిస్తారని ఆశిస్తున్నా. సల్మాన్‌తో కలిసి స్క్రీన్ పంచుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. ఇంతకంటే పెద్ద విషయం ఏముంటుంది. 8 ఏళ్ల క్రితం ఇండస్ట్రీకి వచ్చాను. మురుగదాస్ సినిమాల్లో నటించాలని ఎప్పటినుంచో కోరుకున్నాను. ఆయన రచనల్లో, సినిమాల్లో ప్రత్యేకత ఉంటుంది. ఎన్నో భావోద్వేగాలు ఉంటాయి. సికందర్‌లో అవకాశం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను. ఈ సినిమా కోసం నిర్మాతలు నన్ను సంప్రదించినప్పుడు ఆశ్చర్యపోయా. ఇందులో కాజల్ అగర్వాల్‌తో కలిసి నటించడం ఆనందాన్నిచ్చింది. భవిష్యత్తులోనూ ఆమెతో కలిసి నటించడానికి సిద్ధంగా ఉన్నాను" అని చెప్పారు. యాక్షన్ థ్రిల్లర్ మూవీగా 'సికందర్' రూపొందింది. ఈద్ కానుకగా మార్చి 30న ప్రేక్షకుల ముందుకురానుంది. ఇందులో ఎన్నో సర్‌ప్రైజ్‌లు ఉన్నాయని దర్శకుడు ఇటీవల తెలిపారు. ఇప్పటివరకూ విడుదల చేసిన పాటలకు మంచి స్పందన వచ్చింది. రష్మిక, సల్మాన్‌ఖాన్‌లు వారి డ్యాన్స్‌తో అందరినీ ఆకట్టుకుంటున్నారు.



## వాటిపై దృష్టిపెడితే సరిగ్గా నటించలేను : అదా శర్మ

'ది కేరళ స్టోరీ'తో దర్శక-నిర్మాతలు సుదీప్తోసేన్, విపుల్ అమృత్‌లాల్ షా విజయాన్ని అందుకున్నారు. వీరిద్దరూ కలిసి తెరకెక్కించిన చిత్రం 'బస్తర్: ది నక్సల్ స్టోరీ'. అదా శర్మ ప్రధాన పాత్రలో రూపొందిన ఈ చిత్రం అనుకున్నస్థాయిలో ప్రేక్షకాదరణను సొంతం చేసుకోలేదు. తాజాగా ఈ సినిమా ఫెయిల్యూర్ గురించి అదా శర్మ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. "ఒక సినిమా ఆదరణ సొంతం చేసుకోలేదంటే దానికి ఎన్నో కారణాలు ఉంటాయి. మంచి సినిమాను అందిస్తున్నామా, లేదా అని చూస్తాను. నాకు వచ్చిన పాత్రకు వంద శాతం న్యాయం చేస్తున్నానా, లేదా అనేది ఆలోచిస్తాను. బాక్సాఫీస్ నంబర్లపై దృష్టిపెడితే సరిగ్గా నటించలేను. మేం 'ది కేరళ స్టోరీ' సినిమా తెరకెక్కించేటప్పుడు అది అంత పెద్ద విజయం సాధిస్తుందని అనుకోలేదు. లేడీ ఓరియంటెడ్ మూవీ అయినప్పటికీ రూ.378 కోట్లు వసూళ్లు చేసి రికార్డు సృష్టించింది. ఆ సినిమాలో నటించేటప్పుడు కూడా నేను బాక్సాఫీస్ నంబర్ల గురించి ఆలోచించలేదు. నా పాత్ర ఎలా చేస్తున్నాను అనేది చూశాను" అని చెప్పారు. బస్తర్ ప్రాంతంలోని సామాన్యులపై మావోయిస్టులు సాగించిన అమానుషాలు.. మందుపాతర పేల్చి 76 మంది సీఆర్పీఎఫ్ జవాన్లను పొట్టనపెట్టుకున్న వైనం తదితర అంశాలతో 'బస్తర్: ది నక్సల్ స్టోరీ'గా తీర్చిదిద్దారు. మావోయిస్టులను అణచివేయడానికి నియమితురాలైన ఐపీఎస్ అధికారి నీరజా మాధవన్‌గా అదాశర్మ కనిపించారు. ప్రస్తుతం ఈ చిత్రం జీ5 వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది.



## వరుణ్ తేజ్ కొత్త సినిమా ఆరంభం

**హైదరాబాద్:** సక్సెస్ కోసం ఎదురుచూస్తున్న నటుడు వరుణ్ తేజ్. ఈక్రమంలోనే ఆయన మేర్లపాక గాంధీ దర్శకత్వంలో ఓ విభిన్నమైన కాన్సెప్ట్ చిత్రానికి సంతకం చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమా పూజా కార్యక్రమం హైదరాబాద్‌లో జరిగింది. చిత్రబృందంతోపాటు దర్శకుడు క్రిష్, వరుణ్ సతీమణి లావణ్య త్రిపాఠి, సోదరి నిహారిక ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. చిత్రబృందానికి ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఇండో - కొరియన్ హారర్ కామెడీ ఫిల్మ్‌గా ఇది సిద్ధం కానుంది. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా దీనిని నిర్మిస్తున్నాయి. తమన్ స్వరాలు అందించనున్నారు. వరుణ్ తేజ్ 15వ చిత్రంగా తెరకెక్కనుంది. ఇందులో ఆయనకు జంటగా రితికా నాయక్ నటించనున్నారు. 'ఎక్స్‌ప్రెస్ రాజా', 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్', 'ఏక్ మినీ కథ' వంటి చిత్రాలను మేర్లపాక గాంధీ తెరకెక్కించిన విషయం తెలిసిందే.





## 'కన్నప్ప'ను ట్రోల్ చేస్తే శివుడి శాపానికి గురవుతారు

**హైదరాబాద్:** సోషల్‌మీడియాలో వచ్చే ట్రోల్స్‌ను పట్టించుకోవాల్సిన అవసరం లేదని, ప్రజలకు అన్నీ తెలుసని కథానాయకుడు మంచు విష్ణు అన్నారు. ఆయన కీలక పాత్రలో ముఖేశ్ కుమార్ సింగ్ దర్శకత్వంలో రూపొందుతున్న ఫాంటసీ మైథలాజికల్ మూవీ 'కన్నప్ప'. తాజాగా 'బుక్ మై షో' ఆధ్వర్యంలో జరిగిన రెడ్ లారీ ఫిలిం ఫెస్టివల్‌లో విష్ణు మాట్లాడారు. ఈసందర్భంగా విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం చెప్పారు. 'మీరు మొదటినుంచి చాలా తెలివిగా మాట్లాడతారు. కానీ, కొంతమంది వాటిని ట్రోల్ చేస్తూ ఉంటారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ప్రభాస్ బాడీ గురించి మాట్లాడినప్పుడు కూడా ట్రోల్ చేశారు. వీటిపై మీరేమంటారు? అని అడగ్గా, 'నేను మాట్లాడిన మాటల్లో ఏదైనా ఒక వాక్యం కట్ చేసి వైరల్ చేసి వివాదం సృష్టించాలనుకుంటే పట్టించుకోవాల్సిన అవసరం లేదు. ప్రజలు చాలా స్మార్ట్. కొంచెం వివాదమైనా పూర్తి వీడియోను చూసి నిజానిజాలు తెలుసుకుంటున్నారు. ఆ తర్వాత న్యూసెన్స్ అనుకుంటున్నారు' అని విష్ణు సమాధానం ఇచ్చారు. ఆ వేదికపైనే ఉన్న నటుడు రఘుబాబు మైక్ అందుకుని, ట్రోల్స్‌పై కాస్త ఘాటుగానే స్పందించారు. 'ఈ సినిమా గురించి ఎవరైనా ట్రోల్స్ చేస్తే, శివుడి ఆగ్రహానికి, శాపానికీ గురవుతారు. గుర్తుపెట్టుకోండి. 100శాతం కచ్చితంగా చెబుతున్నా. ట్రోల్ చేస్తే ఇక ఫినిష్' అన్నారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల వేదికగా వైరల్ అవుతోంది. ఇక 'కన్నప్ప' కోసం న్యూజిలాండ్‌లో 9 వేల ఎకరాల ఫాంను ఆరు నెలలకు అద్దెకు తీసుకున్నట్లు విష్ణు తెలిపారు. అక్కడ షూటింగ్ చేస్తుండగానే తనకు డ్రోన్ తగిలి బలమైన గాయమైందని తెలిపారు. షూటింగ్‌లో వాళ్లందరూ కంగారుపడుతుంటే, తనకు గాయమైన విషయం తన తండ్రి మోహన్‌బాబుకు తెలియనీయొద్దని చెప్పి, ఆస్పత్రికి వెళ్లినట్లు వివరించారు. 'కన్నప్ప'లో పోషించిన రుద్ర పాత్రలో ప్రభాస్ చాలా కొత్తగా కనిపిస్తారని, నటనకు ఫిదా అవుతారని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. తన తండ్రి, నటుడు మోహన్‌బాబుపై ఉన్న ప్రేమ, గౌరవంతోనే ప్రభాస్, మోహన్‌లాల్, అక్షయ్ కుమార్, శరత్‌కుమార్ తదితరులు ఆ చిత్రంలో నటించారని తెలిపారు. నిర్మాతగా వ్యవహరించిన మోహన్‌బాబు కూడా ఓ కీలక పాత్ర పోషించారు. 'మహాభారతం' సీరియల్ ఫేమ్ ముకేశ్ కుమార్ సింగ్ 'కన్నప్ప'కు దర్శకత్వం వహించారు. ఏప్రిల్ 25న సినిమా విడుదల కానుంది.

## 'పుష్ప'లో ఐటమ్ సాంగ్ కోసం కేతికశర్మను అనుకున్నాం : నిర్మాత రవి



ప్రస్తుతం రాబిన్‌హుడ్‌లో కేతికశర్మ పాట సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. యూట్యూబ్‌లో మిలియన్ల వ్యూస్‌తో టాప్‌లో కొనసాగుతోంది. అయితే 'పుష్ప' సినిమాలో ఐటమ్ సాంగ్ కేతిక శర్మ చేయాల్సిందట. తాజాగా ఆ చిత్ర నిర్మాత ఈ విషయాన్ని పంచుకున్నారు. నితిన్ - వెంకీ కుడుముల కాంబోలో రానున్న చిత్రం 'రాబిన్ హుడ్'. మార్చి 28న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది. ఈనేపథ్యంలో ఏర్పాటుచేసిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నిర్మాత రవిశంకర్ మాట్లాడుతూ ఓ ఆసక్తికర విషయం పంచుకున్నారు. "ఈ సినిమాను 'అది దా సర్‌ప్రైజ్' పాటతో కేతికశర్మ మరో స్థాయికి తీసుకెళ్లారు. 'పుష్ప'లో ఐటమ్ సాంగ్ కోసం సమంత కంటే ముందు కేతికను కలవాలనుకున్నాం. కానీ, అప్పుడు మిస్ అయ్యాం. మళ్లీ ఇన్నేళ్లకు ఆమెతో వర్క్ చేసే అవకాశం వచ్చింది. ఈ సినిమాలో ఆమె పాట ఉన్నందుకు చాలా ఆనందంగా ఉంది. శ్రీలీల చాలా బిజీగా ఉండి కూడా తేదీలు సర్దుబాటు చేసుకొని ఇందులో నటించారు" అని చెప్పారు.

### రష్మిక అందుకే 'రాబిన్‌హుడ్' చేయలేదు: దర్శకుడు

ఇక ఈ సినిమాలో హీరోయిన్‌గా మొదట రష్మికను అనుకున్నట్లు దర్శకుడు వెంకీ కుడుముల తెలిపారు. అయితే, డేట్స్ సర్దుబాటుకాకపోవడంతో ఆమె ఈ సినిమాలో నటించలేకపోయిందన్నారు. కథ చెప్పగానే శ్రీలీల అంగీకరించారన్నారు. ఇది ఆమె కెరీర్‌లో గుర్తుండిపోయే సినిమా అవుతుందన్నారు. నితిన్- వెంకీ కుడుముల కాంబోలో రానున్న రెండో చిత్రమిది. ఆస్ట్రేలియా క్రికెటర్ డేవిడ్ వార్నర్ ఈ సినిమాతోనే తెరంగేట్రం చేస్తుండడం విశేషం. ఇప్పటి వరకూ విడుదలైన పాటలు ట్రైలర్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. దీంతో సినిమాపై అంచనాలు ఏర్పడ్డాయి.

## మన నుంచి ఆస్కార్‌ను చాలాసార్లు లాగేసుకున్నారు : దీపికా పదుకొణె

మన దేశంలో ఎంతోమంది టాలెంటెడ్ నటీనటులు ఉన్నారని నటి దీపికా పదుకొణె అన్నారు. తాజాగా దీపికా తన ఇన్‌స్టాలో ఓ వీడియోను పంచుకున్నారు. అందులో ఆస్కార్ గురించి తన వ్యక్తిగత అభిప్రాయాన్ని పంచుకుంటూ ఈ మాట అన్నారు 'చాలాసార్లు మనకు రావాల్సిన ఆస్కార్లను లాగేసుకున్నారు. భారతదేశ సినీ చరిత్రలో ఎన్నో గొప్ప కథలు తెరకెక్కాయి. కానీ ఆ సినిమాలకు, ఆ కథలకు, నటీనటుల ప్రతిభకు గుర్తింపు రాలేదు. 'ఆర్‌ఆర్‌ఆర్'లోని పాటకు ఆస్కార్ ప్రకటించినప్పుడు నేను ప్రేక్షకుల్లో కూర్చొని ఉన్నాను. ఆ సమయంలో ఎంతో భావోద్వేగానికి గురయ్యాను. నిజానికి ఆ సినిమాతో నాకు ఎలాంటి సంబంధం లేదు. నేను ఆ సినిమాలో భాగం కూడా కాదు. కేవలం ఒక భారతీయురాలిగా ఆ క్షణంలో వ్యక్తిగతంగా ఎంతో ఆనందం వేసింది. ఆ క్షణాలను ఎప్పటికీ మర్చిపోలేను. 'ది బ్రూటలిస్ట్' చిత్రానికి గాను ఈ ఏడాది అడ్రియన్ బ్రాడీ ఉత్తమ నటుడిగా ఆస్కార్ గెలిచినందుకు నేను సంతోషించాను" అని చెప్పారు. ఇక 2023లో జరిగిన ఆస్కార్ ప్రదానోత్సవంలో దీపిక 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రంలోని నాటునాటుని ఆడియన్స్‌కు పరిచయం చేసిన సంగతి తెలిసిందే. 'డు యూ నో నాటు?' తెలియకపోతే ఇప్పుడు తెలుసుకుంటారు. 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రం నుంచి 'నాటు నాటు' ఇదే..' అంటూ దీపిక ఈ పాటను పరిచయం చేయడంతో వేదిక మొత్తం చప్పట్లతో మారుమోగింది.



## 'ఓ భామ అయ్యో రామ' టీజర్ రిలీజ్

సుహాస్, మాళవిక మనోజ్ జంటగా రామ్ గోదల తెరకెక్కిస్తున్న చిత్రం 'ఓ భామ అయ్యో రామ'. హరీశ్ నల్ల నిర్మాత. అనిత హస్సానందాని, అలీ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టీజర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. మన కథ 'బొమ్మరిల్లు' సినిమా కాదు.. 'రక్తచరిత్ర' అంటూ హీరోయిన్ చెప్పిన డైలాగు నవ్వులు పూయిస్తోంది

Edited,Printed, Published and Owned by DHANDYALA RAVI KUMAR, Printed at Gayathri Printers, Plot no: 69 to 75, 4th Line, IDA, Khanapuram, Khammam -507002.Telangana.
EDITOR: DHANDYALA RAVI KUMAR. RNI NO: APTEL/2008/26868. Ph: 9848156178, mail: organ.today@gmail.com , website : www.organnews.in